

డిసెంబరు-2025

# దర్శనమ్®

ఆధ్యాత్మిక వార్తామాసపత్రిక

₹ 25/- సంపుటి 22 సంచిక 3 ISSN 2582-2411





అవధాన ప్రతిభాద్యుమణి నాగఫణి

దర్శనమ్ గురుసత్కార విశిష్ట సంచిక

# శృంగేరీ జగద్గురువుల ధర్మవిజయయాత్ర దృశ్యమాలిక

















దర్శనమ్ 21వ వార్షికోత్సవమ్





శృంగేరీ జగద్గురువుల దివ్యాశీస్సులతో...

# దర్శనమ్ 21వ వార్షికోత్సవం

## బృహత్ ద్విసహస్రావధాని, పద్మశ్రీ పురస్కృతులు

## బ్రహ్మశ్రీ డా. మాడుగుల నాగఫణిశర్మగారికి

# గురుసత్కారం



పల్లకీ సేవ

స్వర్ణకంకణ ప్రదానం

పుష్పాభిషేకం

'ధార్మికవరేణ్య' బిరుదు ప్రదానం

జీవన సాఫల్య పురస్కారం

డిసెంబరు 21వతేదీ, 2025

ఆదివారం, సా. 5 గం.లకు

వేదిక : రవీంద్రభారతి , భాగ్యనగరం

ఆస్తిక మహాశయులందరికీ సాదర ఆహ్వానం

మరుమాముల వెంకటరమణ శర్మ , సంపాదకులు,దర్శనమ్

శ్రీ గణేశ శారదా గురుభ్యోనమః   శ్రీమాత్రే నమః   శ్రీ లలితాపరమేశ్వరీ దేవ్యైనమః

శ్రీ లలితా సేవా సమితి తూప్రాన్ వారి ఆధ్వర్యంలో

# శ్రీ లక్ష్మీగణపతి, శ్రీరుద్ర స్వాహాకార పూర్వక అయుత చండీ యాగ మహోత్సవ సమాహ్వానము

**తేది: 22-12-2025 సోమవారం నుండి 26-12-2025 శుక్రవారం వరకు పంచాహ్నిక దీక్షతో**















కార్యస్థలం:

**శ్రీ లలితా పరమేశ్వరీ దేవీ ఆలయం**

వెంకటాపురం (P.T.), తూప్రాన్ పురపాలిక,

జి॥ మెదక్, తెలంగాణ.





అయుత చండీయాగ పత్రికను ఆవిష్కరిస్తున్న
శృంగేరీ జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ మహాస్వామి వారు

శ్లో॥ యాదేవీ సర్వభూతేషు మాతృ రూపేణ సంస్థితా। నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః

శ్లో॥ సకుంకుమ విలేపనామళిక చుంబికస్తూరికాం। సమంద హసితేక్షణాం సశర చాప పాశాంకుశాం॥
అశేష జనమోహినీం అరుణ మాల్యా భూషాంబరాం। జపాకుసుమ భాసురాం జపవిధౌ స్మరేదంబికామ్॥

శ్లో॥ వేంకటాపుర సత్క్షేత్రే సుస్థిరాం కరుణాన్వితామ్। భక్తాభీష్టప్రదాం వందే రవి చిత్త విలాసినీమ్॥

---

**శ్రీ దక్షిణామ్నాయ శృంగేరి శారదా పీఠాధీశ్వరులు జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామి వారు**
**జగద్గురు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ స్వామి వారల దివ్యాశీస్సులతో**



శ్రీ జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహ సంస్థానం పీఠాధీశ్వరులు
జగద్గురు శ్రీశ్రీశ్రీ మదభినవోద్ధండ శంకర భారతీ మహాస్వామి వారి ఆశీరనుగ్రహములతో...

శ్రీశ్రీశ్రీ సాంద్రానంద ఘన స్వరూప శ్రీ నృసింహస్వామి వారు మఠ్ఠిముచ్చాల,
కీ॥శే॥ గౌరీభట్ల రాజేశ్వర శర్మ పౌరాణిక వాచస్పతి కడవేర్గు, శ్రీ యజ్ఞేశానంద నాథ దీక్షా నామాంకితులు
కీ॥శే॥ బ్రహ్మశ్రీ యామవరం రామదత్త శర్మ మంగళపర్తి గారు,
కీ॥శే॥ బ్రహ్మశ్రీ సోమయాజుల రామేశ్వర యజ్వ,

**కీ॥శే॥ బ్రహ్మశ్రీ సోమయాజుల వేంకటేశం శర్మ గారల ఆశీరనుగ్రహములతో...**

కీ॥శే॥ బ్రహ్మశ్రీ సోమయాజుల రాఘవశర్మ గారి నుంచి సోమయాజుల సాయిరాం శర్మ సిద్ధాన్తి వరకు (9) తొమ్మిది తరాలుగా శాక్తేయంలో కొనసాగుతున్న సోమయాజుల రవీంద్ర శర్మ గారి ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న అయుత చండీ మహాయాగం

# గురుస్తవ నవ శ్లోక సుమ మంజరి



శృంగేరీ పురభాసి శాంకరమహాపీఠస్థితం, ప్రాంచితం
సుశ్లోకం, శ్రితలోకవందిత పదం, ప్రేమాస్పదం, శ్రీప్రదం
భస్మోద్భాసిత ఫాలభాగకళయా విచ్ఛేదయంతం తమః
వందే శ్రీవిధుశేఖరం గురువరం వందారుమందారకం 1
అద్వైతామృత తత్త్వచింతనధియా సంభూషితం భాసితం
కాషాయాంబర దండమండితకరం, జ్ఞానాకరం శ్రీకరం
సంసారార్ణవ తారణాయ సుజనై స్సంసేవితం భావితం
వందే శ్రీవిధుశేఖరం గురువరం వందారుమందారకం 2
సాక్షాత్ శారదయా ప్రసాదితవరం, ప్రజ్ఞేశ్వరం, భాస్వరం
సారాచార విశారదం, చ వరదం, శ్రీచంద్రమౌళీశ్వరం
నిత్యంచార్చనశీల మంచిత దయా సల్లక్షణప్రేక్షణం
వందే శ్రీవిధుశేఖరం గురువరం వందారుమందారకం 3
భారత్యాః పరమాకృతిం స్వవచసా సందర్శయంతం పురః
నిత్యం సత్యపథం వదంతమవనౌ సంబోధయంతం హితం
వేదాంతద్యుతిమన్ముఖం చ సుముఖం సర్వాశ్రితానాం పరం
వందే శ్రీవిధుశేఖరం గురువరం వందారుమందారకం 4
మూర్తీభూత మహాప్రశాంతమనఘం దాంతం మహాంతం యతిం
కాణాదాదికనైక శాస్త్రజలధేః కుంభోద్భవం నిర్భవం
కామాద్యంతరరి ద్విపేంద్ర గణభిత్పంచాననం చిద్ఘనం
వందే శ్రీవిధుశేఖరం గురువరం వందారుమందారకం 5
సద్యస్సజ్జన మానసై స్వవినయైః భృంగాయమానై స్సదా
సద్భక్త్యా పరిసేవ్యమాన చరణాంభోజం సుధాభాజనం
శంకాతంక నివారకం, శుభకృతిం, శ్రీశంకరస్యాకృతిం
వందే శ్రీవిధుశేఖరం గురువరం వందారుమందారకం 6
యద్రూపం నతచిత్తమోహపటలీధ్వాంతస్య సూర్యాయతే
యద్వాణీ నిగమాగమార్థ సుజలైః, గంభీర గంగాయతే
యద్దృష్టిః శశి శీతలా, కువలయానందప్రదాత్రీ చ తం
వందే శ్రీవిధుశేఖరం గురువరం వందారుమందారకం 7
తపసారాజితం, విశ్వపూజితం, విజితేంద్రియం
నమామి నమతాం శ్రీదం, విధుశేఖర భారతీం 8
ధర్మసంచార సంపూత దిగంతరమతంద్రితం
తాత్త్వికం, సాత్త్వికం, వందే విధుశేఖరభారతీం 9

ఇత్థం సమర్పయితా మరుమాముల వెంకటరమణ శర్మా ◆ శ్లోక రచయితా గురుచరణరేణుః డా. జి.ఎం. రామశర్మా

# దర్శనమ్

## ఆధ్యాత్మిక వార్తా మాస పత్రిక

**డిసెంబర్ 2025**

సంపుటి-22 విడిప్రతి: రూ. 25/- సంచిక - 3

ISSN 2582-2411 పేజీలు 68

**ఎస్ఆర్ఎస్ పబ్లికేషన్స్ ప్రచురణ**



స్ఫూర్తిప్రదాత

**కీ.శే. మరుమాముల రాజమౌళిశర్మ**

గౌరవ సంపాదకులు

**యాయవరం చంద్రశేఖరశర్మ, ఆర్.వి.వి. కృష్ణారావు**

**మరుమాముల దత్తాత్రేయశర్మ**

ప్రధాన సంపాదకులు

**మరుమాముల వెంకటరమణశర్మ**

ప్రచురణకర్త, సంపాదకులు

**మరుమాముల రుక్మిణి**

సంపాదక మండలి

**డా. పూర్ణప్రజ్ఞా భారతి, అష్టకాల రామ్మోహన్**

**ఆకెళ్ల విభీషణ శర్మ, బాచంపల్లి సంతోష్‌కుమార్‌శాస్త్రి**

**మరుమాముల రామచంద్రమూర్తి**

**ఆదరాసుపల్లి శశిధర్, ప్రసాదవర్మ కామఋషి**

ప్రత్యేక ప్రతినిధి

**పి.వి.ఎం. పవన్,** 81253 36958

ఉప సంపాదకులు

**రామలక్ష్మీ సుబ్రహ్మణ్యం**

ముఖచిత్రం : **హరి తాడోజు**



**దర్శనమ్**

ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక

**- : ప్రధాన కార్యాలయం : -**

ఇం.నెం. 29-105/4/1, శ్రీరామ సిద్ధాంతి భవనం
న్యూ విద్యానగర్, నేరేడ్‌మెట్, సికింద్రాబాద్-56
ఫోన్, ఫ్యాక్స్: 9441015469

e-mail: darshanameditordesk@gmail.com

మార్కెటింగ్: రైజింగ్ సన్ న్యూస్ ఏజెన్సీ, 9666680857


దర్శనం దర్శనారామ దర్శనం సమదర్శనం
దర్శనం లోక వృత్తాంతాదర్శ దర్శిన్యపేక్షితమ్ ॥
దర్శనాంతర్ముఖ స్ఫర్శి సద్విమర్శావమర్శనం
దర్శన ప్రతిభూస్థానం జీయాత్ సర్వ నిదర్శనమ్ ॥

**- అష్టకాల నరసింహరామశర్మ**

'దర్శనం దర్శితం యేన దర్శితం సర్వదర్శనమ్
దర్శనం శర్మసంధాతృ దర్శనం దైవదర్శనమ్'

**- అయాచితం నటేశ్వరశర్మ**

## ఈ సంచికలో ...


అవధాన ప్రతిభాద్యుమణి.. నాగఫణి ... 7
- జంధ్యాల శరత్‌బాబు

అవధాన దీప్తి.. అంబరాన్నంటిన కీర్తి ... 12
- ఆముదాల మురళి

సరస్వతీ ఉపాసన.. సారస్వత ఉద్దీపన ... 17
- డా. రేవూరి అనంత పద్మనాభరావు

'పద్మశ్రీ'కారం.. అవధాన జ్ఞానపీఠం ... 21
- మా శర్మ

ఆస్తిక లోకానికి ధర్మ జాగృతి ... 23
- అయ్యదేవర శ్రావణ్ కుమార్

దివ్యజ్ఞానప్రదాత... దత్తావధూత ... 27
- చింతలపాటి శివశంకరశాస్త్రి

సనాతన ధర్మం... సాధికారిక గ్రంథం ... 29
- తాడేపల్లి పతంజలి

మహాతపస్వి చంద్రశేఖర భారతి ... 32
- చెఱుకుపల్లి జమదగ్ని శర్మ

శ్రీమద్దేవీ భాగవతం - డా. వద్దిపర్తి పద్మాకర్ ... 34

మహాభారత సారసంగ్రహం ... 36
- కీ.శే. డా. పుల్లెల శ్రీరామచంద్రుడు

తిరుమల చరితామృతం - కీ.శే. పివిఆర్‌కె ప్రసాద్ ... 38

రామాయణం రసరమ్యం ... 40
- వనం జ్వాలా నరసింహారావు

అభినవ శంకర విజయం ... 42
- మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి

అంబాష్టకమ్ - తాడేపల్లి పతంజలి ... 44

ఆర్షధర్మంపై అన్యుల విషం - డా. కె.అరవిందరావు ... 52

కంచిస్వామి దివ్యచరిత్ర 'గని-అద్వైత గని' ... 54
- తూములూరి మోహన్ కుమార్

లలితా సహస్రనామ స్తోత్రం.. సరళవ్యాఖ్య ... 60
- ఆచార్య కుప్పా విజయశ్రీ


ఇందులోని వ్యాసాలు, అందులోని భావాలు రచయితలవే. దానికి, దర్శనమ్ పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. - సంపాదకుడు

# తెలుగు భాషా వికాసం ఎప్పుడు? ఎక్కడ?

'దేశ భాషలందు తెలుగు లెస్స' అంటూ విజయనగర సామ్రాజ్యాధీశుడు, సాహితీ సమరాంగణ సార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయలు తెలుగు భాషా వైభవానికి పట్టం కట్టాడు. వేయేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఈ భాషకు ఆ వైభవం గత వైభవమేనా? అని ఈనాడు నిరాశ కలుగుతోంది. పాలకులు చూపిస్తున్న వైఖరి మాత్రం శోచనీయంగా ఉంది. బహుముఖీన వైదుష్యంగల తెలుగు భాషా సరస్వతికి అవధానం, పద్యం, సాహిత్యం కంఠాభరణాలు. మన పురాణాలు, కావ్య ప్రబంధాల్లో ఉపయోగించిన తెలుగు ఎంత ఉత్కృష్టంగా, మహోన్నతంగా ఉందో నిరూపిస్తూ, అనేక గ్రంథాలు వెలువడ్డాయి.

మన భాషకే సొంతమైన అవధాన కళ తెలుగుజాతికే గర్వకారణం. అందుకే అనేక భాషా ఉద్యమాలు, పోరాటాల వల్ల తెలుగు ప్రాచీన భాషగా గుర్తింపును కూడా సాధించుకున్నాం. తెలుగు అజంత భాష కావటం వల్ల ఉచ్చారణలోని ఆ భాషా మాధుర్యానికి ముచ్చటపడి పాశ్చాత్యులు సైతం మన భాషను 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్'గా వర్ణించడం తెలుగు వెలుగుకు నిదర్శనం.

ఇక సంస్కృత మూల రచనలయిన రామాయణ, భారత, భాగవతాలు, అష్టాదశ పురాణాలు, అనేక కావ్యాలకు దీటుగా వాటి ఔన్నత్యాన్ని మరింత పెంపొందించే ఆంధ్రానువాదాలు రావడం ఈ భాషకే దక్కిన వరం. ఇక, ప్రక్రియా వైవిధ్యంతో విలసిల్లిన స్వతంత్ర రచనలు ఎన్నో, ఎన్నెన్నో. అయితే, గతమొక వైభవంగా ఈ కీర్తి మిగలాల్సిందేనా? తెలుగు భాషాభ్యుదయం నేతిబీరకాయేనా? భాషా దినోత్సవాలను మొక్కుబడిగా నిర్వహిస్తూ, పాలనలో వ్యావహారిక భాషగా తెలుగును నిర్బంధం చేసే ఆలోచనకు చరమగీతం పాడుతూ, ప్రాథమిక విద్యాబోధన నుంచే తెలుగు మాధ్యమాన్ని 'హుళక్కి'చేసి, తెలుగు వైభవాన్ని ద్యోతకం చేసే బాధ్యతను ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయనటం కాదనలేని చేదునిజం.

స్వాతంత్ర్యానంతరం 'ఆంధ్రప్రదేశ్' అవతరించాక ఎంతో కొంత ముఖ్యమంత్రుల, మంత్రుల, అధికారుల శ్రద్ధ, చొరవతో తెలుగు భాష మహాసభలు, విశేష కార్యక్రమాలు, సమ్మేళనాలు, భాషా సదస్సులు, చర్చాగోష్ఠులు, అవధానాలు ప్రభుత్వం తన బాధ్యతగా నిర్వహించేది. ఇందులో భాషా సాంస్కృతిక శాఖ, అధికార భాషా సంఘం, అకాడమీలు, విశ్వవిద్యాలయాలు భాగస్వామ్యమై తెలుగు భాషా వైభవోత్సవాలు నిర్వహించేవి. ఇటీవలి కాలంలో ప్రధానంగా రెండు రాష్ట్రాలుగా విడిపోయాక ప్రభుత్వాలు ఈ బాధ్యతను పూర్తిగా విస్మరించి, తెలుగు భాష ఉన్నతికి నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నాయన్న నిరాశా నిస్పృహలు భాషాభిమానుల్లో కనిపిస్తున్నాయి. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు ఒకసారి నిర్వహించిన తెలుగు మహాసభలు మినహా, ప్రభుత్వం చొరవతో నిర్వహించిన కార్యక్రమాలు శూన్యం. తెలంగాణలో 'దర్శనమ్', అవధాన విద్యా వికాస పరిషత్, తెలంగాణ సారస్వత పరిషత్, తదితర సాహిత్య సంస్థలు; ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్ర సారస్వత పరిషత్, తెలుగుదండు వగైరా సంస్థలు మినహా తెలుగు కీర్తి ప్రజ్వరిల్లే ఒక్క కార్యక్రమం అయినా ప్రభుత్వాలు నిజాయితీగా నిర్వహించిన పాపాన పోలేదు.

తెలుగు మాధ్యమం కోసం పోరాట పటిమతో ఉద్యమస్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహిస్తున్న తెలుగుల గుండెఘోష వినే నాథుడే లేడా? ప్రధానంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ అవధాన విద్యా తేజస్సు దేదీప్యమానంగా వెలుగుతోంది. మన ప్రాచీన సాహిత్య సౌరభాన్ని సామాన్యులకు సైతం చేరువచేసే అనేక గ్రంథాలు వెలువడుతున్నాయి. కానీ ఈ కృషి ప్రభుత్వేతర సంస్థల ద్వారానే ఎంతో కొంత సాగుతోంది. భాష కేవలం భావ వ్యక్తీకరణకు మాత్రమే కాదనీ, అది మన జాతి సంస్కృతికి ఆలంబనమనీ మన ప్రభుత్వాలు గుర్తించ లేకపోవటం బాధాకరం. మాతృభాషలో ప్రాథమిక విద్యాబోధన జరిగితే, ఆ విద్యార్థుల మానసిక పరిధి విస్తృతం అవుతుందనీ, వారి వ్యక్తిత్వ వికాసం జాతి అభ్యున్నతికి రాచబాట అవుతుందనీ మన ప్రభుత్వాలు మరచిపోతున్నాయి.

చట్టసభల్లో, భాషా దినోత్సవాల రోజున ఊకదంపుడు ఉపన్యాసాలతో సరిపెట్టుకోవటమేనా? భాషాభిమానం గల నేతలను మార్గదర్శకంగా తీసుకుని తెలుగు భాష పరివ్యాప్తికి విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రాచీన భాష హోదాను కాపాడుకుంటూ కేంద్ర ప్రభుత్వం నుంచి భాషాభివృద్ధికి భారీ నిధులను సాధించుకోవాల్సిన అవసరం లేదా? అది ఉభయ తెలుగు రాష్ట్రాల అధినేతల కనీస బాధ్యత కాదా? ప్రభుత్వాలు ఇకనైనా నిద్రమత్తు వీడి, నిజాలు గుర్తించాలి. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాల స్థాయిలో మాతృభాషలో విద్యాబోధనను సత్వరం ప్రవేశపెట్టి, చిత్తశుద్ధితో అమలుచేయటం ఎంతైనా అవసరం. తెలుగు భాషా సాంస్కృతిక సభలను కంటితుడుపు కార్యక్రమాలుగా కాక, సార్థకంగా, ప్రయోజనకరంగా నిర్వహించటం, అందుకు అనువుగా చట్టాలు చేసి, ఆచరణాత్మకంగా పురోగమించటం అధినాయకుల పవిత్ర కర్తవ్యం. ఈ దిశగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇకనైనా ప్రయత్నం చేస్తాయని ఆకాంక్షిద్దాం. ■

# పాఠక దర్శిని

మీ అభిప్రాయాలను darshanameditordesk@gmail.comకు పంపగలరు.

## కార్తిక మాస వైశిష్ట్యం తెలిసింది


'హరిహరులకు ప్రీతికరం... పరమ పవిత్ర కార్తికం' శీర్షికతో ఇచ్చిన ప్రధాన వ్యాసం అలరించింది. కార్తిక మాసంలో పాటించవలసిన నియమాలు, చేయవలసిన పూజలు, అభిషేకాలు, స్నానాలు, దానాల గురించి ఎంతో వివరంగా తెలిపారు. శివనామ స్మరణ వల్ల కలిగే ఫలితాన్ని తెలియజేయడంతో పాటు భగవద్గీత పారాయణ ఆవశ్యకతను తెలియజేయడం బాగుంది. రచయితకు ధన్యవాదాలు. 'రాగద్వేషాలు... పతన హేతువులు' శీర్షికన వచ్చిన వ్యాసం ఆకట్టుకుంది. వీటిని సరియైన పద్ధతిలో ఆలోచించి భగవంతుడు మనిషికిచ్చిన వివేకంతో వాటిని ఆలోచించుకుని సరియైన మార్గంలో పయనించాలని తెలియజేశారు. మంత్ర జపం ప్రయోజనాలు చాలా లోతైనవని, శారీరక, మానసిక, ఆధ్యాత్మిక స్థాయిలన్నింటినీ స్పృశిస్తాయని తెలియజేస్తూ ఇచ్చిన వ్యాసం మాకు చాలా బాగా నచ్చింది.

**- కె. శ్రీనివాసరావు, బాపట్ల**

## ఆకట్టుకున్న విజయయాత్ర విశేషాలు

తెలంగాణలో శృంగేరి జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ స్వామివారి విజయయాత్ర విశేషాలను కళ్లకు కట్టినట్టు తెలియజేసిన వ్యాసం 'తెలంగాణ జగజ్జేగీయమాన తేజస్సు'. పూర్వ రామాయణంలో రాముడు చేసిన దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ... ఉత్తర రామాయణంలో రాముడు చేసిన ధర్మ పరిపాలన ద్వారా ధర్మ సంస్థాపన గురించి వాల్మీకి తెలియజేశారంటూ 'రామాయణంలో వాల్మీకి హృదయం' అనే వ్యాసంలో ఎంతో చక్కగా తెలిపారు.

**- పూస చంద్రశేఖర్, నల్లగొండ**




## బహుముఖీనంగా కృషి చేస్తున్న పత్రిక

21 సంవత్సరాలుగా ఒక ఆధ్యాత్మిక వార్తా మాసపత్రికను ఎంతో నిబద్ధతతో నడుపుతున్న దర్శనమ్ యాజమాన్యానికి ధన్యవాదాలు. కేవలం పత్రికా నిర్వహణే మాత్రమే కాక బహుముఖీనంగా విశేష కృషి చేస్తున్నారు. సనాతన ధర్మ పరిరక్షణతో పాటు సంస్కృతీ సంప్రదాయాలను బలంగా ప్రజల్లోకి తీసుకువెడుతున్నందుకు అభినందనలు. అరవిందరావుగారి 'ఆర్షధర్మంపై అన్యుల విషం' ధారావాహిక ఎంతో ఆలోచింపజేసేదిగా ఉంది. ధర్మజిజ్ఞాస, వేదాల్లో పురాణాంశాలు వంటి వాటి వల్ల ఎన్నో చక్కని విషయాలు తెలుస్తున్నాయి. 'అన్వేషణ' ధారావాహిక ఎంతో బాగుంది.

**- పి. మనోహర్, హైదరాబాద్**

### 'దర్శనమ్' చందా వివరాలు

| | | |
|---|---|---|
| 3 సంవత్సరాలకు | రూ. | 900 |
| 6 సంవత్సరాలకు | రూ. | 1800 |
| 12 సంవత్సరాలకు | రూ. | 3600 |
| రాజపోషకులు | రూ. | 10000 |
| మహారాజ పోషకులు | రూ. | 25000 |
| విశిష్ట మహారాజ పోషకులు | రూ. | 100000 |

**A/C NAME : DARSHANAM**
**BANK: CANARA BANK**
**A/C NO. 120001974779**
**IFSC CODE: CNRB0013063**

## చందాదారులకు విజ్ఞప్తి

'దర్శనమ్' ధార్మికోద్యమ మాసపత్రిక సనాతన ధర్మ పరిరక్షణే లక్ష్యంగా వెలువడుతున్న ఈ పత్రికకు చందాలు, విరాళాలు అందించవలసిందిగా ప్రార్థన. ఈ నెలతో ముగియనున్న తమ చందాలను వెంటనే పునరుద్ధరించుకో వలసిందిగా మనవి. **ఎడిటర్, దర్శనమ్** పేరుతో చెక్కు/డిడి/మనియార్డరు/ ఆన్‌లైన్‌లో చందాలను పంపాల్సిందిగా విజ్ఞప్తి. మీరు ప్రత్యుత్తరాలు జరిపేటప్పుడు చిరునామాలను స్పష్టంగా పిన్‌కోడ్‌తో సహా రాయవలసిందిగా కోరుతున్నాం. చిరునామా మారితే తక్షణం తెలియజేయండి. **- ఎడిటర్**

# అవధాన ప్రతిభాద్యుమణి నాగఫణి



## దర్శనమ్ గురుసత్కారం సందర్భాన అక్షరార్చన

మాడుగుల నాగఫణి శర్మ... ఆధునిక తెలుగు సాహిత్యంలో వీరి స్థానం ఎంతో విశిష్టత గలది. జగమెరిగిన విద్వత్కవి, ప్రతిభా రవి, ఆధునిక యుగానికి అవధాన వైతాళికుడు. వెల్లువ గోదావరికి దీటైన స్వచ్ఛమైన తెలుగు వెలుగులు విరజిమ్ముతుంది ఆయన ఆశుపద్యం, శివజటాజూటం నుంచి అభంగతరంగిత వియద్ధునీ రసరాగరంజితం ఆయన సంస్కృత శ్లోకం.

ఆయన స్వరంలో అమృత రసధారలు పొంగులెత్తుతాయి. ఆయన కవనంలో నవనవోన్మేష జలతరంగిణులు రాగరాగిణులౌతాయి. ఆయన పాట, మాట సహృదయ సమ్మోహనాస్త్రం. పద్యం, గేయం, శ్లోకం వాగీశ్వరికి నిత్యనైవేద్యం. ఛందస్సుందరంగా మంత్రముగ్ధంగా సాగే అవధానం సదస్యులకు సాక్షాత్తుగా సరస్వతీ సన్నిధానం. మధురవాగ్మిగా, వాగ్గేయకారునిగా, సంస్కృతాంధ్ర భాషల్లో బృహద్విసహస్రావధానిగా, విశ్వభారత మహా కావ్య సంధాతగా, అవధాన సరస్వతీ పీఠం వ్యవస్థాపకులుగా, తెలుగు అధికార భాషా సంఘం పూర్వాధ్యక్షులుగా భాషామతల్లి సేవలో నిరంతరం నిరంతరాయంగా పరిశ్రమిస్తున్న వాఙ్మయ తపస్సిద్ధుడైన, పద్మశ్రీ పురస్కృతుడైన బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ గారికి డిసెంబర్ 21, ఆదివారం దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక ఇరవై ఒకటవ వార్షికోత్సవంలో సభక్తికంగా, సప్రశ్రయంగా సమర్పించుకుంటున్న 'గురుసత్కారం' సందర్భంగా ఈ ప్రత్యేక వ్యాస పరంపర.

మాడుగుల నాగఫణిశర్మ. పేరులోని ఈ పది అక్షరాలూ లక్షల అక్షరాలతో సమానాలు. 1959 జూన్ 8. ఇందులో ఉన్న ఐదు అంకెలూ అసంఖ్యాక శక్తి సమన్వితాలు. కడవకొలనులో పుట్టిన ఆయన ఖండాంతర ప్రశస్తి అందుకున్నారు. తిరుపతి, విశాఖ, మైసూరుల్లో చదువులు. ఢిల్లీ నుంచి సంస్కృత సంస్థాన పట్టా. రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం సంస్థకు సిద్ధాంత గ్రంథ సమర్పణ. కడపలో సంస్కృత బోధన. ఆ తర్వాత తిరుమల-తిరుపతి దేవస్థానం వారి ధర్మ ప్రచార పరిషత్ బాధ్యత.

అవధానం మొదట చేసినపుడు తన వయసు 14. మరో నాలుగేళ్లకే శతావధానం. దరిదాపు ఒకటిన్నర దశాబ్దం పాటు అవధాన సామ్రాజ్యమంతా ఆయనదే! అనేకానేక పరంపరలతో రెండేళ్ల క్రితమే స్వర్ణోత్సవ వైభవ ప్రాభవం.

మాట, పాట, బాట... ఆసాంతం విలక్షణం. చేసిన రచనలు, పాడిన పద్యాలు/శ్లోకాలు/పాటలు/ సాగించిన ప్రవచనాలు/ అందుకున్న బిరుదులు లెక్కకు మిక్కిలి. వాటి పఠనం, శ్రవణం, మననం, సమీక్షణం, వరస బెట్టి జోడించడం కూడా మనకు రోజుల తరబడి పని!

భాగ్యనగరంలోని 'అవధాన సరస్వతీ పీఠం' ఆయన కలల పంట. మూడు దశాబ్దాలుగా నిత్య నిరంతర సారస్వత సేవా వాహిని. భారతీయత, సంప్రదాయ రీతుల ప్రాచుర్య కేంద్రం. ఆ ధార్మికత, ఆధ్యాత్మికత, సనాతనతత్వ సంపద ఎందరెందరికో కనువిందు, వీనులకు పసందు. ప్రాంగణంలోనే సరస్వతీ మాత మందిరం. ఇక్కడే బాలల బంగరు భవితకు బీజాక్షర లేఖనం. అక్షరాభ్యాస క్రియల నిర్వాహకత్వం.

వ్యాఖ్యాతగా అనంత ఖ్యాతి. ఉదాహరణకు : ధూర్జటికృత శ్రీకాళహస్తీశ్వర శతకానికి సువర్ణముఖీ వ్యాఖ్యా సహిత రచనం. 'సమర్పణమ్' అంటూ తండ్రికి అంకితం చేసిన సందర్భంగా



శర్మగారి పదలాలిత్యం...

**'తానేర్చిన వేదశాస్త్రాది బహువిద్యా వైశద్యమును**
**సంగీత సాహిత్యాది సకల కళాభిజ్ఞతను**
**సర్వేశ్వరాంకితము చేసి, అపర ధూర్జటిగా**
**ఐహికాముష్మికములను పండించుకొని...'**



**జంధ్యాల శరత్‌బాబు**

అంటూ పితృదేవులు నాగభూషణ శర్మ చరణ కమలములకు అక్షరాశ్రు తర్పణం అర్పించారు మాడుగుల వారు.

'సమర్చనమ్' పేరిట తన గురువులు, ప్రగతి గీతా ప్రవక్త నండూరి రామకృష్ణమాచార్యుల పాదపద్మములకు సభక్తిక నమస్సుమాంజలి సమర్పించారు. తన ఆ రచనకు కారకులు, ప్రేరకులు నండూరివారేనని కృతజ్ఞతలందించారు.

ఇదే కృతికి ఆశీస్సులిచ్చిన దివాకర్ల వేంకటావధాని మాటల్లో-

'వారింకను పెక్కు పద్య గద్య విమర్శ గ్రంథములు రచించి, ఆంధ్ర భాషా యోషకభినవాలంకృతులు చేకూర్తురని ఆశించుచున్నాను.'

(ఈ శుభాశీస్సు సందర్భం నాలుగు దశాబ్దాల కిందటిది)

వ్యాఖ్యాత అవధాని కాబట్టి, వ్యాఖ్యానం సావధానంగా సాగిందన్నది మరో ప్రశంస.

వేరొక ప్రత్యేకత 'కరుణశ్రీ' సమర్పిత పద్యమాలిక

**'మంచివాడు, మంచి మాట నేరుపువాడు**
**మంచిగోరు మంచి మనము వాడు**
**మంచి శతకమునకు మంచి వ్యాఖ్య రచించి**
**మించినాడు/ విక్రమించినాడు/**
**కవిత వ్రాయగలడు, అవధానములు లెస్స**
**చేయగలడు, తృప్తినీయగలడు**
**వ్యాఖ్యములందు రసము వడబోయగలడు, మా**
**నాగఫణి రసజ్ఞ నాయకమణి.'**

గురువరేణ్యుల ఆశీర్వాద పర్యవసానంగా ఇన్ని సంవత్సరాల్లో ఎన్నో విశిష్ట రచనలు వెలువరించారు బ్రహ్మశ్రీ నాగఫణి శర్మ.

2,700 శ్లోకాల సమాహారం 'విశ్వభారతం'. ఈ సంస్కృత మహాకావ్య ఆవిష్కర్త రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మోహన్ భాగవత్. భారతీయ భక్తిని, సంస్కృతిని పుస్తకం ప్రతిఫలించిందని ప్రస్తుతించారు సభలో. రచనాంశాన్ని విద్యార్థినీ విద్యార్థుల పాఠ్యపుస్తకాల్లో చేర్చాలన్నదీ విజ్ఞాపన.

ఈ రచన ఆ సరస్వతీ మాత కటాక్షమనడం శర్మ వినమ్రత. సరస్వతీ స్తోత్ర కదంబం, అన్నవరం సత్యనారాయణ స్వామివారి

సుప్రభాతం, ఓంకార గణపతి, లక్ష్మీ నరసింహ ప్రభు స్తుతి, మహర్షి వాల్మీకి రామాయణ అంశాల విశదీకరణతో సుందర కాండ, భూవరాహ స్వామిని ప్రార్థిస్తూ తెలుగులో శతాధిక కవితల సంకలనం, ఋషుల వారసత్వ నివాళిగా 'ఋషి చరిత్ర' పుస్తకం.

సొంత అవధాన సంకలనంగా 'ద్విసహస్ర శీర్ష', పంచశత అవధాన పద్య సంచిక, పంచసూక్తం గురించిన వ్యాఖ్యాన వివరణ, సంస్కృత నవల 'సత్యమేవ జయతే', తెలుగు భాష సంస్కృతులకు సంబంధించిన పురాణ 'పద్య ప్రవాహం', ప్రకృతి అంశాలకు చెందిన వందలాది కవితలతో 'పంచభూత పంచశతి', ఇంకా ఎన్నెన్నో గ్రంథాల కర్త నాగఫణి శర్మ.

అరుదైన అవధాన పద్య విద్యను వ్యాప్తి చేయడం, ధారణ శక్తిని అభివృద్ధి పరచడం, వ్యక్తిత్వ వికాసానికీ వక్తృత్వ విన్యాసానికీ ప్రోత్సాహం, పాఠశాల స్థాపనతో వేదాధ్యయనం జీవిత లక్ష్యాలుగా కృషిని కొనసాగిస్తూ వస్తున్నారాయన.

తనది సదా విజయ శిఖర అధిరోహణ. అవధానం వైపు చూపు సారించేలా చేసింది నరసింహయ్య కవి. మాడుగులవారు ఇప్పటి వరకు చేసిన అవధానాల సంఖ్య రెండు వేలకు పైమాటే! శత, సహస్ర, ద్వి సహస్ర అవధాన క్రియలతో బృహత్, సామ్రాట్ అనిపించుకున్నారు. తెలుగు, సంస్కృత భాషలు రెండింటిలోనూ ఏకైక ద్విసహస్రావధానిగా నిలిచిన విశేష మేధానిధి.



మొట్టమొదట స్వస్థలం అనంతపురంలో నిర్వర్తించిన విభిన్న ప్రక్రియ- సంస్కృతాంధ్ర దశగుణిత అష్టావధానం. తదుపరి రెండేళ్ల లోపలే శతావధానం. అదీ సంస్కృత ఆంధ్ర భాషల్లో. సంస్కృతంలో సంపూర్ణ శతావధానాలు అనేకం. ప్రప్రథమ మహాసహస్రావధానము వారు నెలకొల్పినదే. తరువాత అది ఎందరో అవధానులకు అనుసరణీయమైంది.

అదే కోవలో... నూట ఎనిమిది దేశాల పృచ్ఛకులతో ఆమనిలో అవధానం. ప్రేక్షకులంతా పృచ్ఛకులుగా అవధానం సైతం అవధాన విజయిని/రాజధాని అంటూ మరికొన్ని. ఇదంతా వాగ్వర్ధినీ విభవం.

వందల కొద్దీ గీతాలు, స్తోత్రాలు ఆ స్వరం నుంచి జాలువారుతుంటే- ప్రతీ ఒక్కరూ మంత్రముగ్ధులే. ఆదిశంకర వైభవం, గణేశ- శివ స్తోత్రం, సరస్వతీ కవచం, దేవీ స్తుతిమాల, శ్రీరాగం, శ్రీమద్భగవద్గీత, శృంగేరీ వాగ్వర్ధినీ. పోతన భాగవత కథాగాన సుధ - మరెన్నో ప్రవచనాల వెల్లువ. జీవిత సాఫల్య బహూకృతి, వేద సాహిత్య సేవకు సద్గురు శివానందమూర్తి పురస్కారం... ఇలా జాతీయంగా మరెన్నో స్వీకరించారు.

అంతర్జాతీయంగా జాబితా పెద్దది. ప్రపంచ తెలుగు సమాఖ్య, అమెరికా తెలుగు సంఘం, ఆస్ట్రేలియా తెలుగు పలుకు, బహ్రెయిన్, దుబాయ్, అబుదాబి దేశాల నుంచి అవార్డులు, యునైటెడ్ కింగ్‌డమ్ అందించిన దశాబ్ద కాల అత్యుత్తమ అవధాని పురస్కృతి విశేషం, ఉత్తర అమెరికా తెలుగు అసోసియేషన్ వరసగా బహూకరించిన ఐదేళ్ల బహుకృతులు, తదితరాలు.

తరుణ తపస్వి, మేధారత్న, శ్రీకళాప్రపూర్ణ, అవధాన సహస్ర ఫణి, అవధానంతోనే మొదలయ్యే సరస్వతి, చక్రవర్తి, భారతి, శకపురుష, సార్వభౌమ, ప్రతిష్ఠాపనాచార్య, కవి అంటూ ఆరంభమయ్యే తిలక, కవిరాజ విరాజ...ఇలా లెక్కించడానికి వీలు లేనన్ని టైటిల్స్ ఆయన సొంతం.

అప్పట్లో ప్రధానమంత్రులు పీవీ నరసింహారావు, అటల్ బిహారీ వాజ్‌పేయి, నాడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు హస్తాల మీదుగా సహస్రఫణి బిరుదం మధురాతి మధుర సందర్భాలు. శతావధాన చూడామణి అన్నారు. కళాసాహిత్య కల్పద్రుమగా ఘనరీతిన సత్కరించారు. కనకాభిషేకాలు, స్వర్ణకంకణ ప్రదానాలు, స్వర్ణ శారదా ముద్రికలు, గండపెండేరాలు.

శృంగేరి పీఠాధీశులు, కంచి కామకోటి, కుర్తాళం పీఠాధిపతులు, దత్త పీఠాధిపతి ఆశీర్వచనాలు వరాలుగా లభించాయి. నాగఫణిశర్మ సేవానిరతి ఫలితంగా నిర్వహణ అయినవి- ఉచిత వైద్య శిబిరాలు, ఔషధాల వితరణలు, బాలబాలికలకు పద్య, శ్లోక శిక్షణలు, పోటీల ద్వారా బహుమతుల ప్రదానాలు, ఉపకార వేతనాల పంపిణీలు, పుస్తక బహూకరణలు. వీటన్నింటితో పాటు అన్నప్రసాద కార్యక్రమాలు.

ఆశ్రమ వాతావరణంలో వేద పాఠశాలలు, గోశాల నిర్వహణలు. ఎన్ని కార్యశాలలు నిర్వహించారో, స్ఫూర్తి అంశాల బోధనలు సాగించారో, వారసత్వ పరిరక్షణ పనులు చేపట్టారో ఇన్నీ అన్నీ అని లెక్కించి చెప్పలేం. అప్పుడూ ఇప్పుడూ సనాతన ధర్మ సంరక్షణ పనులే పనులు. దసరా, దీపావళి పర్వదినోత్సవాల వేళల్లో కళకళలను చూసి తీరాల్సిందే. ఎవరినైనా ఏ సమయంలోనైనా ఆదరించి, అక్కున చేర్చుకుని, విద్యా

బుద్ధులు నేర్పించి, సమాజ ప్రయోజన హితంగా తీర్చిదిద్దాలన్న ఏకైక సంకల్పమే అభివ్యక్తమవుతుంటుంది.

వేదసాహిత్యం, పద్యసంగీత ఆలాపనం ఆయనకు సహజ సిద్ధం. హిందుత్వం అనే పేరు వింటేనే పొంగి పులకిస్తుంది ఆ మది. భారతీయ తత్వ చింతనలోనే మనం మమేకమవు తుంటుంది. శాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు. అన్నింటి మీదా సాధికారిక ప్రవచనాలు చేస్తుంటే తన్మయులు కావాల్సిందే ఎందరైనా, ఎంతసేపైనా! ఎంతైనా బృహద్ద్వి సహస్రావధాని కదా. ధారణ, గ్రహణ, వ్యక్తీకరణల్లో సకల విధాలా మిన్న. తలపులో అసాధారణత్వం, పలుకులో సలక్షణ తత్వం. మహాకవి, ప్రభారవి. ఎన్ని గంటలు ప్రసంగించినా అదే శక్తి! సంవిధానం అపూర్వంగా, అపురూపంగా ఉంటుంది ఎప్పుడూ. ఆసాంత భారతీయం. ఆయన కావ్య నాయిక భారతాంబ. నాయక ధీరుడు ధర్మపురుషుడు.

వందలాది ఛందోరీతులను ఒకే కావ్యంలో ఒదిగేలా చేసిన అక్షరశిల్పి. ఆయనది అనల్ప కల్పన యుక్తి. ఎదిగేదే కానీ తరగదు ఎంత కాలమైనా! గడచిన మూడున్నర దశాబ్దాల్లో అత్యంత చరిత్రాత్మకాలు ఐదు సహస్రావధానాలైతే, వాటిల్లో మొట్టమొదటిది మాడుగుల వారిదే! ఆ సంవత్సరం 1996. ఆ మహానగర వేదిక హైదరాబాద్.



ఇన్నేళ్లలో తను రచించిన కవితలూ శ్లోకాలూ ఇంచుమించు 33,000. ముద్రించి చదువరులకు అందించినవి పుస్తక రూపాల్లో మూడున్నర పదులకు పైమాటే. అప్పట్లో 37 రోజులు వేలాది పృచ్ఛకులతో అవధాన ప్రదర్శన చేశారంటే - సాటిలేని మేటి కదా ఆయన! తనదంతా మానవాతీత జ్ఞాపక పటిమ అనిపిస్తుంది. అదే నాటికీ నేటికీ నిరూపణ అవుతూ వస్తోంది.

అప్పటి రాష్ట్రపతి శంకర్ దయాళ్‌శర్మ సమక్షంలో చేసిన అవధాన ప్రభావాన్ని ఇప్పటికీ గుర్తుచేసుకుంటూనే ఉంటారాయన. భారత భారతి, శతావధాన విపంచి, శతక పద్య మంజరి. ఈ విధంగా ధారావాహికంగా సాహిత్య సంగీత ప్రసంగ ఝురి తనది.

మణిద్వీప మహిమను వర్ణించినా, కార్తవీర్యార్జున స్తోత్రం చేసినా ఆయనే! సౌందర్యలహరి మాదిరిగా జగద్గురు ఆదిశంకరాచార్యులు విరచిత 'శివనాద లహరి'లోని మధురిమా అంతా ఆయనదే.

ఢిల్లీలోని తెలుగు అకాడమీ, సార్వభౌమ సంస్కృత సంవర్ధన సంస్థలు ముక్తకంఠంతో జేజేలు పలికింది ఆయనకే.

ఆణిముత్యాల వరస ఇదిగో:

రుద్రం అంటేనే నమక చమకాల కలయిక. మన దేశానికి మనసు రామాయణం, బుద్ధి మహాభారతం, ఆత్మ భాగవతం. జ్ఞాపకశక్తిని పెంచి పోషించే అద్భుత కళ అవధానమే. వ్యక్తిగతంగా ఆరోగ్య భాగ్య సాధనకీ ఇది ఒక ఉపకరణ ప్రక్రియ. ఏ విధమైన అవధానమైనా తెలుగువారి శాశ్వత సొత్తు. పద్యశ్రీ, పద్మశ్రీ. అవధానమే నా జీవన గానం. ఒక మహానుభావుడు ఇచ్చిన మంత్రమే నా జీవిత గమనాన్ని మార్చింది. గొప్పతనం అంటే సనాతన హైందవ ధర్మానిదే. భాషది ప్రవాహ వేగం. ఇందులోని అర్థకల్పన అనితర సాధ్యం.

కళా సరస్వతికి నేను చేసే అక్షరాభిషేకం ప్రధానంగా పద్యంతోనే!

నాగఫణిశర్మ గురించి పద్య ప్రసూనం: (ముదివర్తి)

**సీ॥ అధికార భాషా మహాసంఘునాయకుం**
**డాంధ్ర గీర్వాణ భాషార్ణవుండు**
**పండిత కవి పద్మషండ మార్తాండుండు**
**అవధాని మాండలి కాధిరాజు**
**పరమేశ్వరీ పదద్వయ భక్తిపూర్ణుండు**
**మంత్ర సిద్ధుండభిమానధనుడు**
**కకుబంత విశ్రాంత ఘన యశోరాజితుం**
**డత్యుదార చరిత్రు డకలుషుండు**
**తే.గీ॥మాడుగుల నాగఫణిశర్మ మధుర వక్త**
**చుక్కలందు చంద్రుని భాతి సూరులందు**
**కొట్టవచ్చిన కైవడి గోచరించు**
**సొగసుకాడు రసజ్ఞుండు సుగుణరాశి!**

సినారె పరిభాషలో 'ఆనందం మనిషైన వాడు.'

అవధాన సరస్వతీ ప్రశంసపరంగా: ('అవధాని రాజధాని' లోనిది)

**మహితులలోన తానె గడు మాడ్గుల నాగఫణి ప్రపూజ్యుడున్/**
**మహికననౌన్ సుధిన్ సభిక మాన్యనగాధిపు సత్కవీశునన్/**
**రహికలుగున్ గనన్ కవన రాజ్యలసద్వర కాంతిరూపు సత్/**
**స్పృహమనలోన్ మహకవిని విజ్ఞుని గాంచిన గాంక్ష తీరుచున్/**

రక్షణ, శిక్షణ, భక్షణ, ప్రోక్షణ. ఈ పదాలతో కైలాసగిరిని ప్రత్యక్షం చేయడంలోనే మహా అవధాని వాక్చతురత ప్రస్ఫుటమైన సందర్భం ఇదిగో :

**హాసము, పార్వతీ మధుర హాసము, రక్షణ మీకు, మాకు-కై**
**లాసము నేలపై దిగిన లక్షణ శిక్షణ కల్గె నేడు, అ**
**భ్యాస పరోపకారి శివుడా విష భక్షణ జేసె, రాశిగా**
**పోసిన పుణ్యమై యతడు ప్రోక్షణ చేసె శిరస్థ గంగలన్!**

మరొక సందర్భంలో- పరమేశ్వరుని తాండవం గురించి:

ఝుళిపించె, అనిపించె, వినిపించె, ప్రజ్వలించె అంటూ సభాసదుల జయజయధ్వానాలు అందుకున్నారు. జయజయ మహాదేవ, సత్యభావ అని అభివర్ణించి అందరినీ ఆకట్టుకున్నారాయన.

**శ్రీ కనకధారా స్తోత్రం, దుర్గా ఆపదుద్ధారం, లక్ష్మీ అష్టోత్తర శతనామం, శ్రీదేవి ఖడ్గమాలా స్తోత్రం, ఆదిత్య హృదయం, భజగోవిందం, పంచ నారసింహం, మహాగణపతి స్తోత్రం, వైకుంఠ వైభవం-**



ఎన్నెన్నో అంశాలు ఆ గళంలో జాలువారాయి.

జగద్గురు ఆదిశంకరాచార్య స్థాపించిన చతురామ్నాయ పీఠాల్లో ఒకటి... దక్షిణామ్నాయ శృంగేరి శారదా పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీస్వామివారి నాటి విజయ యాత్ర ఘట్టాన్ని అందరం తలచుకుని తీరాలి. ఆ సందర్భాన భాగ్య నగర శంకర మఠంలో మాడుగులవారిది ఉపన్యాస మాధురి. కోటి దీపోత్సవం లాంటి ధార్మిక సమ్మేళనాల్లో సాగించినది/ ప్రసంగ ధార. అనంత చతుర్దశి వేళన అనంత పద్మనాభస్వామి వ్రత నిర్వహణ. ఇవి కొన్నే, ఇంకెన్నో సమావేశ సన్నివేశాలు ఆ వాక్కులతో తరించాయి.

మరెంతో ప్రత్యేకంగా తలచుకోవాల్సింది 'పలికెడిది భాగవతమట' పద్యానికి ఆయన చేసిన సమగ్ర విశ్లేషణ. అవే మాటల్లో ఇప్పుడు వివరించాలంటే...

'పోతన భాగవతంలో ఆ పద్యానికి అసలు అర్థాన్ని నాన్నగారు విపులీకరించారు. 'పలికెడిది భాగవతమట, పలికించు విభుండు రామభద్రుండట, నే పలికిన భవహర మగునట, పలికెద వేరొండు గాథ పలుకగ నేలా'. ఇదీ పద్యమంతా. అట, అట అని ఆపడం అందరికీ అలవాటు. అంతగా తెలియని విషయాన్నే కదా ఎవరైనా 'అట' అని చెప్తుంటారు! నిశ్చయార్థాన్ని అట అని చెప్పరు కదా.

అసలు రహస్యం ఏమిటంటే- 'పలికెడిది భాగవతము, అట పలికించు విభుండు రామభద్రుండు, అటనే పలికిన భవహరమగును, అట పలికెద, వేరొండు గాథ పలుకగ నేలా!'... చూశారా ఎంత ఔచిత్యముందో. పోతనగారి ఉద్దేశం ఇదే. ఇదంతా నాగఫణి శర్మ సునిశిత పరిశీలనకు ప్రతీక.

ఎప్పుడు మాట్లాడటం ఆరంభించినా 'శ్రీ మహా సరస్వత్యై నమః' అంటారాయన. గణాధిపతికి నమస్కరిస్తుంటారు. తల్లిదండ్రులకు, గురువులకు నమస్సులర్పిస్తుంటారు. అమ్మవారి కరుణా కటాక్షం అని వినయంగా చెప్తుంటారు. పద్యాలు లేకుండా ఏ ప్రసంగమూ ఉండదు. ఎంతసేపు మాట్లాడినా స్వర ధాటి తగ్గదు. వరమే అది.

ఆయనది ప్రవచన ప్రభంజనం. సదా సమయపాలనం. ఇంతటి సద్గుణ సంపత్తి నిండినందునే, గురు స్థానంలో సుప్రతిష్ఠితులయ్యారు.

గ్రాంథికంతో పాటు వచన కవిత్వంలోనూ ఆయనే మిన్న.

ఉదాహరణలు ఇన్నీ అన్నీ కావు. వాటిల్లో ఒకటి :

**'నీవు నాతో పలికిస్తేనే**
**నేను తేనెలు చిలికిస్తాను**
**నీవు నాకై పలుకిస్తేనే**
**నేను పాటగ ప్రవహిస్తాను'**

సరస్వతీదేవి ఆమె. ఆయనకి ఆరాధ్య దేవత. ఆమె తనకు ఉపాస్యం. ఆమే నిరంతర ధ్యానం. 'సర్వావస్థల సర్వముగా కొలిచెద నిన్నే' అని ఎప్పుడూ పాడుకుంటూ ఉంటారు నాగఫణిశర్మ.

గణేశ పంచచామర స్తోత్రం కర్త సుబ్రమణ్య యోగి. కష్టతరమైనా వృత్తాన్ని ఇష్టంగా మలుచుకుని జగత్తుకు అందించిన ప్రభావి. అఖండ విద్యా ప్రదాత అయిన వినాయకుని ఆ స్తోత్రాన్ని శర్మ తాను పఠించి, సభలోని అందరితోనూ పఠింపజేయడం నాటికీ నేటికీ ఏ నాటికీ ప్రాతః స్మరణీయమే.


**అవధానకళకే మొట్టమొదటి 'పద్మశ్రీ'**

యాభై ఏళ్ళుగా అవధానరక్షణ - వ్యాప్తికై బ్రహ్మశ్రీ నాగఫణి శర్మ చేస్తున్న నిరంతర కృషిని గుర్తించి- మన భారతప్రభుత్వం అవధాన రంగంలోనే మొట్టమొదటి 'పద్మశ్రీ' పురస్కారం అవధాన కళలో - ఆయనకే అందించడం ఎంతో సంతోషం. ఈ అత్యున్నత భారత పౌరపురస్కారం - రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపదీ ముర్ము గారి ద్వారా అందుకున్నారు.

ఆ బ్రహ్మశ్రీకి గురుసత్కారం, ధార్మికవరేణ్య అని బిరుదు ప్రదానం, జీవన సాఫల్య పురస్కార బహూకరణం.. ఇదే డిసెంబరు 21వ తేదీన. భాగ్యనగరాన రవీంద్ర భారతి ప్రాంగణాన ఆ సం'దర్శనమ్' అనుభవైక వేద్యం. పల్లకీ సేవకు తోడు స్వర్ణకంకణ సమర్పణం, పుష్పాభిషేక నిర్వహణం ఎంతెంత నేత్రానందమో! ■

# అవధాన దీప్తి అంబరాన్నంటెన కీర్తి

# మాడుగుల నాగఫణిశర్మ కవితావైదుష్యం



హిమాలయాలలో గంగోత్రి వద్ద గంగానది ఒక చిన్న సెలయేరులా ఉద్గమించుచున్నది. అక్కడి నుంచి అనేక నదీనదాలను తనలో కలుపుకొని పవిత్రతను కోల్పోకుండా, నైర్మల్యం చెడకుండా చేసే ప్రయాణంలో విస్తృతమౌతూ వస్తుంది. బీడు భూములకు ప్రరోచన కల్గిస్తుంది. నీరస జీవులకు ప్రచోదన కల్గిస్తుంది. జీవనదియై జాతి అంతరాత్మగా పరిణమిస్తుంది. ప్రతిభ వ్యుత్పత్తి, అభ్యాసాలచే బీజప్రాయమైన కవిత్వాన్ని అంకురింపజేసి, ఆలంబనగా నిలచి, దోహదం గావించి మహావృక్షమై పద్య కుసుమాలను, అవధాన ఫలాలను ప్రసరింపజేసిన మహాకవి పద్మశ్రీ పురస్కృతులు డా. మాడుగుల నాగఫణిశర్మ. ఆయన దేహయష్టి గంగోత్రి వద్ద గంగానది. ఆయన కవిత్వ పుష్టి అవిముక్త క్షేత్ర భాగీరథి. గంగాజల పావిత్ర్యం ఆయన పద్యరచనా శిల్పం. గంగాజల నైర్మల్యం వారి భావచాలన వైదుష్యం. నిలువెత్తు దేశభక్తి, ఆర్ష సంస్కృతానురక్తి, ఋషి ఋణవిమోచన సంకల్పశుద్ధి, అవధాన విద్యాంతర్వాహినీసిద్ధి... వెరసి నాగఫణిశర్మ. వారి మాటల్లో మార్దవం, కంఠంలో సంగీతం, పద్యంలో పటిమ, వ్యక్తిత్వంలో గరిమ సేదతీరుతుంటాయి. ఆకర్షణీయ స్ఫురద్రూపం, తదుచిత పాండిత్యం, శారదా సమర్చన శీలం, సద్యస్స్ఫూర్తి, గంభీర స్వరం కలగలసిన శర్మ గారి సాహిత్య సింహావలోకనమంటే సరస్వతీ పదస్థగిత సుమగంధాన్ని ఆఘ్రాణించడమే. ఇది సమగ్రం కాదు, అలాగని అసమగ్రం కూడా కాదు, ఇదొక బిందువు... ఎదురుగా ఉన్నది సింధువు... దాని పేరే 'నాగఫణిశర్మ'.

సీ॥ ప్రతి పద్మమును నార్షపథ నిత్యగామియై
పరిఢవిల్లగ జేయు పండితుండు
ప్రతి పాదమును రమ్యభారతీ చరణమై
వేద్యమ్ముగావించు సద్యశుండు
ప్రతి పద్యమును తెల్లు వాఙ్మయరసశిలా
శాసనమొనరించు సారధనుడు
ప్రతివేదికను వేదపావన సురధునీ
పావిత్ర్యముగసల్పు వావదూకు

తే.గీ. డతడు మాడ్గుల వంశసుధాకరుండు
నాగఫణిశర్మ భువిని గంధర్వుఁడనఁగ
ముదముతో బుట్టు భారతి ముద్దుబిడ్డ
తెనుగుజాతికి పద్యకేతనమతండు

పద్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ జ్యోతిషం, వాస్తు, సంగీతం, వేదాధ్యయనం నేపథ్యంగా గల కుటుంబంలో అనంతపురం జిల్లా తాడిపత్రి తాలూకా కడవకొలను గ్రామంలో నాగభూషణం శర్మ, సుశీలమ్మ పుణ్య దంపతులకు 1959 జూన్, 8వ తేదీన జన్మించారు. తిరుపతి లోని శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యకళాశాలలో సాహిత్య శిరోమణి

(1979), ఆంధ్రవిశ్వవిద్యాలయం నుండి పి.ఓ.ఎల్. (1982), మైసూరు విశ్వవిద్యాలయం నుండి ఎం.ఏ. (సంస్కృతం), రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్, న్యూఢిల్లీ నుండి శిక్షాశాస్త్రి (బి.ఇడి) పూర్తి చేసిన వీరు 1996లో కాళిదాసు కావ్యాలలో ధర్మతత్త్వావనుశీలనం అన్న అంశంపై పరిశోధన గావించి, రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి నుండి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. తండ్రి ఉత్సంగంలో ప్రారంభమైన విద్య ఎన్.సి.వి. నరసింహాచార్యులు, నండూరి రామకృష్ణమాచార్యులు, గౌరిపెద్ది రామసుబ్బశర్మ వంటి మహామహుల మార్గనిర్దేశనంతో పరిపక్వస్థితినందుకొన్నది.

వీరు 1989-90 మధ్య కాలంలో కడప రామకృష్ణ జూనియర్ కళాశాలలో సంస్కృత ఉపన్యాసకులుగా, 1990-92 మధ్య కాలంలో తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూధర్మ ప్రచారపరిషత్ కార్యదర్శిగా, 1999-2003 మధ్య కాలంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికార భాషాసంఘ అధ్యక్షులుగా ఉన్నత పదవులను నిర్వహించి ఆ పదవులపై తమ ప్రగాఢముద్రను వేశారు.

కుటుంబ నేపథ్యం, సహజాతమైన ప్రతిభ కారణంగా వీరు తన 12వ ఏట -

**"పుట్లూరున కడ్డమునొక**
**పట్లన్ బెనుకొండయుండె పయనములోనన్**
**ఎట్లయినను కాల్జారిన**
**కట్లకు పుత్తూరె దిక్కు కదరా సుహితా!"**

అంటూ ఆశువు చెప్పారు. మొదటి దశలో పద్యమే కందం కావడం, అందునా దుష్కరప్రాస, రెండవ పాదంలో 'పట్ల' పదం ప్రాసలో సమకూర్చడం, విరిగిన కాళ్ళను కట్లు కట్టే పుత్తూరు పట్ల అవగాహన ఉండటం - నల్లేరుపై బండి నడకలా పద్యం





ఆముదాల మురళి

జాలువారడం - వీరి భావి అవధాన వరివస్యను ప్రస్ఫుటీకరించింది. ఆ నాల్కపై జాలువారిన ఆశువు రెండేళ్ల వ్యవధిలో గద్దెనెక్కింది. శర్మ గారు తన 14వ యేట 1972లో మొట్టమొదటి అవధానం చేసి శ్రీవాణీ పదమంజీర ధ్వనికి కంజీర వాయించారు.

తదనంతరకాలంలో శ్రీ అన్నవరం సత్యనారాయణ స్వామికి అక్షరార్చనగా సుప్రభాతాన్ని అందించారు. సుప్రభాత సాహిత్యమంతా ఒక మూసలో నడుస్తున్న కాలంలో

**ప్రభాకరోను లింపతి ప్రభాం దిగంత భిత్తిషు**
**కరాగ్రకుంచికావరైః విచిత్ర రాగరంజితామ్!**
**భవాన్ ప్రబుధ్య పశ్యతీతి భీతితస్త్వరాయుతః**
**శుభప్రభాతమస్తు రత్నశైల శేఖరప్రభో!!**

అంటూ పంచ చామరసేవ చేశారు. అనిదం పూర్వ విశ్లేషణా గరిమతో ధూర్జటి శ్రీ కాళహస్తీశ్వర శతకానికి సువర్ణముఖరీ వ్యాఖ్యానం వ్రాశారు. అవధాన వైజయన్తి, సహస్రశీర్ష ద్విసహస్రశర్ష, శతావధాన శతపత్రం, విశ్వ భారతం, పంచసూక్త వివరణం మొదలగు గ్రంథాలను మాడుగులవారు విరచించి ప్రకటించారు. ఆర్యా శతకం, శ్రీ రాగం, పోతన భాగవత కథాగాన సుధ మొదలగు ఆడియో క్యాసెట్లును స్వీయ మాధుర్యగానంతో వెలువరించారు. చలనచిత్ర దర్శకులు కె. విశ్వనాథ్ కోరిక మేరకు సూత్రధారులు, స్వాతికిరణం, అపద్బాంధవుడు, సిరిమువ్వల సింహనాదం మొదలగు చిత్రాలకు పాటలు, పద్యాలు వ్రాశారు.

1978లో కంచి పరమాచార్యుల ఆశీస్సులు పొందిన వీరు మాచర్లలో కనకాభిషేకం, అనంతపురంలో స్వర్ణ కంకణధారణ లెక్కులేనన్ని గండ పేండారాది సత్కారాలను పొందడమేకాక అవధాన సహస్రఫణి, శతావధాని సమ్రాట్, అవధాన చూడామణి, బృహత్ ద్విసహస్రావధాని మొదలగు బిరుదులను పొందారు. 4-9-94 న మైసూరు దత్తపీఠానికి ఆస్థానకవిగా నియమితులయ్యారు.

**"కవిత వ్రాయగలడు - అవధానములు లెస్స**
**చేయగలడు - తృప్తినీయ గలడు**
**వ్యాఖ్యలందు రసము వడబోయగలడు - మా**
**నాగఫణి రసజ్ఞ నాయకమణి"**

అని కరుణశ్రీ జంధ్యాల పాపయ్య గారిచే ప్రస్తుతి నందుకొన్న వీరు లెక్కకు మిక్కిలిగా అష్టావధానాలు, శతావధానాలతో పాటు 23-4-95 నుండి 27-4-95 వరకు ద్విశతావధానం, 1-2-1996 వంటి 24-2-1996 వరకు మహాసహస్రావధానం, 1997-

98 సంవత్సరంలో 37 రోజులపాటు 2116 మంది పండితులలో బృహత్ ద్విసహస్రావధానం చేశారు. అవధాన ప్రక్రియలో మీరు చేయని ప్రయోగాలు. లేవు సంస్కృతాంధ్ర దశగుణిత అష్టావధానం (1985), సంపూర్ణ సంస్కృత శతావధాను, ఏకదిన శతావధానం, కేవల సంస్కృత అష్టావధానాలు (రాష్ట్రేతర ప్రాంతాల్లో), ఆమనిలో ఆవధానం (2001), ప్రేక్షకులంతా పృచ్ఛకులే (2002), పంచశతావధానం, అవధాన రాజధాని (న్యూఢిల్లీ-2014) మొదలగునవి అవధానంలో వీరు చేసిన అపూర్వప్రయోగాలు. అవధానా లకు విశిష్ట వైభవాన్ని సమకూర్చిన ఏకైక అవధాని వీరే. పాలకులు, పామరులు, అధికారులు, అధోజగన్నివాసులన్న భేదంలేకుండా సర్వజనరంజకమైన అవధానాలు చేసిన వారిలో వీరే కనిష్ఠికా ధిష్ఠితులు. 6 పర్యాయాలు అమెరికా దేశాన్ని సందర్శించారు. ఇంకా బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఆస్ట్రేలియా, సింగపూర్, బ్రహేన్ వంటి దేశాలలో అవధాన జయకేతనం ఎగురవేసి తెలుగువారి మేథాశక్తిని చాటి చెప్పారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయంలో అవధాన ప్రక్రియను గూర్చి ఆంగ్లంలో ప్రసంగించి శ్రోతలను మంత్రముగ్ధుల్ని చేశారు. రాష్ట్రేతర ప్రాంతాల్లో సంస్కృతంలో అవధానాలు చేస్తున్నవారు. ప్రత్యేకంగా వీరి అవధానాల్లో నృత్యపదులు, మీ ప్రశ్నకు నాపాట అన్న అంశాలను ప్రవేశపెట్టి జనరంజకం గావించారు.

అద్భుతమైన కంఠస్వరంతో, స్వర్గంగా ప్రవాహం వంటి పద్య ధారతో వీరి అవధానాలు జరుగుతున్నాయి. 'మీ ప్రశ్నకు నాపాట అంశంలో ఎన్నో పాటలు సద్యస్ఫూర్తితో, సమకాల సమాజ సమస్యల నుద్దేశించి గానం చేసిన వాగ్గేయకారులు శ్రీ శర్మగారు. ''పద్యమా! తెలుగువారి సిరికి అనవద్యమా! శారదాసతికి నైవేద్యమా! పద్యమా! నువుహృద్యమా! అంటూ తెలుగు పద్య వైభవాన్ని గూర్చి, ''ఉద్యమించు, ఉద్యమించు ఓ మహిళా! ఉత్క్రమించు, ఉత్తమించు ఓ మహిళా'' ... అంటూ వరకట్న దురాచారాన్ని గూర్చి, బాల కార్మికులను గూర్చి వారు అప్పటికప్పుడు రాగరంజితంగా అనుప్రాసాను గుణంగా గానం చేస్తుంటే సదస్యులందరూ మంత్రముగ్ధులు కావాల్సిందే.

వీరి అవధానాలలో అనువాద అంశం ఉంటుంది. అయితే వీరి ప్రత్యేకత సంస్కృతం నుండి తెలుగులోనికి మాత్రమే కాదు. తెలుగు నుండి సంస్కృతానికి కూడా అనువాదం చేస్తారు. ఉభయభాషా. ప్రావీణ్యం మాత్రమే కాక ఉభయ భాషలందునా కవిత్వసిద్ధి కలిగిన వీరి కౌశలానికి నిదర్శనంగా పారిజాతాపహరణంలోని "మనమున ననుమానము నూనను ...'' అన్న ద్వ్యక్షరపద్యాన్ని వారు ఆర్యా ఛందస్సులో -

**"అనుమానం మమ మనసి న**



**మను మథ మునినాథ ! సపది మన్యే-హం**
**అనవరతం తవ చరితం**
**మననేన సమాశ్రయే-హమద్యైవ"**

అని సంస్కృతీకరించారు. సంస్కృతంలో లేని ప్రాసను కూడా సమకూర్చడం వారి వైదుష్యానికి నికషం. అలాగే

**శ్లో॥ నేదం నభోమండల మంబురాశిః**
**నేమాశ్చతారాః, నవఫేన ఖండాః।**
**నాయం శశీ, కుండలితః ఫణీంద్రః**
**నాయం కళంకః శయితోమురారిః॥**

- అన్న శ్లోకాన్ని అంతే తూగుతో

**తే॥గీ॥ గగనమా? కాదు మిత్రమా ! కనగజలధి**
**తారలా? కావు సురఁగల సౌరు చెదరె**
**చంద్రుడా? కాదు శేషుండు చాపఁజుట్టె**
**అంకమా? కాదు శయిత నారాయణుండు**

అని అనువదించారు. ఇందులో నాలుగో పాదంలో అంకంలో 'అ'కు నారాయణలోని అయనలోని 'ఆ'కు యతి వేయడం వారి పాండిత్య గరిమకు ప్రతీక.

సాధారణంగా అవధానాల్లో చెప్పిన పద్యాలు ప్రేక్షకులను అలరించడంతో సరి, అంతేకాని జనబాహుళ్యంలోనికి చొచ్చుకొని వచ్చి ప్రసిద్ధికెక్కిన పద్యాలు అరుదు. అయితే మాడుగుల వారి అవధాన పద్యాలు అందుకు భిన్నమైనవి. వారి చాలా పద్యాలు ప్రజల నాల్కలపై నడయాడుతున్నాయి. దానికి కారణం వారి పదాల ఎంపిక. వారి భాషలోన ఉన్న సంగీతజ్ఞత. వారి ప్రజ్ఞకు నికషోపలంగా భాసించే పద్యాలెన్నో ఉన్నాయి.

వారికి ఒక అవధానంలో ''వ్యాప్తములయ్యె నిరులు ఖరకరుడుండన్'' అని సమస్య నిచ్చారు. ఇది కందపద్య

పాదమేకాని మొదటి అక్షరం లుప్తమైనది. అది ఏమై ఉంటుందో ఊహించాలంటే యతిస్థానంలో ఉన్న అక్షరాన్ని చూడాలి. 'వ్యా' అనే సంయుక్తాక్షరం ప్రాసవుతుంది. సమస్యలో ఉన్న అనౌచిత్యాన్ని పరిహరించాలి. కందం శరీరం చిన్నది కనుక పాదపూరణ పదాలలో నెట్టుకు రావడం కుదరదు. ఇదంతా నిమిషంలోపు బుద్ధిలో స్మరించి మొదటి పాదం మొదలు పెట్టాలి.

మాడుగులవారు సభను ఆకట్టుకొనే సందర్భమిదే. ఏ రాగంలో ఆపద్యాన్ని గానం చేయబోతున్నారో దాని గమకాలను ముందుగా పలుకుతారు, సభ సన్నాహన స్థితిలో ఉండగా పద్యపాదాన్ని అందుకొంటారు. ఆపాతమధుర సంగీత సరస్వతిలో ఓలలాడుతున్న శ్రోత ఆలోచనామృతాన్ని ఆస్వాదిస్తాడు. 'దీవ్యద్దుర్దినమనగా' అని పద్యం మొదలయ్యింది... ఇంకేముంది? సమస్య వీగి పోయింది. దుర్దినమనగా మేఘావృతమైన దినం, మబ్బులు క్రమ్మినరోజున పగలే చీకట్లు క్రమ్ముకొంటాయి. మొదటి పాదానికే పరిష్కారం ... ఇది శర్మగారి వైదుష్యం.

**కం॥ దీవ్యద్దుర్దిన మనగా**
**"భవ్యుండీ కరణి తరణి పటు మేఘాంత**
**స్సేవ్యుండై యిటు నిలిచెను**
**ఖవ్యాప్తములయ్యెనిరులు ఖరకరుడుండన్"**

సూర్యుడు మేఘమండలాన్ని దాట గలడని స్ఫురింప జేసే ఆశావాదం కొరకు 'తరణి' పదప్రయోగం ఎంతో ఔచిత్యవంతమైనది. నాలుగో పాదంలో ఆకాశానికి ఏకాక్షర మైన 'ఖ' వాడటం వారి ప్రతిభాతిరేఖ స్ఫురణకు నిదర్శనం.

ఇటువంటి సమస్యే 'ద్రుపదరాజు పుత్రికకు నల్గురెభర్తులు నమ్మకంబు గన్' - ఇందులో మొదటి అక్షరం లోపించింది. కానీ ఇది చంపకమాల. లోపించిన అక్షరం గురువుకారాదు, కానీ రెండవ అక్షరం సంయక్షార మైనది. ఇటువంటి చోట శాస్త్ర పరిజ్ఞానం అవసరం. గురుకులక్లిష్టులైన శ్రీ నాగఫణిశర్మగారి పూరణ ఇలా ఉన్నది.

**విద్రువగ తాపమాయమ వివేక విశాల విశిష్ఠ వృత్తిచే**
**నద్రువము గాగ(బల్కెనని నాదృతితో బతి శాంతి మాటలన్**
**నెద్రిచెను తక్కు సోదరులు నెమ్మని సంధి, రణంబె మేలుగా**
**న, ద్రుపద రాజ పుత్రికకు నల్గురె భర్తలు నమ్మకంబుగాన్**

అద్రుచు, పద్రుచు, విద్రుచు మొదలగు పదములలో ఊనిక లేనందున అ-ఏ-వి గురువులు కావని ఛందశ్శాస్త్రం చెబుతుంది.

ఆ జ్ఞానం ఉంటే దీనిని పూరించవచ్చు. ఈ పద్యాలను పలికేటప్పుడు కూడా మొదటి అక్షరంపై ఊనిక లేకుండా



చదవాలి. నాగఫణి శర్మకి సంస్కృతంలో సమస్య ఇవ్వాల్సిన ప్రాశ్నికుడు 'నీపేరేమే జలజ వదనా నిత్యమున్ ముద్ధునీవ' అని ఇచ్చాడు. అదేంటి తెలుగులో ఇచ్చారు అని శ్రోతలు భావించారు కాని అవధాని మందహాసంతో 'ముద్ధు' లోని మహా ప్రాణాన్ని పట్టుకొన్నారు. అంతే సమస్య సంస్కృతంగా మారిపోయింది. నీపము కడిమిచెట్టు, రేమే - రముక్రీడాయాం ధాతురూపం, జలజవదనం సంబోధన, నిత్య+ముత్+ముత్+ధునీ+ఇవ - ముత్- సంతోషం, అది ద్విగుణీకృతం - ఇదంతా బౌద్ధిక పరిశ్రమతో సాధ్యమౌతుంది. కానీ, సంస్కృతం సమస్య ఇవ్వమంటే తెలుగులో ఇస్తారా' అని పేచీ పెట్టుకుంటే సాధ్యంకాదు. ఎంతరమ్యంగా ఉంది సమస్య - అందుకే అవధాని పూరణకూడా అంత రమ్యంగానే మొదలుపెట్టారు. ఛందస్సు మంద్రాక్రాంతం మెల్లమెల్లగా ఆ శ్లోకభావం శ్రోత హృదయాన్ని ఆక్రమించుకొని వశపరచు కొనే పూరణ వెలువడింది చూడండి.

**"రమ్యం రమ్యం రసమయకథా రాసలీలాభిగమ్యం**
**చిత్రంచిత్రం చతురసుకలా చిద్విలాసం విలాసం**
**గోవిందం తం సపదిసుపదం నిత్యమన్వేష్టుకామా**
**నీపేరేమే జలజవదనా నిత్యమున్ ముద్ధునీవ"**

గోవిందుని కోసం కడిమి చెట్ల నడుమ వెదుకుతున్న గోపిక పాఠకుని (శ్రోత) కళ్ళముందు ప్రత్యక్షం కాగానే రమ్యం రమ్యం అని పలవరించకుండా ఉంటాడా? మరో జయదేవుడై పాటగా మారిపోకుండా ఉండగలదా?

నాగఫణిశర్మ వ్యాకరణ వైదుష్యంతో పూరించిన "మత్కపితృకు దెమ్మనె పతి మగువయుదెచ్చెన్" (అహం పితాయస్యసః మత్కపితృకః - నా కొడుకును అని అర్థం) మొదలగు సమస్యలు, "ఓ సెంకీరేవడుసాయనంగ నది

యిస్కిస్కీలె పోపొమ్మనెన్'' వంటి గ్రామ్య పదభూయిష్ఠ సమస్యలు జ్యోతిష పరంగా పూరించిన సమస్యలు, సమకాలీనాంశాలతో పూరించిన సమస్యలు అనేకం ఉన్నాయి. అన్నిటికీ మించి అందరి నాల్కలపై నిలిచిన సమస్య ఒకటి ఉన్నది. సమస్య, పూరణ అనే విషయాలు ప్రక్కనపెడితే ఆ పద్యం శ్రోతల హృదయాన్ని శాంతరసమయం చేసేసింది.

**తే॥గీ॥ "అకట కష్టాల కడలి నీకొకనికేన**
**సుఖసముద్రము దేలగా సఖులె అంత**
**నన్ను మరచితి వేమి రామన్నయనుచు**
**భరతుడెదిరించి రాముని భాగమడిగె"**

- ఇదే ఆ పద్యం. దేశ ప్రధానిని అవధానసభకు రప్పించి అవధానం వైపుకు దేశం దృష్టిని మరల్చిన ఘనత నాగఫణి శర్మదే. ప్రధాని హెూదాలో పి.వి. నరసింహారావు అడిగిన ప్రశ్నకు శర్మగారు చెప్పిన పద్యం ఇలా ఉంది.

**ఆ॥వె॥ "సకలభారతమును శాసించగలరేడు**
**ప్రశ్నవేయకుండ ప్రశ్నవేసె**
**ప్రశ్నయేది నాకు ప్రశ్న సమూహాన**
**ప్రశ్నమిగిలెనాకు ప్రశ్నగానె"**

నాటి ఉపరాష్ట్రపతి శంకర్‌దయాల్ శర్మ గారు చపాతి, పరోట, సాంబారు, కుర్మ అన్న పదాలనిచ్చి సంస్కృత శ్లోకం చెప్పమన్నారు. ఈ దత్తపది చాలా ప్రసిద్ధి కెక్కింది.

**శ్లో॥ యశ్చపాతి జగత్సరం, యోనుకంపాపరో-టతి ।**
**సాంబారుద్ర స్తమాశ్రిత్య వయం కుర్మః నమశ్శతమ్ ॥**

అతనికంటే ఘనుడు ఆచంటమల్లన్న అన్నట్లు ఇదే అద్భుతమనుకొంటే డా॥ చెఱువు సత్యనారాయణశాస్త్రి గారు మండపేట-పోదాం-వస్తావా-చిలకా అన్న పదాల నిచ్చి శిఖరిణీ వృత్తంలో అమ్మవారి వర్ణన కోరారు. అమ్మవారి కరుణకు నోచుకొని వారికి అది సాధ్యంకానిపని. య-మ- న-స-భ-వ అన్న గణప్రస్తారం గల ఈ శ్లోకంలో మండపేట పాదాంతంలో తప్ప ఎక్కడా ఇమడదు. ఈ స్ఫురణ కలుగక పోతే మండపేట మట్టిలో కలిసిపోతుంది. దాన్ని మొదటి పాదాంతంలో పొదిగిన అక్షర విశ్వకర్మను ఈ శ్లోకంలో మనం దర్శించవచ్చు.

శిఖరిణీ వృత్తం:

**"తపోదాంతే భక్తే కురుకురు దయాం తత్ హృదయమం**
**డపేటత్వం నిత్యం భగవతి! శివానందలహరి**
**శివస్తావా నేవ త్వయిగత మహాశక్తి విభవః**
**వయం కేవాస్తోతుం శుభరుచి లకారార్ధ విభవే"**

వస్తావా అన్న పదం సంధిగతంగా తయారు కాగా, చిలకాలో లకారార్ధ విభవగా అమ్మగారే ప్రత్యక్షమయ్యారు. తెలుగులో చేసిన దత్తపదులు కూడా రమ్యాతిరమ్యములే. లోకోత్తర



భావనలను అలవోకగా నిక్షిప్తం చేసి శ్రీ నాగఫణి శర్మగారు వర్ణించిన పద్యాలు తెలుగు భారతికి నైవేద్యాలుగా భాసిల్లుచున్నాయి. కవితాత్మక గాంభీర్య పదగుంఫన శ్రీ శర్మ గారి జీవలక్షణం. దానికి నిదర్శనంగా తిరుపతి వెంకన్న శబ్ద బ్రహ్మంగా వర్ణించిన పద్యం ఇలా ఉన్నది.

**మ॥ "తిరునామంబులు తీర్చి శేషగిరిపై దేవేరితో తేరిపై**
**వరశంఖంబును చక్రమున్ గలిగి దీవ్యత్కౌస్తుభోరస్కుడై**
**పరమామ్నాయ రహస్యమంత్రపదమా బ్రహ్మోత్సవ ప్రాభవ**
**స్ఫురితానేక విధాన భావశబలీ! పూర్ణాకృతీ! తిర్పతీ!**

పరమామ్నాయ రహస్యమంత్ర పరమైన పరబ్రహ్మమే తేరిపై ఊరేగుతున్నాడన్న భావనలోని గాంభీర్యం నాన్యతో దృశ్యము.

అవధాన నందనవనంలో నడిచే భద్రగజం వంటిది శ్రీ నాగఫణి శర్మగారి పద్యం. మందాకినీ పావిత్ర్యం, శివ జటాజూట వినిర్గతవేతము, నవరసమాధుర్యము, సంగీత చితము నాలుగు పాదాలుగా నాలుగు కాలాలు పరిఢవిల్లే పద్యాలను శ్రీ మాడుగుల నాగఫణి శర్మగారు ఆశువుగా రచిస్తున్నారు. నిరుపమాన కృషితో అవధాన సరస్వతీ పీఠం నెలకొల్పిన వీరు అవధాన సరస్వతికి నిలువనీడ నిచ్చిన నిలువెత్తు భక్తుడైనారు. పద్యానికి ప్రతిష్ఠ, గేయానికి విశిష్ఠత, అవధానానికి వైభవం వీరు సమకూర్చిన ఆభరణాలు. శ్రీ నాగఫణి శర్మగారి వాణి విస్తృతమైనది.

ఇటువంటి నాగఫణిశర్మగారికి అవధానరంగంలో అవధాన కళకే మొట్టమొదటిసారిగా భారత సర్వోన్నతపౌర పురస్కారం "పద్మశ్రీ'' రావడం - అవధానులకు, అవధానకళకు వారి వల్ల ఏర్పడిన సామ్రాజ్య గౌరవం.

ఇంతపెద్ద కొండను అద్దంలో చూపే ప్రయత్నమిది. విజ్ఞులు గ్రహింతురుగాక! ■



# సరస్వతీ ఉపాసన సారస్వత ఉద్దీపన

**తెలుగు సాహిత్య చరిత్రలో అవధాన రంగం సమున్నతమైనది. ఈ రంగానికి గత అర్ధ దశాబ్దంగా వైభవాన్ని సంతరింపజేసిన ప్రజ్ఞాని బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ. అష్టావధానం నుంచి శత, సహస్రావధానాల దాకా ఎంతో మంది అవధాన కళా ప్రదర్శనలో వెలుగొందడానికి మార్గదర్శకులు వీరే. ముఖ్యమంత్రులే కాక, దేశ ప్రధానమంత్రి సైతం వీరి అవధాన కళను ప్రశంసించి గౌరవించడం తెలుగులో అవధాన విద్య ప్రాభవానికి నిదర్శనం. మాడుగుల వారి సాహిత్య ప్రస్థానం భవిష్యత్ తరాలకు ఒక దిక్సూచి.**

30 ఏళ్లనాటి మాట. నేను కడప ఆకాశవాణి డైరెక్టరుగా 1993-95 మధ్య పనిచేశాను. అప్పుడు అక్కడ ప్రతిష్ఠాత్మకమైన రామకృష్ణా జూనియర్ కాలేజిని న్యాయవాది ఆర్. రంగనాథం సమర్థవంతంగా నడిపేవారు. ఆ విద్యాసంస్థలో ప్రముఖ పండితులు డా. పుట్టపర్తి నారాయణచార్యులు కొంతకాలం బోధించారు. అదే విద్యాసంస్థలో మాడుగుల నాగఫణి అధ్యాపకులుగా చేరారు. మేమిద్దరం తరచూ కలిసి సాహిత్య చర్యలు చేసేవారం. అవధానిగా ఆయన అప్పటికే లబ్ధ ప్రతిష్ఠులు.


డా. రేపూరి అనంత పద్మనాభరావు

నాగఫణి శర్మ తిరుపతి శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య కళాశాలలో చేసిన విద్యాభ్యాస పునాదులు పటిష్ఠంగా ఉన్నాయి. స్వయంగా అష్టావధాని అయిన గౌరీపెద్ది రామ సుబ్బశర్మ శిష్యరికం ఆయనకు పాండితీ ప్రకర్షను చేకూర్చింది. అక్కడే వాగ్దేవీ పాద మంజీరాల ఘలంఘలలు శర్మ మస్తిష్కంలో నినదించాయి. ప్రతిభా వ్యుత్పత్తులు జన్మతః సిద్ధించిన వ్యక్తి కావడం వల్ల భవిష్యత్ కాలంలో ఆయన అవధాన పాండితికి ఆదిభూషణాలు అయినాయి. తాను జన్మించిన అనంతపురం జిల్లా తాడిపత్రిలోని భగవంతుని కృపాకటాక్ష వీక్షణాలు ప్రసరించాయి.

"ప్రపేదిరే ప్రాక్తన జన్మవిద్యాః" అన్న రీతిలో నాగఫణి శర్మ 14వ ఏటనే అతి చిన్నవయసులో తొలి అష్టావధాన ప్రదర్శన విజయవంతంగా నిర్వహించిన ధీమణి. తాను తిరుపతిలో చదివిన సాహిత్య శిరోమణి డిగ్రీ అవధాన శిరోమణిని చేసింది. ఆపైన ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి పి.ఓ.యల్. పూర్తి చేశారు.

ఆయన నిరంతర విద్యార్థి అనడానికి నిదర్శనం - మైసూరు విశ్వవిద్యాలయం నుండి సంస్కృత ఎం.ఏలో నెగ్గారు. ఢిల్లీలోని రాష్ట్రీయ సంస్కృత సంస్థానం నుండి 'శిక్షాశాస్త్రి' పట్టా లభించింది. విజ్ఞాన తృష్ణతో తిరుపతి రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం వారికి సమర్పించిన సిద్ధాంత వ్యాసానికి డాక్టరేట్ లభించింది అలా విద్యాసుగంధాలు వెల్లివిరిశాయి.



**తిరుమలేశుని సన్నిధిలో ...**

భగవంతుని లీలలు అనేక రకాలు. తిరుమల తిరుపతి దేవస్థానం వారు నాగఫణిశర్మను హిందూధర్మ ప్రచార పరిషత్‌లో అదనపు కార్యదర్శిగా 1990లో నియమించారు. టీటీడీ కార్యనిర్వహణాధికారి యం.వి.యస్. ప్రసాద్ ప్రత్యేక చొరవతో నాగఫణి శర్మ ధార్మిక ప్రసంగాల ద్వారా ధర్మప్రచారం గావించారు. స్వతంత్ర భావాలుగల శర్మ, రెండేళ్ళు ఆ పదవిలో కొనసాగి విరమించుకొన్నారు.

**మహాసహస్రావధానం**

నాగఫణిశర్మ అవధాన జైత్రయాత్రలో సువర్ణాధ్యాయం ప్రధానమంత్రి పి.వి. నరసింహారావు 1996లో ముఖ్య అతిథిగా పాల్గొనడం. సాహితీప్రియుడు, బహుభాషావేత్త మూర్తీభవించిన పాండిత్య స్ఫూర్తిగల పి.వి. హైదరాబాదులోని లలితకళా తోరణంలో జరిగిన అవధానసభలో మాట్లాడారు. అవధానంలోని క్లిష్టతను పేర్కొంటూ నాగఫణిశర్మ ప్రతిభావ్యుత్పత్తులను బహుధా ప్రశంసించారు. 24 రోజులపాటు 1116 మంది



పృచ్ఛకులతో వైభవంగా జరిగిన అవధాన ప్రదర్శన అది. దేశ ప్రధాని పాల్గొనడం విశేషమైతే తానూ పృచ్ఛకుడిగా పాల్గొన్నారు. "తాను సమయాభావబాధితుడిననీ, తాను చేస్తున్నదీ అవధామన్నారు. తెలుగులో భావంతో పాటు, పాండిత్యము, శబ్దాధిపత్యము అవసరమన్నారు. నన్నయకాలం నుండి నేటివరకు తెలుగు సాహిత్య విశిష్టత అలానే కొనసాగుతోంది. రాఘవ పాండవీయము, యాదవ రాఘవపాండవీయం వంటి ద్వ్యర్థి త్ర్యర్థికావ్యాలు ఇతర భాషలలో లేవు. తెలుగులో, దక్షిణభాషలవారికీ అవధానాలు ప్రత్యేకత. ధారణ అనేది అవధానంలో ప్రముఖం. వందల సంవత్సరాలుగా అవధానులు తెలుగునాట విలసిల్లారు. పార్లమెంటులో జవాబులు చెప్పినట్లు చెప్పాలి. దీనికి జీవితకాల సాధన అవసరం. ఈ అవధాన ప్రక్రియ అంతరించి పోకుండా చూడవలసిన బాధ్యతవుంది. శర్మ కొందరు యువకులకు ఈ విద్యలో శిక్షణ ఇవ్వాలి. ధారణాశక్తిని, పద్యరచనను నేర్పించాలి. దీనినొక శాస్త్రంగా, ఆర్ట్‌గా అభివృద్ధి చెయ్యాలి. ఈయన "హ్యూమన్ కంప్యూటర్ అని అభినందించారు పి.వి." సభలో పద్మభూషణ్ డా.సి. నారాయణరెడ్డి విశిష్ట అతిథి.

పృచ్ఛకుడిగా పి.వి. చమత్కార సంభాషణ చేశారు. "గడ్డివాములో సూది వెదికినట్లుగా వుంటుంది" అన్నారు పి.వి. "సకలభారతమును శాసించగలవారేడు ప్రశ్న వేయకుండ ప్రశ్నవేసె" అని నాగఫణిశర్మ ఆశువుగా సమాధాన పద్యరచన చేశారు. అదొక చరిత్రాత్మక సన్నివేశం.

**అవధాన ప్రదర్శనా వైదుష్యం... జైత్రయాత్రలు**

1985లో అనంతపురంలో 80 మంది పృచ్ఛకులలో తొలిసారిగా సంస్కృతాంధ్ర దశగుణితాష్టావధాన ప్రదర్శన పండితలోకాన్ని మెప్పించేలా నాగఫణిశర్మ చేశారు. ఉభయ భాషలలోను ఆయన పాండితీ ప్రతిభకు అది నిదర్శనం.

1987లో నన్నయ భారతాంధ్రీకరణ చేసిన రాజ మహేంద్రవరంలో 116 మంది పృచ్ఛకులలో సంస్కృతాంధ్ర శతావధానం నిర్వహించారు. అదొక చారిత్రక సంఘటన.

1989లో హైదరాబాదులోని నల్లకుంట శంకర మఠంలో పూజ్యశ్రీ జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ స్వామి శృంగేరీ పీఠాధిపతి సమక్షంలో సంపూర్ణ సంస్కృత శతావధానం నిర్వహించి సత్కృతులయ్యారు.

1990లో 108 మంది పృచ్ఛకులతో వరంగల్‌లో సంస్కృతాంధ్ర శతావధానము, 1991లో రాష్ట్రపతి శంకర దయాళ్‌శర్మ సమక్షంలో తిరుపతిలో సంస్కృతాష్టావధానము,

1992లో కాకినాడలో 112 మంది పృచ్ఛకులతో సంస్కృతాంధ్ర శతావధానము, 1994లో విశాఖపట్నంలో 153 మందిలో మహాశతావధానం, 1995లో ముఖ్య మంత్రి నందమూరి తారకరామారావు సమక్షంలో 225 మందితో ద్విశతావధానము, 1996లో ప్రధాని సమక్షంలో మహా సహస్రావధానం, 1997-98 మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా హైదరాబాదులో 2116 మందితో బృహత్ ద్విసాహస్రావధానము, 1999లో అమెరికాలోని న్యూజెర్సీలో ఏకదినశతావధానం, 2000 సంవత్సరం న్యూఢిల్లీలో ప్రధాని అటల్ బిహారీ వాజపేయి ప్రశంసలతో 'తరుణ తపస్వి - బిరుద సత్కారము, అదే సంవత్సరం వారణాసిలోని సంపూర్ణానంద సంస్కృత విశ్వవిద్యాలయంలో సంస్కృత శతావధానం, 2001లో హైదరాబాదులో అవధాన సరస్వతీ పీఠంలో 225 మందితో "అమనిలో అవధానం" 2002లో ప్రేక్షకులంతా పృచ్ఛకులే ప్రదర్శన అమెరికాలో. 2003లో హైదరాబాదులో పంచశతావధానం, 2005-2006 మధ్య అమెరికాలోని పలు రాష్ట్రాలలో శతావధానాలు, 2008, 2009లో సంస్కృతాంధ్ర శతావధానాలు (హైదరాబాదు); 2013లో అవధాన విజయిని; 2014లో ఢిల్లీలో, శృంగేరిలో, 2015లో అనంతపురంలో సంస్కృతాంధ్ర దశగుణితాష్టావధానం; 2019లో శృంగేరిలో, 2021 శ్రీకాళహస్తిలో, 2023లో తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో - ఇలా ఎన్నెన్నో అవధాన జైత్రయాత్రలు కొనసాగించారు బహుముఖ ప్రజ్ఞాశాలి నాగఫణిశర్మ.

ఆంధ్రప్రదేశ్ అధికారభాషాసంఘం అధ్యక్షులుగా రాష్ట్రవ్యాప్తంగా పర్యటించారు. ఆర్.టి.సి. బస్సు ప్లేట్లపై తెలుగు సంఖ్యలు ముద్రించే స్థితి నెలకొల్పారు.



### అవధాన సరస్వతీపీఠం

పితృపాదులు నాగభూషణశర్మ (కడవకొలను గ్రామం, తాడిపత్రి, అనంతపురం జిల్లా) వద్ద వేద విద్యలనభ్యసించిన నాగఫణిశర్మ పురాణేతిహాసాలను చిన్నతనంలోనే ఔపోశన పట్టారు. ఆంధ్రదేశంలో అవధాన విద్యావికాసానికి నడుం కట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారు ప్రచురించిన శ్రీమద్భాగవత ప్రాజెక్టులో పరిశోధనలు కొనసాగించారు. 1995లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సౌజన్యంతో భాగ్యనగరం నడిబొడ్డున మాదాపూర్‌లో సువిశాల ప్రాంగణంలో అవధాన సరస్వతీపీఠం నెలకొల్పారు. అక్కడ సరస్వతీమాత సుందర విగ్రహానికి నిత్యం వేద పండితులచే అర్చనలు కొనసాగుతున్నాయి. భక్తజనులు పర్వదినాలలో విశేషంగా సందర్శించి సరస్వతీ మాత అనుగ్రహ పాత్రులవుతున్నారు. ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకిది పర్యాటక కేంద్రమైంది. అరుదైన అవధాన విద్యను యువతలో వ్యాప్తి చేయడానికి అన్ని వర్గాల వారిని ప్రోత్సహించడం వీరి లక్ష్యం. వేదపాఠశాలలో వేదా ధ్యయనము, గోశాలలో నిత్య గోపూజ, సక్రమంగా జరుగుతున్నాయి.



గతంలో శ్రీ కుప్పా కృష్ణమూర్తి (దత్తపీఠం, మైసూరు, వేద పాఠశాల) హైదరాబాదులో వేదగణిత ప్రాశస్త్య పరిశోధనలపై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైంటిఫిక్ రీసర్చి ఆన్ వేదాస్ - స్థాపించారు. వారు మైసూరు దత్తపీఠంలో వేదపాఠ నిర్వహణకై మకాం మార్చారు. ఆ సందర్భంలో ఆ సంస్థ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించగల నాగఫణిశర్మకు అప్పగించారు. అవధాన సాహిత్యపీఠంతోబాటు I Serve బాధ్యతలు కూడా శర్మ చేపట్టారు.








నవరాత్రులలో మూలానక్షత్రం నాడు పీఠంలో శర్మ బాలబాలికలకు నాలుకపై బీజాక్షరాలను లిఖిస్తారు. అదే రీతిలో అక్షరాభ్యాస కార్యక్రమాలను తల్లిదండ్రుల సమక్షంలో నిర్వహిస్తారు. అదొక పండుగ. నవరాత్రులలో సరస్వతీమాతకు, పదిరోజులు విశేషాలంకారాలు సమకూరుస్తారు. అప్పుడు ఆయన ప్రవచనాలు వినడానికి నలుమూలల నుండి జనం విచ్చేస్తారు.

భక్తులు కూర్చొని ఆలకించేందుకు విశాలమైన ఆడిటోరియం నిర్మించారు. శ్రీ పంచమి పర్వదినాన బాసర సరస్వతీ క్షేత్రంలో జరిగే విధంగా ఇక్కడి సరస్వతీ పీఠంలో అక్షరాభ్యాసం నిర్వహిస్తారు. మారుమాముల దత్తాత్రేయశర్మ, వెంకటరమణ శర్మ సోదరులు నిర్వహిస్తున్న అవధాన విద్యావికాస పరిషత్ కార్యక్రమాలను నాగఫణిశర్మ ప్రోత్సహిస్తున్నారు.

**విశ్వభారతం - సంస్కృత మహాకావ్యం**

'నానృషిః కురుతేకావ్యం' అన్నారు పెద్దలు. ఋషి కాని వాడు మహాకావ్యనిర్మాణం చేయలేడు. సంస్కృతంలో అపార పాండిత్యప్రకర్షగల నాగఫణిశర్మ కరోనా సమయంలో 2021లో దీక్షాదక్షతలతో 'విశ్వభారతం' సంస్కృత మహాకావ్యం నిర్మించారు. అష్టాదశ కల్పనలతో, అష్టాదశ ప్రకరణాలలో 350 ఛందోరీతులలో 2700 శ్లోకాలలో కావ్యసృష్టి జరిగింది. 'మేరాభారత్ మహాన్' అనే నినాదంతో భారతమాత ఘనకీర్తిని కావ్యస్థం చేశారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టారు.

ఈ మహాకావ్య నాయకుడు ధర్మపురుషుడు. నాయిక పరమపూజ్య భారతాంబ. వివిధ సంస్కృతులను, ప్రాంతాలను బహుధా వర్ణించారు. సమస్త విషయాలను కథా సంవిధానంలో భాగంగా కవి సుప్రతిష్ఠితం చేయగలిగారు. ఈ గ్రంథాన్ని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సర్‌సంఘ్ చాలక్ మోహన్ భగవత్ హైదరాబాదులో జరిగిన సభలో ఆవిష్కరించి నాగఫణి శర్మ పాండిత్యాన్ని బహుధా ప్రశంసించారు.

హిందూత్వం అన్నా, భారతీయత అన్నా నాగఫణి శర్మ పులకిత గాత్రులవుతారు. ఈ కావ్యాన్ని హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయ పూర్వ ఆచార్యులు వై.వి. రమణారావు హిందీలోకి అనువదించారు.

**నవీన - అవధాన యుగకర్త: నాగఫణి**

1990 నాటికే అవధానిగా ఎంతో లబ్ధప్రతిష్ఠులైన మాడుగుల నాగఫణిశర్మ 1995 ఏప్రిల్‌లో సంస్కృతాంధ్ర భాషలలో "ద్విశతావధానం" చేశారు. అంతవరకూ ఎవరూ ఊహ కూడా చేయని ఈ అపూర్వ ప్రయోగానికి నాటి ముఖ్యమంత్రి - ఎన్.టి. రామారావు ప్రోత్సాహం ఎంతో లభించింది. డా॥ కె.వి. రమణాచారి వంటి వారు ఈ సభానిర్వహణ సారథులైనారు. హైదరాబాదు రవీంద్రభారతిలో సాగిన ఈ సభకు మొదటి రోజు సభా ప్రారంభానికి వచ్చిన ముఖ్యమంత్రి మళ్ళీ ఐదవ రోజు శర్మని సత్కరించడానికి స్వయంగా విచ్చేశారు. "అవధాన సహస్రఫణి" బిరుదుతో శర్మగారిని సత్కరిస్తున్నపుడు- "ఇక మీకు కనకాభిషేకాలు జరగాలి" అని ఆకాంక్షిస్తూ - "మీరు సహస్రావధానం చెయ్యాలి, మేము చూడాలి" అని రామారావు అనడం - శ్రీ గణపతి సచ్చిదానందస్వామి వారు ఆసీనులై ఆశీర్వదించడం - ఇదంతా అవధాన యుగానికి ఒక వైభవశ్రీకారం. తిరుపతి వేంకటకవులు ఎలా అయితే నాటి అవధాన యుగ ప్రారంభకర్తలో అలా ఈ "ద్విశతావధానం" అవధానసారస్వత చరిత్రకు నూతన యుగ ప్రారంభం చేసింది. ఈ నవీన అవధానయుగ ప్రారంభకర్త నిర్ద్వంద్వంగా నాగఫణిశర్మ.

"మహాసహస్రావధానం" అన్నమాట నాగఫణిశర్మ మొట్టమొదట ప్రారంభించారు. వారు ప్రారంభించాక ఎందరో అవధానులు యథాక్షరంగా అనుసరించారు. నాగఫణిశర్మ ప్రభావం అవధానాలపై - తెలుగు సంస్కృతాల ప్రపంచంపై ఎంత ఉందీ అంటే - ఈనాటికీ ప్రతీ అవధానీ తానెన్ని అవధానాలు చేసినా శిఖరాయమానంగా - ద్విశతావధానం - ఆపై మహాసహస్రావధానం చెయ్యాలని తహతలాడుతుంటాడు. అదే నాగఫణిశర్మ **(మిగతా 22వ పేజీలో)**



# 'పద్మశ్రీ' కారం అవధాన జ్ఞానపీఠం


"భారతీయ కళాస్వరూపమైన 'అవధాన విద్య'కు పునరుజ్జీవనం, విప్లవాత్మకమైన పునశ్చైతన్యం, ప్రభావాత్మక ప్రచారం, ప్రసారం ప్రభవింపజేసిన ప్రఖ్యాత సంస్కృతాంధ్రకవి డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మకు 'పద్మశ్రీ' పురస్కారం సమర్పిస్తున్నాము''.. అని 'పద్మ' పురస్కార ప్రదాన మహోత్సవ శుభ వేళలలో భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్మూ భారత ప్రభుత్వ పక్షాన ప్రకటించారు.

అంతేకాదు! తన సుమధుర స్వరంతో, సుస్వర గానంతో, సృజనాత్మక విన్యాసాలతో, ఆధ్యాత్మిక జ్ఞానజ్యోతులను పంచుతూ అవధాన కళాస్వరూపాన్ని అఖండంగా అసంఖ్యాకులకు అందంగా అందించిన అద్వితీయమైన ఘనత, చరిత కూడా ఆయనదేనని భారత రాష్ట్రపతి 'కితాబు' ఇచ్చారు.

అవధానాల చరిత్రలో ఇది అద్భుతమైన, అపూర్వమైన



సందర్భం, సంరంభం! అవధాన ప్రపంచంలో, భారతీయ భాషలలో, తెలుగుదే పైచెయ్యి, తెలుగువారిదే పైచెయ్యి! 'వేదావధానం'తో మొదలై, 'సాహిత్యావధానం' ప్రత్యేక విద్యగా నిర్మాణమై, కళగా విస్తరించిన చరిత్రలో సంస్కృతాంధ్ర భాషలలో అవధానములు నిర్వహించి శభాష్! అనిపించుకున్న చరిత్ర మనది.



మా శర్మ

ఆ చరిత్రను పునః లిఖించిన నేటి మేటి అవధానకవి మాడుగుల నాగఫణిశర్మ. తన అవధాన కళ ఉత్తరాదివారిని సైతం ఊపేసింది, దక్షిణాదివారిని దడదడలాడించింది, భారతేతరులను ప్రకంపితులను చేసింది.

వెరసి! రసిక సమూహాలను రంజింపజేసింది. 'హ్యూమన్ కంప్యూటర్!' అంటూ పీవీ నరసింహారావు వంటి బహుభాషా విదుడు, 'అపరచాణుక్యుడు' ప్రశంసలు కురిపించారు. 'తరుణ తపస్వి' అంటూ 'సుకవి' వాజ్‌పెయి తలలూచి తన్మయుడయ్యారు. 'విశ్వవిఖ్యాత నటసార్వభౌమ' నందమూరి తారకరామారావు 'అవధాన సహస్రఫణి' అంటూ బిరుదములు సమర్పించారు. ఇలా ఎందరో పెద్దలు నాగఫణిశర్మగారి 'అవధాన సరస్వతి'కి ఆరతులు పట్టారు.

పండితపామర రంజకంగా అవధానాలు నిర్వహించే ప్రజ్ఞ ఒకనాడు తిరుపతి వేంకటకవులలో పెద్దవారు చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారికి వుండేది, ఆ ప్రతిభ మళ్ళీ నాగఫణిశర్మకి వచ్చింది. పరమ ఆకర్షణా స్వరూపమైన రూపము, కవితా ద్వీపము కొప్పరపు సోదరకవులలో అగ్రజులు వేంకట

సుబ్బరాయ కవిగారిది. ఆ ప్రకాశం మళ్ళీ మాడుగులవారికి దక్కింది. ఇది వేలజన్మల పుణ్యఫలం, కోటి రూపముల తపోబలం! పదునాలుగేళ్లు నిండకమునే అవధాన విద్యాప్రదర్శనలకు శ్రీకారం చుట్టిన 'అవధాన'శ్రీ'నాథుడు' నాగఫణిశర్మ. అష్ట, శత, సహస్ర, అనంత రూపాలలో వినూత్న విన్నాణాలు చూపించిన అవధాన ప్రయోగశాలి, పద్య, శ్లోక, గీత, నృత్య సంయుక్త సంపూజిత సరణి శ్రీ నాగఫణి.

"సుందరం సుందరం'' అన్నట్లుగా మాడుగులవారి అవధాన ప్రస్థానమంతా సుందరం సుందరం! బహు సారస్వత బంధురం. తెలుగు పద్యానికి ఇంత ఆకర్షణ వుంటుందని, అవధానంలో అంత అందం, ఆనందం వుంటాయని ఈ తరాలవారికి చాటిచెప్పిన జగజ్జెట్టి నాగఫణి! ఒక చేత్తో అవధానాలు, మరో చేత్తో మహాకావ్యాలు, ఒక చోట ప్రవచనం, మరో చోట ప్రబోధ గీతం.. ఇలా సర్వాంగ సుందరంగా సాగుతున్న సహస్రఫణి శ్రీ నాగఫణి. ఇంతటితో ఆగక, పూర్వ 'కవిఋణం', 'ఋషి ఋణం' తీర్చుకుంటున్న ధన్యచరితులు కూడా. ధూర్జటి మహాకవి 'శ్రీ కాళహస్తీశ్వర శతకం', కొప్పరపు కవుల 'దైవసంకల్పం కావ్యం' మాడుగుల నాగఫణిశర్మ వ్యాఖ్యాన వనంలో విరిసిన కల్పవృక్షాలు.

అవధాన సరస్వతికి కోటి దీపాల ప్రభలు కట్టిన ప్రతిభా భాస్వంతుడు. మాడుగుల నాగఫణిశర్మగారి సభలంటే వేలమంది ప్రజలు తండోపతండాలుగా తరలి వస్తారు. అతిరథ మహారథులు ఆత్మీయస్పర్శతో కదలివస్తారు. ఎందుకంటే? వారు కవితా ప్రదర్శనకై చేయెత్తగానే శబ్దార్థాలు "నేనే వచ్చెద నేనె వచ్చెద.. నేనే నేనే'' అంటూ వచ్చి మీద పడతాయి! వచ్చి వూరుకుంటాయా? ఆనందతాండవం చేస్తాయి! నాగఫణిశర్మ వేల పద్యాల సృష్టి చేశారు, కోట్లమందికి రసానందాన్ని, జ్ఞానానందాన్ని, బ్రహ్మానందాన్ని పంచిపెట్టారు, పెడుతూనే



వున్నారు. వీరి వంటివారి అవసరం ఈ జాతికి ఎంతో వుంది. వీరి నుంచి ఇంకా ఎన్నో రావాలి, వీరికీ ఎన్నో రావాలి. మాడుగుల నాగఫణిశర్మగారి మణిమకుటంలో ఎన్నో 'పద్మాలు' వచ్చి చేరాలి. వీరి 'అవధాన సరస్వతీ పీఠం' 'జ్ఞానపీఠ'మై అనంతంగా అఖండ జ్యోతులు వెలిగించాలి, 'తెలుగు' వెలుగై నిలవాలి. ■

20వ పేజీ తరువాయి... సరస్వతీ ఉపాసన...

యుగ ప్రభావం. అందుకే మహాసహస్రావధానం - ఒక చారిత్రక సన్నివేశం అంటున్నాను.

**బృహత్ - ద్విసహస్రావధానం**

అదేవిధంగా అవధానసారస్వత చరిత్రలో 2116 మంది పృచ్ఛకులతో హైదరాబాద్ లలిత కళాతోరణంలో 37 రోజులపాటు సంస్కృతాంధ్రాలలో సాగిన ఈ అవధానం మరొక అపూర్వ చారిత్రిక ఘట్టం.

**అవధాన కళకు 'పద్మశ్రీ'**

ఐదు దశాబ్దాలుగా నాగఫణి శర్మ అవధానం కోసం చేస్తున్న కృషి వలన నేడు భారత ప్రభుత్వం అవధాన కళను గుర్తించి ఈ రంగంలోనే 'పద్మశ్రీ' పురస్కారం వారికి ఇవ్వడం ఎంతో సమంజసం. నాగఫణిశర్మ ప్రతిభావ్యుత్పత్తులను మెచ్చుకొన్న శృంగేరీ శారదా పీఠాధీశులు, కంచికామకోటి పీఠాధిపతులు, దత్త పీఠాధిపతులు, ఆశీస్సులందించి సత్కరించారు. భారతదేశం లోనే కాక, ఖండాంతర ఖ్యాతిగల మాడుగుల నాగఫణి శర్మకు గురుసత్కారం సమర్పించడం అద్వితీయం. హిందూధర్మ పరిరక్షణకు నడుం కట్టుకొన్న దర్శనమ్ మాసపత్రిక రెండు దశాబ్దాలు మనుగడ సాగించి ముందుకు నడుస్తోంది. జయతుజయతు. ■



# ఆస్తికలోకానికి ధర్మజాగృతి

## శృంగేరీ జగద్గురు శ్రీశ్రీశ్రీ విధుశేఖరభారతీస్వామి విజయయాత్ర

**భాగ్యనగరంలో శృంగేరి జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ సన్నిధానం వారి విజయయాత్ర ధార్మికతను పరివ్యాప్తం చేసింది. అక్టోబర్ 16న ప్రారంభమైన ధర్మవిజయయాత్ర నవంబర్ నాలుగు దాకా సాగింది. అనంతరం శృంగేరి వెళ్లి కార్తీక దీపోత్సవంలో పాల్గొన్న జగద్గురువులు తమ ధర్మ విజయ యాత్రను దేశ రాజధాని ఢిల్లీలో కొనసాగించారు. ఆదిశంకర తత్వం, సనాతనధర్మ ప్రచారం, ఆలయాల సందర్శనం, ఆస్తికులకు ధార్మిక ప్రసరణలు అందించి జగద్గురువులు తమ ధర్మ విజయయాత్రలో అనుగ్రహించారు.**

శ్రీమద్ జగద్గురువులు తమ ధర్మ విజయ యాత్రలో భాగంగా యువతకు, పిల్లలకు ధర్మానురక్తిని, ఆధ్యాత్మిక చింతన, దేశ భక్తిని పెంపొందింప చేసే అద్భుతమైన కార్యక్రమాలు ఎన్నో నిర్వహించారు. వివిధ పాఠశాలలను సందర్శించి అక్కడి యాజమాన్యానికి , ఉపాధ్యాయులకు , విద్యార్థులకు అత్యద్భుత మార్గనిర్దేశనం చేశారు.



హైదరాబాద్ మణికొండలో గల శారదా విద్యా సంస్థ, బండ్లగూడలోని అర్క స్కూల్ మొదలైన పాఠశాలలు సందర్శించి విద్యార్థులని ఉద్దేశించి అనుగ్రహభాషణలు చేశారు.


యువత కోసం ప్రత్యేకంగా 'ప్రశ్నోత్తర మాలిక' శీర్షికను నిర్వహించి, నేటి యువత ఎదురుకుంటున్న వివిధ లౌకిక పరిస్థితులను సులభంగా, ధార్మిక కోణంలో ఎట్లా మెలిగి అధిగమించాలో దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమం శ్రీ చరణుల వద్ద ప్రత్యక్షంగా శాస్త్రాన్ని అభ్యసిస్తున్న శతావధాని బ్రహ్మశ్రీ గన్నవరం లలితాదిత్య నిర్వహణలో జరిగింది. స్వామివారు ఉదహరించిన రీతికి మంత్రముగ్ధులైన యువతకు ధార్మిక మార్గ ప్రయాణం సులభతరం అయింది.

### వేద-శాస్త్ర సభలు, చంద్రమౌళేశ్వర ఆరాధన

నల్లకుంట శంకర మఠ ప్రాంగణంలో అక్టోబర్ 23న శాస్త్ర సభ జగద్గురు శ్రీచరణుల అధ్యక్షతన జరిగింది. అందులో వ్యాకరణ, న్యాయ, మీమాంస, వేదాంత శాస్త్రాలలో ప్రఖ్యాత విద్వాంసులు ఎందరో పాల్గొన్నారు. అదే ప్రాంగణంలో 24వ తేదీన స్వామివారి అధ్యక్షతన వేద సభ కూడ జరిగింది. ఈ సభలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ఉద్దండులైన వేద పండితులు, వేద విద్యార్థులు పాల్గొన్నారు.

# దర్శనమ్ కార్యాలయంలో భారతీతీర్థ గ్రంథాలయం ప్రారంభం

శృంగేరి జగద్గురు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ స్వామివారు అవ్యాజ వాత్సల్యంలో నేరేడ్‌మెట్‌లోని దర్శనమ్ కార్యాలయం శ్రీరామ సిద్ధాంతి భవనాన్ని సందర్శించారు. నవంబర్ 2వ తేదీ సాయంత్రం వేంచేసిన జగద్గురువులు దర్శనమ్ కార్యాలయంలో భారతీతీర్థ గ్రంథాలయాన్ని ప్రారంభించి 'దర్శనమ్ వెబ్‌సైట్' ఉద్ఘాటనం చేశారు. జగద్గురు భారతీతీర్థ మహాస్వామివారి గురువందనం దృశ్యకావ్యంగా రూపొందించిన రెండు గీతాలను జగద్గురువులు ఆవిష్కరించి, దర్శనమ్ సనాతన ధర్మ సేవలో మరింత పురోగమించాలని అనుగ్రహించారు. దర్శనమ్ సంపాదకులు మరుమాముల వెంకటరమణ శర్మ, ప్రచురణ కర్త మరుమాముల రుక్మిణి, కుటుంబసభ్యుల జగద్గురువులకు గురువందనం సమర్పించారు. శతావధాని జి.ఎం. రామశర్మ 'గురుస్తవ నవశ్లోక సుమ మంజరీ' స్వాగతపత్రంగా సమర్పించారు. 'దర్శనమ్' కార్యాలయ ప్రాంగణంలోనే పంచామృతాలతో స్వర్ణ లింగానికి అభిషేకం, అర్చన చేశారు.









అదే రోజున భారత ప్రభుత్వం చేత 'పద్మశ్రీ' పురస్కృతులు విద్వన్మూర్తి, బృహత్ ద్విసహస్రావధాని బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. తదనంతరం శ్రీ సన్నిధానం వారు అనుగ్రహభాషణం చేశారు.

స్వామి వారి దర్శనం, ప్రతిరోజూ సాయంత్రం నిర్వహించే చంద్రమౌళీశ్వర అభిషేకం ప్రత్యక్షంగా చూడటం వేలాదిమంది జంటనగర వాసులు అదృష్టంగా భావించారు.

ఆదిశంకరుల తత్వాన్ని, సందేశాన్ని భిన్న పార్శ్వాల్లో సంగీత, సాహిత్య, పౌరాణిక మాధ్యమాల ద్వారా పరివ్యాప్తం చేయాలన్న లక్ష్యంతో శ్రీ శంకర విజయం ట్రస్టు జగద్గురు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ స్వామివారి కరకమలములచే ఉద్ఘాటన జరిగింది. నల్లకుంట శంకర మఠంలో వివిధ రంగాల ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి అనుగ్రహాన్ని పొందారు. శంకర వేంకట కృష్ణ ప్రసాద్, శంకర అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఏర్పాటయిన ఈ ట్రస్టు ఆవిర్భావ కార్యక్రమంలో డా. అనంతలక్ష్మి, మరుమాముల వెంకటరమణ శర్మ, దెందుకూరి సోమనాథ శర్మ, ఓలేటి పార్వతీశం ప్రభృతులు పాల్గొన్నారు.

**ప్రతిష్ఠా కుంభాభిషేకాలు, వివిధ దేవాలయ సందర్శనం**

హైదరాబాద్, నాగోల్ తట్టి అన్నారంలో నూతనంగా ఏర్పాటుయిన శ్రీ విష్ణు సహస్రనామ క్షేత్రంలో పంచాయతన సహిత శ్రీ సీతారామాంజనేయ దేవాలయ ప్రతిష్ఠా కుంభాభిషేకం జగద్గురు విధుశేఖర భారతీ స్వామివారు తమ కరకమలములచే నిర్వహించారు. అనంతరం అనుగ్రహ భాషణంలో శంకరాచార్యుల వారు చేసిన బోధలని, వారు ఉపదేశించిన భక్తి మార్గవైశిష్ట్యం గురించి బోధించారు.

జగద్గురు విధుశేఖర భారతీ స్వామివారు పది రోజుల పాటు





నల్లకుంట శంకరమఠంలో భక్తులను అనుగ్రహించారు. శంకర మఠం ధర్మాధికారి చింతలపాటి శ్రీనివాసమూర్తి, శాఖాధిపతి గోరుగంటు రవి యాత్రా కార్యక్రమాలకు నేతృత్వం వహించారు. అనంతరం మోతీ నగర్ శంకర మఠానికి వేంచేశారు. ఇక్కడ దేవతామూర్తులకు, గోపుర కలశాలకు కుంభాభిషేకం నిర్వహించి ప్రత్యేక హోమాల్లో పాల్గొన్నారు. మఠం ధర్మాధికారి చివుకుల శ్రీరామచంద్రమూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ధార్మికవేత్త, వదాన్యులు ప్లాంజరి శంకరనారాయణ గారి నివాసానికి వెళ్లి వారిని అనుగ్రహించారు. వారు భద్రాచల శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి సమర్పించిన రజత గజాన్ని ప్రత్యేక పూజలు చేసి దేవాలయ కార్యనిర్వహణాధికారి, ప్రధాన అర్చకులకు ఆశీస్సులు అందించారు.

సైనికపురి విజయగణపతి దేవాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శ్రీ నృసింహ స్వామి దేవాలయ ప్రతిష్ఠా నిర్వహించారు. అక్కడ కొలువైయున్న దేవతామూర్తులకు కుంభాభిషేకం నిర్వహించారు. ఇక్కడ జరిగిన చంద్రమౌళీశ్వర అభిషేకం, దర్శనంకు వేలాది మంది విచ్చేసి జగద్గురువుల అనుగ్రహం పొందారు. ఈ నిర్వహణలో ధర్మాధికారి పండరినాథ్, చివుకుల రాఘవేంద్ర శర్మ విశేషంగా కృషి చేశారు.

మంచిరేవుల లోని స్వయంభూ వీరభద్ర స్వామి దేవాలయం, కీసరగుట్ట రామలింగేశ్వర స్వామివారి దేవాలయం వంటి ఐతిహాసిక, పురాతన దేవాలయాలను దర్శించి, అక్కడ లోకకల్యాణార్థం ప్రత్యేక పూజలు నిర్వహించారు.


## సామాజిక కార్యక్రమాలు

దూరదర్శన్ యాదగిరి ఛానల్ వారు నిర్వహించిన ప్రత్యేక ధర్మసందేహాల కార్యక్రమంలో పాల్గొని ధర్మశాస్త్రాలకు సంబంధించిన అనేక సంశయాలని నివృత్తి చేశారు. ఈ కార్యక్రమం లో గన్నవరం లలితాదిత్య, మల్లాది రామనాథ శర్మ, జమ్మలమడక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అర్క ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన కార్తీక దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తి టీవీ కోటి దీపోత్సవంలో తొలిరోజు పాల్గొని జ్యోతిప్రకాశనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి, అనుగ్రహ భాషణం చేశారు. శంకర భగవద్పాదులు చేసిన అనేక రచనలని ప్రస్తావిస్తూ వారు చేసిన ఉపదేశ సారాన్ని ప్రజలకి అనుగ్రహించారు. శృంగేరి శారదాపీఠం అడ్మినిస్ట్రేటర్ గురుసేవానిరత పి.ఎ. మురళి పర్యవేక్షణలో జగద్గురువుల శిష్యులు వ్యాసోర్ఘుల రాధాకృష్ణ, గోపీకృష్ణ, రవిచంద్ర, సాత్విక్, శ్రవణ్ బృందం యాత్ర విజయవంతానికి విశేష సేవలందించారు.

## పురప్రముఖుల సందర్శనం

శ్రీ సన్నిధానం వారు హైదరాబాద్‌లో వేంచేసి ఉన్న సమయంలో ఎందరో పురప్రముఖులు, కేంద్ర రాష్ట్ర మంత్రి వర్యులు, శాసనసభ సభ్యులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల











ఉన్నతాధికారులు, న్యాయమూర్తులు ఎందరో స్వామివారిని దర్శించి వారి అశీరానుగ్రహం పొందారు. తెలంగాణ గవర్నర్ విష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సహచర రాష్ట్ర మంత్రులు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, తెలంగాణ రాష్ట్ర బీజేపీ పార్టీ అధ్యక్షులు నరపరాజు రామచంద్ర రావు, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ఉన్నారు.

**దేశ రాజధాని ఢిల్లీలో...**

హైదరాబాద్‌లో ధర్మ విజయయాత్ర ముగించుకుని జగద్గురు విధుశేఖర భారతీ స్వామివారు నవంబర్ నాలుగవ తేదీ శృంగేరికి వెళ్లారు. అక్కడ కొలువైవున్న శ్రీ మలహానికరేశ్వర స్వామి వారి సన్నిధిలో మహారుద్ర హోమం పూర్ణాహుతి, లక్ష బిల్వార్చన, జ్వాలాతోరణం, కార్తీక లక్ష దీపోత్సవం, తుంగా హారతి, శారదాంబ తెప్పోత్సవం మొదలగు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అనంతరం నవంబర్ 8న దేశ రాజధాని ఢిల్లీకి వెళ్లి, అక్కడ ధర్మ విజయయాత్ర కొనసాగించారు. 1994లో శ్రీమద్ జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామివారు ఢిల్లీలో విజయ యాత్ర చేశారు. సుమారు 31 సంవత్సరాల శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ మహాస్వామివారు ఢిల్లీకి వేంచేయగా ఢిల్లీలో న్యాయకోవిదులు, కేంద్ర మంత్రులు జగద్గురువులను దర్శించుకున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో ఆదిశంకరుల విగ్రహావిష్కరణ సహా రాష్ట్రపతి ఆహ్వానం మేరకు రాష్ట్రపతి నిలయానికి వెళ్లి అనుగ్రహించారు. ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ కూడా స్వామివారిని దర్శించుకుని, అనుగ్రహం పొందారు. ఢిల్లీ నగర ప్రముఖులతో నిర్వహించిన సభలో అనుగ్రహ భాషణం చేస్తూ ప్రస్తుత యుగంలో ధర్మ నిరతి, ధర్మాచరణం చేయవలసిన ఆవశ్యకత గురించి వివరించారు.

**ఢిల్లీలో దేవాలయాల సందర్శనం**

విజయ యాత్రలో భాగంగా ఢిల్లీ నగరంలో స్వామివారు అనేక ఐతిహాసిక దేవాలయాల సందర్శన చేసి అక్కడ విరాజమానమైన అనేక దేవతామూర్తులని అర్చించారు. వికాస్‌పురి వేదపాఠశాల, ధర్మ మహావిద్యాలయ పాఠశాలలు సందర్శించి అక్కడి విద్యార్థులను అనుగ్రహించారు. లోక కళ్యాణం కోసం లక్షమోదక గణపతి హోమం, శతచండి పురశ్చరణ సంకల్పం చేశారు. ధర్మవిజయ యాత్ర ఆసాంతం శృంగేరి అడ్మినిస్ట్రేటర్, గురుసేవా నిరత పి.ఎ. మురళి సారథ్యంలో దిగ్విజయమైంది. వైదిక కార్యక్రమాలు బ్రహ్మశ్రీ తంగిరాల శివకుమార్ శర్మ నేతృత్వంలో జరిగాయి. ఢిల్లీలో జగద్గురువుల విజయయాత్రను న్యాయకోవిదులు, సుప్రీంకోర్టు అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎన్. వెంకటరామన్ పర్యవేక్షించారు.

**- అయ్యదేవర శ్రావణ్ కుమార్**







# దివ్యజ్ఞాన ప్రదాత.. దత్తావధూత

**భిన్నత్వంలోని ఏకత్వ దర్శనం జ్ఞాన స్వరూపమైన దత్తావతారం. మనిషిని మనిషిగా, సాధకునిగా, జ్ఞానిగా, యోగిగా మార్చే నిరాకార, నిర్గుణ పరబ్రహ్మతత్వం, త్రిమూర్తితత్వంతో అవతరించిన అవధూత దత్తావతారం. బ్రహ్మకే బ్రహ్మజ్ఞానం ప్రసాదించిన మహాజ్ఞాని దత్తాత్రేయుడిని గురువుగా ఉపాసనాపరులు, యోగులు, సిద్ధులు ఆరాధిస్తారు. మార్గశిర పౌర్ణమి 'దత్త జయంతి' సందర్భాన ఈ విశేష వ్యాసం.**

మానవ శరీరానికి శిరము (తల) ఏవిధంగా దిశానిర్దేశం చేస్తుందో, అదేవిధంగా మార్గశిర మాసం ఆధ్యాత్మికత వైపు దారి చూపిస్తుంది. విష్ణుప్రీతికరమైన మాసమిది. భగవదారాధనకు విశేషమైన కాలం. సౌరమానం ప్రకారం ధనుర్మాసం అంటారు. ధనుర్మాసంలో నారాయణుని ఆరాధన విశేష ఫలాన్నిస్తుంది. 'సర్వదేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి" సకల దేవతలకు చేసిన నమస్కారం కేశవునికి చెందుతుంది. "మాసానాం మార్గశీర్షోహం ఋతూనాం కుసుమాకరః' అన్ని మాసములకు మార్గశిరం శిరస్సు వంటిది. కనుకనే మార్గశిర మాసం సాక్షాత్తూ తన స్వరూపమ"ని శ్రీమన్నారాయణుడు గీతలో చెప్పాడు. "సస్యాద్యత్వాత్ శీతాతప శూన్యత్వాత్ మార్గశిర మాస ప్రాధాన్యమ్" పంటలు బాగా పండి చేతికి వచ్చే కాలం. సమశీతోష్ణ స్థితిగల కాలమగు టచే మార్గశిర మాసానికి ప్రాధాన్యమేర్పడింది. ఈ మాసంలో సుబ్రహ్మణ్య షష్ఠి, గీతా జయంతి, హనుమద్వ్రతం, దత్తజయంతి మొదలైన పర్వదినాలు వస్తాయి.



బ్రహ్మమానసపుత్రుడు, సప్తమహర్షులలో ద్వితీయుడు బ్రహ్మవేత్తలలో అద్వితీయుడైన అత్రి మహర్షి పుత్ర ప్రాప్తి కోసం భగవంతుని గురించి తపస్సు చేశాడు. ఆ తపస్సునకు ప్రసన్నుడైన మహావిష్ణువు "నేను నీకు పుత్రుడిగా సమర్పించుకుంటున్నాను. 'దత్తో మయాహమిది యద్ భగవాన్ స దత్తః". ఆ విధంగా వరమిచ్చి తనయుడిగా జన్మించాడు. సాక్షాత్తూ మహావిష్ణువు దత్తుడిగా రావడం చేతను, అత్రి మహర్షి కుమారుడు కావడం చేతను దత్తాత్రేయుడిగా వినుతికెక్కాడు. ఆయనకు ఆరు చేతులు, మూడు తలలు. నడిమి శిరస్సు విష్ణువు, కుడివైపు శివుడి రూపంతోను, కళలతోను, ఎడమవైపు బ్రహ్మ రూపంతో వెలసి త్రిమూర్త్యాత్మకుడయ్యాడు. ఆరు చేతులతోను, శంఖం, చక్రం, త్రిశూలం, డమరుకం, కమండలం, అక్షమాలలు ధరించి ఉంటాడు. దత్తాత్రేయుడు వజ్రకవచంలలోనూ, అద్వైత మూలమంత్రంలోను 'వామహస్తే న వరదం దక్షిణేనాభయ ప్రదం' అని ఉంది. అంటే ఆయన వామహస్తం వరదప్రదమని, దక్షిణ హస్తం అభయహస్తమని వర్ణించబడింది.

దత్తుడు త్రిలోకవంద్యుడు. ఆయన తన భక్తులకు సుఖాలనిచ్చి, వారి బాధలు తాననుభవిస్తాడు. దత్తవరదుడు భక్తవత్సలుడు, ఆర్తిహరుడు, దీనబాంధవుడు, కృపాసింధువు, సర్వకారణ కారణుడు. సర్వరక్షాకరుడు, పరిత్రాణపరాయణుడు సర్వానర్థహరుడు, సర్వక్లేశహరుడు, భక్తాభీష్టప్రదుడు, భక్తాధీనుడై వారి వాక్కును వేదవాక్కు చేస్తుంటాడు.


కేవలం స్మరణ మాత్రముననే సంతుష్టుడై ఆపదలను హరించి, సకల సంపదలను ప్రసాదించే సర్వాభీష్టప్రదాత, త్రిగుణాతీతస్వరూపుడు, పరబ్రహ్మస్వరూపుడు దత్తాత్రేయుడు.

"దిగంబరాయ విద్మహే అవధూతాయ ధీమహి
తన్నో దత్తః ప్రచోదయాత్"

దత్తుడు దిగంబరుడు, అవధూత. 'దిగంబర' అనగా దిక్కులే అంబరము (వస్త్రము)గా కలిగినవాడు. అన్ని దిక్కులకు వస్త్రమై ఉన్నాడు. దత్తా త్రేయుడు శక్తిస్వరూపం. సర్వమంత్ర స్వరూపం, సర్వతంత్ర స్వరూపం, పూర్ణ పరబ్రహ్మ స్వరూపం. సృష్టి స్థితి లయకారు లైన బ్రహ్మవిష్ణుశివాత్మక రూపం. మందార వృక్షం, దాని కింద మణిపీఠం దానిపై ఆయన ఆసీనుడై ఉంటాడు. ఆయన జడలో మల్లెలు, మొల్లలు, జాజులు, మెడలో మణిహారాలు, ఫణిహారాలు, మొలకు బంగారు మొలత్రాడు, శంఖ చక్రాలు, గదాపద్మాలు, డమరు త్రిశూలాలు, మాలా కమండలాలు ధరించి ఉంటాడు. వామాంకమందు అనఘాదేవి (మధుమతీదేవి) వెనుక ధేనువు, నాలుగు వేదాలు నాలుగు కుక్కలుగా యమధర్మరాజు ధర్మధేనువుగా

స్వామిని సేవిస్తూ ఉంటారు. ఈ వర్ణన దత్తాత్రేయుల వారి పరబ్రహ్మతత్వాన్ని, గురుస్వరూపాన్ని, విశ్వరూపాన్ని వెల్లడిస్తుంది.

దత్తాత్రేయుడు కరుణామూర్తి. దత్త.. దత్త అని తలచినంతనే దర్శనమిస్తాడు. స్త్రీ విద్యకు ఆచార్యులు. ఈయన ఇరువది నాలుగు గురువుల దగ్గర విద్యనభ్యసించాడు. వారి నుంచి జ్ఞానాన్ని పొందినట్లు చెప్పాడు. భూమి నుంచి సహనం, వాయువు నుంచి నిర్లిప్తత, ఆకాశం నుంచి నిస్సంగత్వం, జలం నుంచి భూతదయ, అగ్ని నుంచి నిర్మలత్వం, చంద్రుని నుంచి సమస్థితి, సూర్యుని నుంచి సాక్షి మత్వం, పావురం నుంచి మోహం అనర్థదాయకమని, కొండచిలువ నుంచి దైవికంగా లభించిన దానిని స్వీకరించాలని, సముద్రం నుంచి సద్గుణాలతో ఉండి, దుర్గుణాలను తనలోకి రానీయకూడదని, మిడత నుంచి రూపభ్రాంతి ప్రమాదమని, భ్రమరం నుంచి ప్రలోభం కూడదని, ఏనుగు నుంచి బంధాలలో చిక్కుకోకుండా జాగ్రత్త పడాలని, లేడి లాగా మధురగానానికి పరవశించి పోతే విషయవాంఛలనే వలలో కట్టుబడే ప్రమాదం ఉందని, చేపలా జిహ్వా చాపల్యం వల్ల వలలో పడే ప్రమాదం, తేనె స్వీకరించే వాడి నుంచి శ్రమతో సంపాదించి అనుభ వించా



లని, వేశ్యను చూచి క్షణికానందం కోసం ప్రాకులాడ రాదని, గ్రద్ద మాంసపు ముక్కను ఇతర పక్షుల కోసం జారవిడిచి ఆనందించడం చూసి త్యాగం ఆనందహేతువని, బాల్యం చింతారహితమని, కన్య నుంచి ఏకాంతసాధనం ఆత్మానంద కారకమని, బాణాలు వేసేవాడి నుంచి ఏకాగ్రతతో పని చేయాలని, పాము కుబుసాన్ని విడిచినట్లు దేహాన్ని నిశ్చింతగా విడవాలని, సీతాకోకచిలుక లాగా స్వేచ్ఛగా విచారించాలని వినమ్రతతో గ్రహించానని చెబుతాడు. మనచుట్టూ ఉండే ప్రాణులన్నింటి నుంచి ఏదో ఒక మంచి సందేశాన్ని అందు కోవడం జ్ఞానులు కావడానికి సహాయపడతాయని తెలియజెబుతాడు.

దత్తాత్రేయుని నివాసం ఔదుంబర వృక్షమూలం. అంటే మేడిచెట్టు మొదలు. మేడిచెట్టు యజ్ఞవృక్షం. జ్ఞానస్వరూపుడైన దత్తుడికి ఈ వృక్షమూలమంతే ఎంతో ఇష్టం. హైహయ వంశపురాజైన కార్తవీర్యార్జునుడు దత్తుని తపస్సులో మెప్పించి వేయి చేతుల్ని, నిత్య యౌవనాన్ని పొందాడు. త్రేతాయుగంలో అలర్కుడు మొదలైనవారు యోగవిద్యను, ఆధ్యాత్మిక విద్యను సంపాదించి కృతార్థులయ్యారు. ద్వాపరయుగంలో పరశు రాముడు, కలియుగంలో శంకరాచార్యులు మొదలైనవారు ఎందరో ఈ స్వామి కృపను సంపాదించారు.

విశ్వానికే గురుస్థానంలో నిలిచిన దత్తాత్రేయుడిని మార్గశిర పున్నమి నాడు శుద్ధమైన మనస్సుతో ఆరాధించి పూజాగృహంలో చిత్రపటాన్ని నిలుపుకొని భక్తిశ్రద్ధలతో షోడశోపచారాలతో పూజించాలి. అరటిపళ్లు, పొంగలి నైవేద్యంగా సమర్పించి నమస్కరిస్తూ... దత్త స్తవాన్ని త్రికరణశుద్ధిగా పఠించి అర్చించాలి.

గురుపరంపరకు మూలపురుషుడు, అత్రి-అనసూయాదేవిల వరపుత్రుడు, త్రిమూర్తుల అంశతో జన్మించిన దత్తాత్రేయుని అంతఃకరణ శుద్ధితో పూజించుకునే భాగ్యం మనకు లభించడం నిజంగా మన అదృష్టం. అటువంటి అపురూపమైన భాగ్యాన్ని అందించిన దత్తాత్రేయుని స్మరించి, అర్చించి ధన్యం చేసుకోవడం మన కర్తవ్యం.

**- చింతలపాటి శివశంకర శాస్త్రి**

## అమృత తుల్యాలు... గీతోపదేశాలు

'గీత' అనే పదానికి గానమొనర్చుట అని అర్థం. భగవంతునిచే గానమొనరించుట చేత ఇది భగవద్గీత. అర్జునుడి కోరిక మేరకు శ్రీకృష్ణుడు రథాన్ని కురుక్షేత్రంలో కురుపాండవ సైన్యాల మధ్య నిలుపుతాడు. రణరంగంలో అర్జునుడు తన బంధువులను చూచి శోకతప్తుడవుతాడు. ఆ సమయంలో శ్రీకృష్ణుడు సంసార తారణ హేతువైన గీతను ఉపదేశించాడు. ఆ రోజే మార్గశిర శుద్ధ ఏకాదశి. గీత మంత్రమయం. గీతలో ప్రతి శ్లోకం ఒక మహామంత్రం. గీతా తత్త్వం శ్రీకృష్ణునకు సంపూర్ణంగా తెలుసు. అందులో కొద్దిగా తెలిసింది అర్జునుడు, వ్యాసుడు, శుకుడు, యాజ్ఞవల్క్యుడు, జనకుడు మొదలైన వారికి మాత్రమే. గీతా తత్త్వం తెలియదని నిరుత్సాహపడాల్సిన అవసరం లేదు. గీత బోధించిన ఉపదేశాలలో ఒకదానినైనా చక్కగా ఆచరించడానికి ప్రయత్నం చేయడం చాలా శ్రేష్ఠం. అలా ఆచరించడం వల్ల మనస్సుకు శాంతి కలుగుతుంది. అనాచారం వల్ల, అవాచ్యాదుల వల్ల, అభక్ష్యాదులను భుజించడం వల్ల, అస్పృశ్యులను స్పృశించడం వల్ల, ఇంద్రియ సుఖాల వల్ల కలిగే పాపాలన్నీ గీత పారాయణం వల్ల తక్షణం నశించిపోతాయి.

**- చిల్లర సీతారామారావు**




(గత సంచిక తరువాయి)

ఆ దశలో అతను ఆధ్యాత్మిక ప్రపంచం గురించి ఏమి తెలియని స్థితిలో ఉన్నాడు. అయితే ఈ కాలంలో జీవుని దృష్టిని తన వైపుకు మళ్లించటానికి ఆధ్యాత్మిక ప్రపంచం ప్రయత్నించింది. ఆధ్యాత్మిక ప్రపంచము తన ఉనికిని జీవునికి వివిధ పద్ధతులలో బలవంతంగా తెలియచేసింది. దారుణమయిన ఉపద్రవాలు- భూకంపాలు, అగ్నిపర్వతాలు, జారిపడే భూఖండాలు, భయంకరమైన అలలు కలిగిన సునామీలు - ఇలా అనేక ఆధ్యాత్మిక ప్రపంచమును గుర్తు చేసుకోదగిన సంఘటనలు - జీవుని యొక్క దృష్టిని కదిలిస్తాయి. తాను ఒంటరిగా లేడని, తనకు తెలియకుండా తన వెలుపల ఏదో ఉన్నదనే వాస్తవాన్ని జీవునికి ఇవన్నీ తెలియచేసాయి.

విద్యార్థి భూమికి సంబంధించిన చరిత్ర యొక్క ప్రారంభ కాలాల చరిత్రలను చదివితే, జీవుడు ప్రారంభ దశలో అనేకమయిన దుర్గతులతో కొట్టుమిట్టాడని తెలుస్తుంది. ఇవన్నీ జీవులను మేల్కొల్పడానికి అవసరమయ్యాయి. చాలా కాలం తరువాత కొందరు జీవులు రాతియుగ సంస్కృతిని దాటి, దాని కంటె మృదువైన మరియు సౌకర్యవంతమైన శరీరాలకు సరిపోయేలా సౌకర్యాలు సమకూర్చుకొన్నారు. వారు వృక్ష ప్రపంచం ద్వారా ప్రాణం నిలబెట్టుకుంటూ జీవితాలను గడిపే ఆలోచన చేసారు. ఈశ్వరుని నుండి బయటకు వచ్చిన మరి కొందరు జీవులు (కొన్ని రకాల జంతువులు) శిలలు మరియు ఖనిజాలు కలిగిన రాతియుగ సంస్కృతిలో భాగమయ్యారు.

శిలలు మరియు ఖనిజాలు కలిగిన రాతియుగ ప్రపంచం తరువాత జీవులు వృక్ష ప్రపంచంలోనికి వచ్చారు. ఇప్పుడు బయటి ప్రపంచంలో మొక్కలలోని ప్రాణచైతన్యం జీవులకి బాగా అనుభవంలోకి వచ్చింది. వెచ్చని సూర్యుడు, సున్నితమైన గాలి మరియు జీవితాన్ని ఇచ్చే వర్షాన్ని జీవులు ఈ ప్రపంచంలో అనుభవించారు. ఈ జీవులు పెద్దవారవుతున్న కొద్దీ లేదా మరింత సున్నితంగా వారు పెరిగేకొద్దీ, వారు పొదలు మరియు చెట్లు వంటి ఎక్కువ కాలం జీవించే మొక్కలను అనుభవంలో తెలుసుకొనే రోజులలోకి ప్రవేశించారు. వారిలోని అంతర్గత శక్తులు మరింతగా బహిర్గతమయ్యాయి. జీవులు జంతు ప్రపంచంలోకి వెళ్ళడానికి సిద్ధంగా ఉన్న సమయానికి ముందుగా, వారి వెనుకటి తరం వృక్ష ప్రపంచపు అనుభవం పొందింది. అంత కంటె వెనుకటి తరం శిలాయుగపు అనుభవం పొందింది.


ఈ జంతు ప్రపంచంలో జీవులు చాలా వేగంగా పెరిగారు. ఆహారం కోసం వేటాడారు. ఒకరిని ఒకరు ఉపాయాలలో మించి, పరస్పరం మోసం చేసుకొంటూ ఒకరితో ఒకరు పోరాడారు. జీవులలోని ఇంద్రియాలు మరియు సాధారణ మానసిక శక్తులు బహిర్గతమయి శక్తిశాలులయ్యారు; చివరకు జంతువుల రూపాలు తమకు సరిపోవని వారు గ్రహించారు. జంతు పరిణామం ఆగిపోకుండా ఉండటానికి తమ అవసరం

ఉన్నదని జీవులు గ్రహించారు.

విద్యార్థి ఇలా అడగవచ్చు : జీవునికి అనుగుణంగా అతని రూపము పరిణామం చెందేలా ప్రకృతిలో ఏమేమి సహకరించాయి?

దీనికి జవాబిది - జీవుని యొక్క స్వంత ప్రయత్నాలు అతని పరిణామ క్రమానికి తోడ్పడ్డాయి. అతను తనను చుట్టుముట్టిన ప్రకృతి యొక్క గోడ ద్వారా బయటకు చూడాలని కోరుకున్నాడు; అతను చూడటానికి ప్రయత్నించాడు. అతని బాహ్య శక్తి ప్రకృతి యొక్క గోడపై పనిచేసింది. నెమ్మదిగా, చాలా నెమ్మదిగా, ఒక కన్ను పరిణామం చెందింది. క్రమంగా అన్ని ఇంద్రియాలు లోపలి నుండి మరియు బయట ఉండి జీవునికి కర్తవ్య బోధ చేసాయి. జీవుడు వాటన్నింటినీ తనకు సరిపోయేలా తీర్చిదిద్దుకున్నాడు, తద్వారా అతను బాహ్య ప్రపంచంలో తన శక్తులను ఉపయోగించుకొన్నాడు. దేవతలు జీవునికి అవయవ నిర్మాణా లకు సరిపోయే పదార్థాలను ఇచ్చి అతనికి సహాయం చేసారు.

జీవుడు ఏదయినా చూడటానికి ప్రయత్నిస్తున్నప్పుడు, అగ్ని అతనికి తనకు సంబంధించిన - కాంతి కిరణాలతో తాకినప్పుడు కంపించే మండుతున్న పదార్థాన్ని ఇచ్చాడు. అతను రుచి చూడాలనుకున్నప్పుడు, వరుణుడు అతనికి రుచి చూడటానికి సాధ్యమయ్యే తన స్వంత నీటి పదార్థాన్ని ఇచ్చాడు. ఈ విధంగానే మిగతా దేవతలు కూడా జీవునికి సహకరించారు. ఈ రకంగా దేవతల సహాయం ద్వారా జీవుడు తన శరీరాన్ని నిర్మించుకొన్నాడు. అతను తనకు వీలైన విధంగా శరీరాకృతిని తయారుచేసుకోగలిగాడు. ఉపయోగకరంగా లేనప్పుడు, జీవుడు ఆ పదార్థాన్ని విసిరివేసి మరొక దాన్ని తయారు చేసుకొన్నాడు. ఈ రకంగా అతను పరిణామ క్రమంలో ముందుకు సాగుతున్న కొద్దీ తన శక్తుల ద్వారా వేగాతివేగంగా అభివృద్ధి చెందాడు. జీవుని శక్తులు మునుపటి దశల్లో (వృక్ష, జంతు దశల్లో) కంటే చాలా త్వరగా ఫలితాలను తీసుకువచ్చి మరింత స్వేచ్ఛగా పనిచేసాయి.


SANATANA DHARMA
AN ELEMENTARY TEXT-BOOK
OF
HINDU RELIGION AND ETHICS

PUBLISHED BY THE BOARD OF TRUSTEES
CENTRAL HINDU COLLEGE
BENARES

1916

ఇది జీవుని పరిణామం యొక్క సాధారణ ప్రక్రియ. విద్యార్థి ప్రధాన ఆలోచనను గ్రహించేందుకు వీలుగా, జీవుని వారసత్వం విచ్ఛిన్నం కానిదిగా ఇప్పటిదాకా చెప్పబడింది. కానీ, ప్రకృతిలో, సాధారణ ప్రయాణం కొనసాగుతుండగా, అనేక చిన్న మలుపులు మరియు కొద్దిదూరం ప్రయాణించుటకు వీలయిన పక్క రోడ్లు ఉంటుంటాయి. ఇది జీవ పరిణామానికి కూడా అన్వయిస్తుంది. ఉన్నట్టుండి జీవుడు కొంత కాలం మళ్లీ వెనుకటి దశలలోకి జారి పోవచ్చు. అతను చాలా కాలము క్రితం తాను వదిలివేసిన దశలో కొంతకాలం ఉండవచ్చు. అతనిలో పూర్తిగా నేర్చుకోని శక్తి నిగూఢంగా ఉండవచ్చు. కొంత శక్తి అతనిలో అంతగా పరిణామం చెంది ఉండక పోవచ్చు. పాఠశాలలో ఒక బాలుడు చదవకుండా ఉంటే, తిరిగి దిగువ తరగతికి చేర్చు పద్ధతిలో జీవుడు మళ్లీ దిగువ దశకు పడిపోయి ఉండవచ్చు. దిగువ దశకు చేరుకున్న జీవుడు జంతువుతో లేదా మొక్కతో జతచేయ బడవచ్చు. జీవుడు చాలా తామసికంగా ఉంటే, అతను మానవ రూపాన్ని బాగా ఉపయోగించడం నేర్చుకునే వరకు ఒక రాయితో కూడా అతను జతచేయబడవచ్చు.


తాడేపల్లి పతంజలి

ఆ స్థితిలో అతను ఒక జైలులో ఉన్న వ్యక్తిలా ఉంటాడు, మానవ సమాజం నుండి వెలివేయబడతాడు. స్వేచ్ఛ కోసం తన మానవ శక్తులను ఉపయోగించలేడు. కాని జీవుడు ఎప్పటికీ జనన మరణాల చక్రంతో ముడిపడి ఉండకూడదు. జీవుని కోరికలే ఈ జనన మరణాల చక్రానికి అతన్ని కట్టివేసే తాళ్లు. మానవుడు ఈ భూమికి సంబంధించిన వస్తువులను కోరుకున్నంత కాలం, ఈ వస్తువులను పొందటానికి, ఆనందించడానికి అతను ఈ భూమికి మళ్ళీ రావాలి. కనుక అతను ఈ భౌతిక వస్తువులను కోరుకోవడం మానేసినప్పుడు, అతని బంధాలు తెగిపోతాయి. అప్పుడు అతను స్వేచ్ఛగా ఉంటాడు. అతనికి ఇకపై పుట్టాల్సిన అవసరం లేదు; అతను జనన మరణాలు లేని విముక్తి స్థానానికి చేరుకుం టాడు. ఈ స్థితిలో జీవుడిని ముక్తుడు, స్వేచ్ఛా జీవుడు అని పిలుస్తారు.

తరచుగా ముక్తులు (మోక్షమును పొందినవారు) ఇతర జీవుల అభివృద్ధికి సహాయపడటానికి ఈ ప్రపంచంలోనే ఉంటుంటారు. వారి ద్వారా ఇతర



జీవులు త్వరగా విముక్తి పొందవచ్చు. ఇటువంటి ముక్తుల గురించి మనం వేదాలు, పురాణాలు, ఇతిహాసాల్లో చదువు తాము; కొన్ని సార్లు వారు గొప్ప ఋషులు లేదా రాజులుగా ఉంటారు. మరికొన్నిసార్లు వారు చాలా సాధారణ వ్యక్తులుగా ఉంటారు. వారు ముక్తులుగా బయటికి కనిపించినప్పటికీ, వారు స్వచ్ఛంగా, నిస్వార్థంగా మరియు ప్రశాంతంగా ఉంటారు. ఇతరులకు సహాయం చేయడానికి మాత్రమే వారు జీవిస్తారు. వారు లోక శ్రేయస్సు కోసం శ్రమించడంలో తృప్తి చెందుతారు. తాము ఈశ్వరునితో ఉన్నామని ఆ ముక్తులకు తెలుసు.

**దేహినో-స్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా ।**
**తథా దేహాంతరప్రాప్తిః ధీరస్తత్ర న ముహ్యతి ॥ 2**

ఏ విధంగా అయితే దేహంలో ఉన్న జీవాత్మ వరుసగా బాల్యము, యౌవనం, ముసలితనముల గుండా సాగిపోతుందో, అదేవిధముగా మరణ సమయంలో, జీవాత్మ మరియొక దేహము (శరీరము) లోనికి ప్రవేశిస్తుంది. వివేకవంతులు ఈ విషయములో ఆందోళన పడరు.

**అంతవంత ఇమే దేహా నిత్యస్యోక్తాః శరీరిణః ।**
**అనాశినో-ప్రమేయస్య తస్మాద్యుధ్యస్వ భారత ॥**

ఈ భౌతిక శరీరము మాత్రమే నశిస్తుంది; కానీ అందున్న జీవాత్మ నాశనములేనిది, కొలవటానికి సాధ్యము కానిది మరియు సనాతనమైనది (నిత్యమై, ఏ నాటికీ మారనిది). కావున, ఓ భరత వంశీయుడా! యుద్ధం చేయుము.

**య ఏనం వేత్తి హంతారం యశ్చైనం మన్యతే హతం ।**
**ఉభౌ తౌ న విజానీతో నాయం హంతి న హన్యతే ॥**

"ఆత్మ ఇతరులను చంపును" అని అనుకొనేవాడు, "ఆత్మ ఇతరులచే చంపబడేది" అనుకొనేవాడు ఇద్దరూ అజ్ఞానులే. నిజానికి ఆత్మ ఎవ్వరినీ చంపదు, ఎవ్వరిచేతనూ చంపబడదు.



**న జాయతే మ్రియతే వా కదాచిత్**
**నాయం భూత్వా భవితా వా న భూయః ।**
**అజో నిత్యః శాశ్వతో-యం పురాణో**
**న హన్యతే హన్యమానే శరీరే ॥**

ఆత్మకి పుట్టుక లేదు. ఎన్నటికీ మరణం కూడా ఉండదు. ఒకప్పుడు ఉండి, ఇకముందు ఎప్పుడైనా ఉండకుండా ఉం డదు. ఆత్మ జన్మ లేనిది, నిత్యమైనది, శాశ్వతమైనది మరియు వయస్సు లేనిది. శరీరం నశించిపోయినప్పుడు అది నశించదు.

**వేదావినాశినం నిత్యం య ఏనమజమవ్యయమ్ ।**
**కథం స పురుషః పార్థ కం ఘాతయతి హంతి కమ్ ॥**

ఓఅర్జునా! "ఆత్మ ఎవరిచే నాశనం చేయబడదు. నిత్య మైనది, జనన-మరణములు లేనిది" అని తెలిసినవాడు, ఎవరి నైనా ఎలా చంపించును? ఎలా చంపటానికి కారణం కాగలడు?

**వాసాంసి జీర్ణాని యథా విహాయ**
**నవాని గృహ్ణాతి నరో-పరాణి ।**
**తథా శరీరాణి విహాయ జీర్ణా**
**న్యన్యాని సంయాతి నవాని దేహీ ॥**

ఎలాగైతే మానవుడు, చిరిగిన పాత బట్టలను వదిలి కొత్త బట్టలను ధరిస్తాడో, అదే విధముగా జీవాత్మ, మరణ సమయ ములో పాత శరీరమును వీడి కొత్త శరీరమును స్వీకరిస్తుంది.

**దేహీ నిత్యమవధ్యో-యం దేహే సర్వస్య భారత ।**
**తస్మాత్ సర్వాణి భూతాని న త్వం శోచితుమర్హసి ॥ 3**

ఓ అర్జునా! శరీరములో ఉన్న ఆత్మ చావులేనిది; కాబట్టి ఏ ప్రాణి గురించి కూడా నీవు శోకించుట తగదు.

**తద్యథా పేశస్కారీ పేశసో మాత్రాముపాదాయా**
**న్యన్నవతరం కల్యాణతరం రూపం తనుత**
**ఏవమేవాయమాత్మేదం శరీరం నిహత్యావిద్యాం**
**గమయిత్వా అన్యన్నవతరం కల్యాణతరం రూపం కురుతే॥ 4**

స్వర్ణకారుడు, ఒక బంగారు ముక్కను తీసుకొని, మరొక రూపాన్ని, కొత్తగా మరింత అందంగా తయారు చేస్తాడు. అలాగే ఈ ఆత్మ, ఈ శరీరాన్ని విడిచిపెట్టి, అవిద్యను విడిచిపెట్టి, మరొక కొత్త మరియు అందమైన రూపాన్ని పొందుతుంది.

**బ్రహ్మణ్యాధాయ కర్మాణి సంగం త్యక్త్వా కరోతి యః ।**
**లిప్యతే న స పాపేన పద్మపత్రమివాంభసా ॥**
**కాయేన మనసా బుద్ధ్యా కేవలైరింద్రియైరపి ।**
**యోగినః కర్మ కుర్వంతి సంగం త్యక్త్వాత్మశుద్ధయే ॥**

"సమస్త మమకార ఆసక్తులను వదిలివేసి, భగవంతునికే తమ అన్ని కర్మలను అంకితం చేయాలి. అప్పుడు అతనికి, తామరాకుపై నీటి బిందువులవలె పాపములు ఏవి అంటవు.

(సశేషం)




(గత సంచిక తరువాయి)

వీరి తరువాత ఈ పీఠమునకు వచ్చినవారు మహాతపస్వులు, యోగానుష్ఠాన నిష్ఠులు, సకలశాస్త్ర నిష్ణాతులు, వేదాంత విశారదులు, మహామహిమోపేతులు, అవధూతలు నయిన తృతీయ శ్రీ చంద్రశేఖరభారతీ మహాస్వామివారు.

ఓం తత్సత్

**జగద్గురు శ్రీ చంద్రశేఖరభారతీ స్వామివారి దివ్యచరిత్ర**

"బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా" అను తత్వాన్ని బోధించిన చతుర్వేదములు, బ్రహ్మసూత్రములు, పురాణాలు, శాస్త్రాలు, అనేక కావ్యనాటకాలు ఈ గిరి వనప్రాంతములందే ఆవిష్కృతములైనాయి. సత్య సాక్షాత్కారమునకై అనేక మార్గాలను కనుగొని, ఆయా మార్గాలలో తాము నడచి ఆత్మ సాక్షాత్కారము నంది మంత్రద్రష్టలైన ఋషులు ఇట్టి పవిత్ర స్థలములందే తపోనిరతులై యుండిరి. పుణ్యాశ్రమముల నేర్పరచుకొని జీవిత సార్థక్యము పొందేది కూడా ఈ ప్రదేశములయందే.

నగరాల నుంచి గ్రామాల నుంచి బ్రాహ్మణ కుమారులు వేదశాస్త్రాల నభ్యసించడానికి పుణ్యప్రదేశాలకు వస్తారు. క్షత్రియ కుమారులు శస్త్రాస్త్ర విద్యల నభ్యసించడానికి, రాజనీతి నెఱుంగుటకు వచ్చేది ఈ తావులకే. వారే కాదు ఎవరైనా తమ తమ అర్హతల ననుసరించి విద్యావివేకములను పొందడానికి ఈ క్షేత్రాలకే వస్తారు. మహర్షుల పాదసన్నిధికే, ప్రకృతి సౌందర్య దివ్యదేవాలయమునకే, సకల విద్యాభ్యాస సౌకర్యముగల ఈ విశ్వవిద్యానిలయములకే ఎల్లరు వచ్చేవారు.

రాజులు, మంత్రులు, సేనానాయకులు, తదితర రాజోద్యోగులు, సామాన్య ప్రజలు, సర్వులును ఋషివర్యుల అనుగ్రహాశీర్వాదములను పొందడానికి ఈ విపిన గిరిధామములకే వస్తారు. రాజ్య పరిపాలన విషయంలలో సలహాలు తీసుకోవడానికి, కష్టనష్టములలో దిక్కుకానని వారు తమ దుఃఖముల నుండి విముక్తి పొందడానికి, శాస్త్రాది విషయాలలో అజ్ఞాన సందేహాదులు కలిగినవారు వానిని నివారించుకొని యథార్థ విషయాల నెఱుంగుటకు ఈ ప్రకృతి దేవీ సన్నిధానమునందున్న మహాత్ముల మ్రోల మొరబెట్టుకుంటారు. జీవనానికి అవసరమైన శ్రద్ధా విశ్వాసములను సంపాదించుకుంటారు. ఎందుకీ బ్రతుకని దిగులుపడి వచ్చినవారు ధైర్యోత్సాహ సంపూరిత హృదయులై స్వగృహములకేగుదురు. ఈ నదీవనగిరి ప్రాంతములే భారతీయ సంస్కృతికి మూలమైన జీవనాడికి కేంద్రాలై ఉన్నాయి. అట్టహాసముతో ఎగిరిపడుచు వచ్చినవారు కూడ ఈ ప్రదేశములలో వినీతులయిపోయెదరు. దర్పాహంకారమత్తులై ఉన్నవారు వినయ వినమ్రతలు మూర్తీభవించిన వారగుదురు. అక్కడి వాతావరణము, మహాపురుషుల సంపర్కము, ఇంతటి మహాత్మ్యము కలవి. అవి నిజముగా దివ్యచైతన్యదాయకములు.

శ్రీమత్ శంకర భగవత్పాదులు భారతదేశ అఖండత్వమును, భారతీయ సంస్కృతి అద్వితీయతను, సనాతనధర్మ విశ్వవ్యాపకత్వమును ప్రపంచమునకు చాటి సత్యమును లోకమునకు తెలుపుటకును ఆధ్యాత్మిక జ్యోతిని ప్రజ్వలింపచేయుటకును భారతదేశము నాలుగు దిక్కులయందును నాలుగు జ్ఞానకేంద్రములను స్థాపించియున్నారని మనము మొదటనే తెలుసుకున్నాం. భారతమంతయు నొక్కటేయను నమ్మకాన్ని ఆచార్య

పాదులీ రీతిగా దృఢపరిచిరి. దేశమందెల్లెడల చాల మంది రాజులు, పాళెగాండ్రు నున్నను రాజకీయ భిన్నతకు వ్యతిరేకముగా ఆధ్యాత్మిక క్షేత్రమున నైకమత్యము స్థాపించి ఆధ్యాత్మిక దుందుభిని మ్రోగించినవారు శ్రీ శంకరభగవత్పాదులే కదా!

ఈవిధముగా శ్రీ శంకరులచే స్థాపితములైన జ్ఞానకేంద్రములలో దక్షిణామ్నాయ పీఠము సహ్యాద్రి పంక్తిలో, గిరిశృంగమున, వనరాజి మధ్యలో పావన తుంగాతీరమున పరమ రమణీయ ప్రకృతి సౌందర్యనిలయమున, శాంతి సంతోషముల కాకరమైన దివ్యధామమున నెలకొల్పబడినది. పూర్వకాలమున విభాండక మహర్షి శ్రేష్ఠుని ఆశ్రమమై, వారి తరువాత వారి పుత్రులైన ఋష్యశృంగ మహర్షికి తపోభూమియై పవిత్రమైయున్న శృంగేరి శ్రీ శంకరభగవత్పాదులు చేసిన శ్రీచక్రస్థాపన, శ్రీ శారదాప్రతిష్ఠ, వ్యాఖ్యాన పీఠ స్థాపనములచే పవిత్రతమమయ్యెను.




శ్రీ శంకరులు దేశమంతయు కాలినడకతోడనే సంచరించిరని ఇదివరకే తెలిసికొనియున్నాము. ఈ సంచార క్రమమున వారు గోకర్ణాది సర్వపుణ్యక్షేత్రములను సేవించి శృంగేరికి వచ్చారు. తుంగానదియందు స్నానాదికాలను నిర్వర్తించుకొని అనుష్ఠానానికై ఒక్కొక్కమెట్టే ఎక్కుతూ పోగా ఆ మెట్ల మీద ఒకానొక ఆశ్చర్యకరమైన దృశ్యాన్ని చూచారు. ఒక కప్ప ప్రసవవేదనతో సతమతమవుతూ ఎండకు కాలియున్న బండమీద బాధపడుతున్నది. ప్రక్కనే తిరుగుతున్న సర్పమొకటి కప్పను చూచి దాని దగ్గరకు పరుగెత్తుకొని వచ్చింది. ఆ సందర్భంలో ఎవరైనా ఏమనుకొంటారు? అవి రెండూ సహజవైరము కలవికదా! పాము కప్పను మింగివేయాలి. కానీ అలా జరగలేదు. పరమాశ్చర్యకరంగా ఆ పాము పడగవిప్పి ఆ కప్పకు నీడ పట్టింది. జాతివైరాన్ని పరిత్యజించిన ఈ సర్పమండూక మైత్రిని చూచి ఆచార్యవర్యులు పులకితులయ్యారు. తాము సంకల్పించిన ధార్మికాధ్యాత్మిక పీఠ సంస్థాపనమునకు సమయం సన్నిహితమైందని గ్రహించారు. చతురామ్నాయ పీఠాలలో మొట్టమొదటిదైన శ్రీ దక్షిణామ్నాయ పీఠాన్ని పరమపవిత్రమైన ఈ ప్రదేశంలో స్థాపించాలని నిర్ధారణ చేశారు.

తుంగానదికి ఉత్తర భాగంలో ఎత్తైన ప్రదేశంలో శ్రీ శారదాంబా దేవస్థానాన్ని, అందు శ్రీచక్రాన్ని, దానిపై శ్రీ శారదాంబా మూర్తి, శ్రీ దక్షిణామ్నాయ పీఠం స్థాపితమైనాయి. క్షేత్ర రక్షణకు పూర్వ దిగ్భాగమున శ్రీకాలభైరవుని, పశ్చిమాన శ్రీ ఆంజనేయుని, దక్షిణాన దుర్గాంబికను, ఉత్తర దిక్కున శ్రీ కాళికాదేవిని ఆచార్యవర్యులు ప్రతిష్ఠించారు. ఈ కారణాన శృంగేరి అభ్యుయం పొందింది. మహాతపస్వులు, యోగిశ్రేష్ఠులు, ఋషిసదృశులు అయిన మహాపురుషులకు నిలయమైనది. ఏ మహాపురుషుని జీవిత చరిత్రయను పుణ్య పీయూషమును పానమొనర్చుటకై మనం ఉద్యుక్తులమై ఉన్నామో ఆ మహామహిమలు జగద్గురు శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర భారతీ స్వామివారు. వారి పూర్వీకుఉ ఈ పుణ్యక్షేత్రమునందే నివసించారు.

**2**

ఎనిమిదవ శ్రీ నృసింహభారతీ స్వామివారి ఆస్థానమున ఈశ్వరీ సుబ్బాశాస్త్రి అనేవారు ప్రసిద్ధులు ఉండేవారు. వీరు శాస్త్రజ్ఞులు. ఉత్తమ జ్ఞాన సంపన్నులు. మహాన్యాపూర్వకంగా కోటిలింగార్చన మొనర్చిన మహాపుణ్యశాలి. శ్రీ స్వామివారొకప్పుడు సంచార మొనర్చుచుండగా తమ అనుగ్రహానికి పాత్రులైన ఈ విద్వాంసులను తమ తోడనే శృంగేరికి తీసికొని వచ్చారు. వ్యాకరణ శాస్త్రంలో నిష్కృష్టమైన పాండిత్యం గల సుబ్బాశాస్త్రి శుద్ధచారిత్రులు. సదాచార సంపన్నులు, దైవభక్తులు. వీరికున్న సంతతి ఒకే ఒక పుత్రులు గోపాలశాస్త్రి. సుబ్బాశాస్త్రి కొంతకాలం గురుసేవ యందును, శ్రీ శారదా సాన్నిధ్యమునందును ఉండి, ఆ పిమ్మట వృద్ధాప్యమును తపోనుష్ఠానములతో గడుపుచు శ్రీ గురువుల యనుజ్ఞ పొంది శృంగేరి యందే వానప్రస్థాశ్రమస్థులై యుండిరి.

గోపాలశాస్త్రి తండ్రివలెనే విద్యావంతులు, కర్మనిష్ఠులు. శమ దమ తప శ్శౌచ క్షాంత్యార్జవ జ్ఞాన విజ్ఞానాస్తిక్యములను తొమ్మిది గుణాలు వారిలో పుట్టుకతోనే సహజంగా నెలకొన్నాయి. ఉషఃకాలముననే లేచి, తుంగానది యందు స్నాన సంధ్యాదికములను ముగించుకొని, ఇంటిలో దేవ పూజాదుల నొనర్చి పిమ్మట శ్రీ శారదాంబా శ్రీ గురుచరణముల సందర్శన మొనర్చుచుండుట వారి నిత్యకృత్యము.

గృహంలో తమ అనుయాయులతో శాస్త్రార్థ విచార చర్చలు చేస్తూ తమకు తెలిసినదంతా ఇతరులకు బోధిస్తూ, ఇతరుల నుంచి అనేక విషయాలను గ్రహిస్తూ, చర్చలలో పొడచూపిన సందేహాలకు గురువుల నుంచి శాస్త్రిగారు సమాధానములను పొందుచుండెడివారు.

గోపాలశాస్త్రి ధర్మపత్ని లక్ష్మమ్మ... భర్తకు తగిన భార్య. ప్రతి పదమున పతి ననుసరించుచు వారొనర్చు సర్వకార్యముల యందును అనుకూలవతిగా ఉండిన సతి. (సశేషం)

**- చెఱుకుపల్లి జమదగ్ని శర్మ**




# శ్రీమద్దేవీభాగవతం

## నవమ స్కందం

(గత సంచిక తరువాయి)

రాసేశ్వరి అయిన రాధను, దేవేశ్వరి అయిన గంగ చూచింది. తృప్తి కలగలేదు. ఆ సౌందర్యం ఎంత సేపు చూచినా తనివి తీరదు. నారదా! రాధ ఆ సమయంలో జగదీశ్వరునితో మధురంగా ప్రశాంతంగా చిఱునవ్వుతో ఇలా అన్నది - ప్రాణేశ్వరా! ఈ సుందరి ఎవరు? నీ ముఖం చూచి మోహితురాలయ్యింది. నవ్వుతున్నది. కామంతో ఈమె చూపులు కనబడుతున్నాయి. నీ సౌందర్యం చూచి పులకించి మూర్ఛపోతోంది. ముఖాన్ని ముసుగుతో కప్పుకొని పదే పదే నిన్ను చూస్తున్నది. నీవు కూడా చిఱునవ్వులతో, ఆమెపై మోహం ప్రదర్శిస్తూ, పదేపదే ఆమెను చూస్తున్నావు. గోలోకంలో నేనుండగా నా కళ్ళముందు ఈ విధమైన ప్రవర్తనయా! విరజ అనబడే ఒక గోపికతో ఒకప్పుడు నీవు విహరిస్తుండగా చూసాను. అది చూచి కూడా నేను నిన్ను క్షమించాను. నా రాకతో నీవు అదృశ్యమయ్యావు. విరజ కూడా తన శరీరాన్ని విడచి నదీరూపం ధరించింది. నీ కీర్తి చిహ్నంగా విరజానది వైకుంఠంలో కోటి యోజనాల వెడల్పు, దానికి నాలుగు రెట్లు పొడవు కలిగి ప్రవహిస్తోంది. నిజానికి రాధాకృష్ణులు పైకి ఇలా సంభాషిస్తున్నా నిర్వికారులు. లోక శ్రేయస్సు కోసం అప్పుడప్పుడు ప్రణయకలహాన్ని నటిస్తుంటారు. ఈ ఘట్టం నిగూఢార్థాలతో కూడినది. నేను ఇది చూచి తిరిగిపోగానే నీవు నదీరూపంలో ఉన్న విరజను పిలచావు. అప్పుడామె అలంకారం చేసుకొని యోగశక్తితో తన జలాల నుండి నీకు రూపంతో దర్శనమిచ్చింది. ఆమెలోనీ దివ్య వీర్యం నిక్షిప్తం చేయగా ఆమె నుండి సప్తసముద్రాలు పుట్టుకొని వచ్చాయి. ఒకసారి చంపక వనంలో శోభ అనబడే గోపికను చూచావు. అది నా కంటబడడంతో నీవు అదృశ్యుడవయ్యావు. శోభ చంద్రుని కాంతిగా మారింది. అనంతరం నీవు నా తేజస్సును విభజించి సువర్ణంలోనూ, రత్నాలలో మణులలోనూ ఉంచావు. మఱి కొంత స్త్రీల ముఖాలలో, కొంత రాజులలో, కొంత కాంతిని చిగురాకులలో, కొంత పుష్పాలలో ఉంచావు. ఫలాలలో, పంటలలో, రాజభవనాలలో, దేవాలయాలలో, పాలలో ఉంచావు. ఒకసారి ప్రభ యనబడే గోపికతో బృందావనంలో సంచరిస్తుండగా చూచి నేను అక్కడకు రాగానే నీవు అదృశ్యుడవయ్యావు. ప్రభ తన శరీరం విడచి సూర్యునిలో చేరింది. ఆ సమయంలో ఆమె శరీరం నుండి వచ్చిన దివ్య తేజస్సు ఆశ్చర్యకరమైనది. ఆ ప్రభ కాంతిని కొంత అగ్నిలో, కొంత యక్షులలో కొంత పురుషులలో, దేవతలలో కొంత, వైష్ణవులలో కొంత, సర్పాలలో కొంత ఉంచావు. ప్రభ తేజస్సులో మఱికొంత బ్రాహ్మణులలో, కొంత మునులలో, తపస్వులలో కొంత, సౌభాగ్యవతులైన ఆడువారిలో కొంత, యశస్సు కలిగిన వారిలో కొంత ఉంచావు.



డా॥ వద్దిపర్తి పద్మాకర్

మరొకమారు రాసకుండలంలో శాంతి అనబడే గోపికతో విహరిస్తుండగా చూచాను. అనంతరం ఆమె నీలో లీనమయ్యింది. ఆమెలోని కొంతశక్తిని అరణ్యాలలోను, బ్రహ్మలోనూ, లక్ష్మిలోనూ, నాలోనూ ఉంచావు. కాంతిలో కొంత భాగాన్ని మంత్రాన్ని ఉపాసించేవారిలో, శాక్తేయులలో, ధర్మదేవతలో, ధర్మాత్ములలో ఉంచావు. 'క్షమ'తో ఒకసారి కనిపించావు. ఆమె కూడా నన్ను చూచి భూమిలో లీనమైపోయింది. ఆమెను కూడా మహాత్ములలో ఉంచావు. నీ గుణమహిమలు అనంతములు. వాటిని ఎవరు మాత్రం ఎంత గ్రహించగలరు? అని రాధ శ్రీకృష్ణునితో

పలికింది.

**విశేష సూచన :-** రాధ మాటలు అజ్ఞానులకు సరిగా అర్థంకాక శ్రీకృష్ణుడు స్త్రీలతో తిరుగుతున్నట్లుగా మాట్లాడుతున్నారు. ఇక్కడ రాధ శ్రీకృష్ణుని మహిమలనే వర్ణించింది. శోభ, శాంతి, క్షమ, మున్నగునవి పరమాత్ముని గుణాలు. ఈ దివ్య గుణాలతో విరాజిల్లేవాడు పరమాత్మ అని అర్థం. గ్రంథ విస్తరణ అవుతుంది కనుక ఇక్కడ ఇంతకంటె వివరించడం లేదు. ఉపన్యాసాలలో ఈ వివరాలు మీరు తెలుసుకోవచ్చును.

ఈ మాటలు వింటున్న గంగ యోగశక్తితో అదృశ్యురాలయ్యి జలముగా మారింది. రాధాదేవి ఇది గ్రహించి గంగను తన యోగబలంతో పూర్తిగా త్రాగడానికి సిద్ధపడింది. గంగ కంగారుపడి శ్రీకృష్ణుని పాదాలు పట్టుకొంది. శ్రీకృష్ణుడు ఆమెను తన పాదాలలో దాచాడు. గంగ కోసం రాధ, గోలోకం, వైకుంఠం, బ్రహ్మలోకం వంటి లోకాలలో వెదకింది. ఎక్కడా ఆమెకు గంగ కనబడలేదు. గోలోకంలో ఎక్కడా నీరు లేకపోవడం వల్ల సరోవరాలు ఎండిపోయాయి. పద్మాలు వాడిపోయాయి. జల జంతువులు మరణించాయి. త్రిమూర్తులు, అనంతుడు, ధర్ముడు, ఇంద్రుడు, చంద్రుడు, సూర్యుడు, మనువులు, మునులు, దేవసిద్ధులు, తపస్వులు, అందరూ గోలోకానికి వచ్చారు. అందరూ కంఠాలు, తాలువులు ఎండిపోగా, భీతితో గోలోకాధిష్ఠాన దేవత అయిన శ్రీకృష్ణునికి నమస్కరించారు. కృష్ణుడు, శ్రేష్ఠుడు, గోవిందుడు, సర్వేశుడు, ప్రకృతిపరుడు. ఐహికాదులకు అతీతుడు. నిరాకారుడు. నిర్లిప్తుడు. నిరాశ్రయుడు. నిర్గుణుడు. నిరుత్సాహుడు. నిర్వికారుడు, నిరంజనుడు, స్వేచ్ఛామయుడు, సాకారుడు, భక్తానుగ్రహకారకుడు, సత్యస్వరూపుడు, సత్యేశుడు, సాక్షిరూపుడు, సనాతనుడు, పరుడు, పరేశుడు, పరముడు, పరమాత్ముడు, ఈశ్వరుడు. అంతటి పరమాత్ముని పరమభక్తితో, వినయంగా వంగి, గద్గద కంఠులై, ఆనందబాష్పాలు కారుస్తూ, శరీరాలు పులకిస్తుండగా స్తుతించారు. ఆ సమయంలో కృష్ణుడు చిత్రమైన రత్నాలు తాపడం చేయబడిన సువర్ణసింహాసనంపై కూర్చున్నాడు. గోపికలు ఆయనకు వింజామరలు వీస్తున్నారు. కొందరు నృత్యాలు చేస్తుండగా, కొందరు శ్రీకృష్ణునిపై పాటలు పాడుతున్నారు.

(సశేషం)



శ్రీ సాందీపని గురుకుల సేవాట్రస్ట్

Founded By:Maharanyam Sri Sri MuraliDhara Swamiji (Chennai)



Sri Hari

మన సనాతన ధర్మంలో మన జీవన ఆధారం వేదం, వేదం మన హిందూ ధర్మానికి భారతదేశానికి హృదయం వంటిది. ఎటువంటి సౌకర్యాలు లేని ప్రాచీన కాలంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని మహాత్ములు,ఋషులు చాలా కష్టపడి వేదాన్ని సంరక్షించి ఇప్పుడు మన తరానికి అందించారు. వాళ్ళు అందించిన వేదాన్ని కాపాడవలసిన బాధ్యత మన అందరి మీద ఉన్నది.

హైదరాబాద్ నగరంలో ECIL సాకేత్, కాప్రా నందు శ్రీ ప్రేమిక వేదాశ్రమం అను పేరుతో శ్రీ కృష్ణ యజుర్వేద పాఠశాల నిర్వహింపబడుతున్నది, కావున ఆస్తిక జనులందరూ ఈ వేద పాఠశాలకు ధన, వస్తు రూపేణ సహాయ సహకారములు అందించి ఆ వేదమాత యొక్క అనుగ్రహమునకు పాత్రులు కాగలరని కోరుకుంటున్నాము.

ఈ వేద పాఠశాల యందు బ్రాహ్మణ సమారాధన తమ తమ గోత్ర నామములతో చేయించుకున్న వారికి ప్రసాదముగా కుంకుమ, మంత్రాక్షతలు తగు రసీదు పంపడం జరుగుతుంది.

ఆ వేదమాత యొక్క అనుగ్రహం అందరికీ లభించుగాక

Donation Type:One Day Samaradhana-Rs.5000/- One Vidhyarthi Expenses/Month-Rs.8000/- One Day Patasala Expenses-Rs.14000/-

Donations can be made by cheques favoring '' SRI SANDEEPANI GURUKULA SEVA TRUST (A.P.)"


donation can be made by online fund transfer : IFSC Code : **SBINOO12739**

Account Number : **34134951509** Name : SRI SANDEEPANI GURUKULA SEVA TRUST (A.P.),

Branch : SAKETH (HYDERABAD) UPI:ssgsthyd@icici

**Donations are eligible for exemption U/S 80G of Income - Tax Act**

**Admin & Patasala Address : Door no.1-1-31/399A, Lane - 26,Phase-1 Saket nagar,Saket, Kapra, Hyderabad-62. cell:9440875114 - 8667000419**




# మహాభారతసారసంగ్రహము

147

(గత సంచిక తరువాయి)

భగవంతుడైన దేవకీపుత్రుడు అర్జునునితో మైత్రిని చాటు కొంటూ లోకాలన్నింటినీ సంహరించినా, నే నాతని శరణు వేడను" అన్నాడు దుర్యోధనుడు.

"గాంధారీ చూడు, నీ కొడు కేవిధంగా మంచి మాటలు వినకుండా ఎలా అడ్డదిడ్డంగా ప్రవర్తిస్తున్నాడో" అన్నాడు ధృతరాష్ట్రుడు.

గాంధారి పుత్రుణ్ణి నిందిస్తూ - "పెద్దల మాటలు వినని దుష్టాత్ముడా! ఐశ్వర్యకామంతో తల్లిదండ్రులను, జీవితాన్ని కూడా విడిచివేస్తున్నావు. భీముని చేతిలో దెబ్బ తిన్నప్పుడు నీ తండ్రి మాటలు స్మరిస్తావు!" అంది.

వ్యాసుడు - "ధృతరాష్ట్రా! నీవు కృష్ణుడికి ఇష్టుడవు. అందు చేతనే నీకు జ్ఞాని యైన సంజయుడు దూతగా దొరికాడు. అతడు నిన్ను శ్రేయోమార్గంలో నడుపుతాడు. తనకున్న ధనాలతో సంతృప్తి చెందక కామమూఢు లైన వాళ్లు అనేక విధాలైన పాశాలచే బద్ధులై యమునికి పశువులౌతుంటారు" అన్నాడు.

"సంజయా! హృషీకేశుణ్ణి చేరి ఏ భయమూ లేని ఉత్తమ గతిని పొందడానికి తగిన మార్గం ఏదో నాకు ఉపదేశించు" అన్నాడు ధృతరాష్ట్రుడు.


కీ.శే. ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు

"జనార్దనుని తత్త్వాన్ని తెలుసుకోవా లంటే ఇంద్రియనిగ్రహం ఒక్కటే మార్గం" అని బోధిస్తూ సంజయుడు- "మీ ఇరుపక్షాల వాళ్లకీ శాంతిని బోధించ డానికై అచ్యుతుడు రానున్నాడు" అని చెప్పాడు.

ఆ మాట వినగానే ధృతరాష్ట్రుడు - "నేత్రాలున్న వాళ్లు ఎంత అదృష్టవంతులో కదా! ఆ మహాపురుషుణ్ణి చూడగలుగుతారు. నేను ఆ ఉపేంద్రుణ్ణి శరణుపొందుతున్నాను."

## కౌరవుల సభకు వెళ్లడానికై శ్రీకృష్ణుని నిర్ణయం

యుధిష్ఠిరుడు శ్రీకృష్ణునితో - "ఓ మిత్రవత్సలా! ఇప్పుడు మాకు మళ్లీ నీ సాహాయ్యం కోరవలసిన అవసరం ఏర్పడింది. అవసరమైనప్పుడల్లా నీవు యాదవులను సర్వవిధాలా రక్షిస్తున్నట్లు పాండవులను కూడా ఆదుకోవాలి" అన్నాడు.

"ఏమి కావాలో చెప్పు, నేను తప్పక చేస్తాను" అన్నాడు కృష్ణుడు.

యుధిష్ఠిరు డిలా అన్నాడు- "ధృతరాష్ట్రుడు ఆతని

కుమారులు ఏమి చేయదలచుచున్నారో సంజయుని ద్వారా మీరందరూ తెలిసికొన్నారు కదా. వాళ్లు మా రాజ్యం మాకు ఇవ్వకుండా శాంతి కావాలని కోరుతున్నారు.

మేం సమయం ప్రకారం పదమూడు సంవత్సరాలు వనాలలో తిరిగినా దురాశాపరుడైన ధృతరాష్ట్రుడు మా రాజ్యం మా కివ్వడానికి ఇచ్చిగించడం లేదు. ఐదు గ్రామాలిచ్చినా చాలు అని మీ అందరి ఎదుటనే నేను వాళ్లకి చెప్పాను. అది కూడా వాళ్లు అంగీకరించడం లేదు.

ఉత్తమ వంశంలో పుట్టిన వృద్ధుడు పరధనం మీద లోభంతో ప్రవర్తిస్తే వాని బుద్ధి సరిగా పని చేయదు. బుద్ధి నశిస్తే సిగ్గు నశిస్తుంది. సిగ్గు లేనివాడు ధర్మం వైపు విముఖుడౌతాడు. ధర్మం నశిస్తే లక్ష్మి నశిస్తుంది. లక్ష్మి పోయిన ధనరహితుడు మరణించినవానితో సమానం. (కౌరవుల పరిస్థితి ఇప్పుడు ఈ విధంగా ఉంది.)

మా రాజ్యం శత్రువులు అపహించడం చేత మేం ఎన్ని కష్టాల పాలయ్యామో చూచావు కదా.

మానవుల ప్రవృత్తిలోను, శునకాల ప్రవృత్తిలోనూ నా కేమీ భేదం కనబడడం లేదు. ఒక మాంసం ముద్ద కనబడగానే అక్కడికి చేరిన కుక్కలు తోకలు ఆడిస్తాయి. ఒకటి గుఱ్ఱు మంటే మరొకటి గుఱ్ఱు మంటుంది. అటూ ఇటూ తిరుగుతాయి. దంతలు పైకి చూపిస్తాయి. మొరుగుతాయి. తరువాత యుద్ధం ప్రారంభం అవుతుంది. దేనికి బలం ఉంటే అది జయించి ఆ ఆమిషాన్ని తింటుంది.

**తచ్ఛునామివ సంపాతే పణ్డితైరుపలక్షితమ్,**
**లాఙ్గూలచాలనం క్ష్వేడా ప్రతివాచో వివర్తనమ్,**
**దన్తదర్శన మారావస్తతో యుద్ధం ప్రవర్తతే,**
**తతో యో బలవాన్ కృష్ణ! జిత్వా సోత్తి తదామిషమ్,**
**ఏవమేవ మనుష్యేషు విశేషో నాస్తి కశ్చన.**

(ఉద్యోగపర్వం - 72 70-72)

మా తండ్రవంటివాడు వృద్ధుడూ అయిన ధృతరాష్ట్రుడు మాకు అన్ని విధాలా పూజ్యుడు. ఆయనకు పుత్రప్రేమ బలవత్తరంగా ఉంది. అందుచేత మేం వంగి వంగి ఉన్నా ఆయన ఏమీ పట్టించుకొనడు. ఇట్టి పరిస్థితిలో కృష్ణా! మేం మా ధర్మానికీ, అర్థానికీ భంగం కలగకుండా ఎలా ప్రవర్తించాలో చెప్పగలవాడవు నీ వొక్కడవే!

"అయితే నేను స్వయంగా కౌరవుల సభకు వెళ్లి మీ రెండు పక్షాల మధ్యా శమం నెలకొల్పడానికి ప్రయత్నిస్తాను. నా ప్రయత్నం సఫలం అయితే కౌరవులను, పాండవులను ఇతరులందరినీ మృత్యుపాశం నుండి తప్పించిన పుణ్యం నాకు లభిస్తుంది" అని కృష్ణుడన్నాడు.



అప్పుడు యుధిష్ఠిరుడు - "కృష్ణా! నీవు స్వయంగా అక్కడికి వెళ్లా లని నా అభిప్రాయం కాదు. నువ్వు ఎంత మంచి మాటలు చెప్పినా దుర్యోధనుడు వినడు. ఇప్పుడు క్షత్రియజాతి అంతా వాని చెప్పు చేతలలో ఉంది. నువ్వు వాళ్ల మధ్యలోనికి వెళ్లడం నాకిష్టం లేదు. నీ కేమైనా అయితే - స్వర్గలోకాధిపత్యం లభించినా అది మాకు వద్దు" అన్నాడు.

ఆ మాటలు విని కృష్ణుడు - "మహారాజా! దుర్యోధనుడు ఎలాంటి పాడుబుద్ధి కలవాడో నాకు తెలుసు. మన శాంతి ప్రయత్నం మనం చేస్తే మనలను ఎవరూ తరువాత తప్పు పట్టకుండా ఉంటారు. వాళ్లందరూ కలిసి నాపైకి వచ్చినా నన్నేమీ చేయలేరు. నాకేమైనా ముప్పు తలబెడితే కౌరవులనందరినీ కాల్చివేయగలను. నేను వెళ్లడం వల్ల ప్రయోజనం లేకుండా పోదు. మనం అనుకొన్న పని జరిగితే జరగవచ్చు. అది కాకపోయినా, మనని ఎవరూ తప్పుపట్టడానికి అవకాశం ఉండదు" అన్నాడు.

"సరే అయితే, నీకు నే నేమీ చెప్పవలసినది లేదు. ఎలా చేస్తే యుక్తమో అలా చెయ్యి" అన్నాడు ధర్మరాజు.

"నేను సంజయుడు చెప్పిన మాటలూ విన్నాను. నీ మాటలూ విన్నాను. నీ అభిప్రాయమేమిటో వాళ్ల అభిప్రాయమేమిటో నాకు అంతా తెలుసు. నీ బుద్ధి ధర్మాశ్రితమైతే వాళ్ల బుద్ధి వైరాశ్రితమైనది. ఏమైనా క్షత్రియుని ధర్మం యుద్ధం చేసి దురాత్ములను అణచివేయడమే కాని యాచనావృత్తి క్షత్రియునికి విధింపబడలేదు.

నిండు సభలో ద్రౌపదిని అలా అవమానించినందుకు, మిమ్ములను అలా మోసం చేసినందుకు అక్కడ ఉన్న వాళ్లందరూ ఆనాడు దుర్యోధనాదులను నిందించారు. ఆ నిందావాక్యాలకే వాళ్లు మరణించినట్లు లెక్క, అలాంటి వాళ్లని ఇప్పుడు సంహరించడం చాలా తేలికయైన పని. అతడు మొదలు తెగిపోగా బోటుమీద నిలబడిన చెట్టువంటివాడు.

(సశేషం)



# తిరుమల చరితామృతం

142

(గత సంచిక తరువాయి)

ఏ విశ్వాసంతో భక్తులు హుండీలో కానుకలో వేస్తున్నారో, లేదా రికార్డు పూర్వకంగా నగలు, నగదూ సమర్పిస్తున్నారో, స్వామివారికి ఆభరణాలు తయారుచేయించి ఇస్తున్నారో ఆ విశ్వాసాన్ని దెబ్బతీసేందుకు, ఈ వార్తలు, కథనాలు కారణ మయ్యే పరిస్థితి ఏర్పడినప్పుడు- నిజానిజాలు వెలికితీసే ఒక ప్రక్రియలో నేను కూడా ఒక పాత్ర నిర్వహించాల్సి వచ్చింది.

విస్తృతంగా, లోతుగా ఈ అంశాన్ని అధ్యయనం చేస్తే బయట పడిన విషయాలను తెలుసుకునే హక్కు ప్రతి భక్తుడికీ ఉంది.

◆◆◆

2006లో ఆలయంలో 300 డాలర్లు మాయమయిన సంఘటన బయటపడ్డాక, అందులో 'డాలరు' శేషాద్రి హస్తం ఉన్నదన్న ఆరోపణలు మొదలైనాయి. ఇవి అప్పటికే పదవీవిరమణ చేసి, మళ్లీ ప్రత్యేకాధికారిగా నియమించబడి, ఆలయంలో పనిచేస్తున్న శేషాద్రిని పదవి నుంచి తొలగించాలన్న ఆందోళనకు దారితీశాయి.

ఆలయంలో స్వామివారి చిత్రంతో గల డాలర్ల అమ్మకాలు ఏనాటి నుంచో దేవస్థానంలో జరుగుతున్నాయి. మొదట ఈ డాలర్లను గోవిందరాజ స్వామి ఆలయంలోని టంకశాలలో చేసేవారు. నేను కార్యనిర్వహణాధికారిగా ఉన్నప్పుడు బంగారు నగలు కరిగించడం, వాటిని స్వామివారి నాణాలు (డాలర్లు) గానూ, బంగారు ముద్దలుగానూ చేయడంలో అవకతవకలు జరుగుతున్నాయన్న అనుమానాలు నా దృష్టికి వచ్చి



కీ.శే. పివిఆర్‌కె ప్రసాద్

రిజర్వ్‌బ్యాంక్ వారితో సంప్రదించి, ఒక ఒప్పందం కుదుర్చుకున్నాం. చారిత్రక/ఇతర విశిష్టత లేని రాళ్లనగలు, హుండీలో వచ్చిన ఆభరణాలు రిజర్వ్‌బ్యాంక్‌కు పంపితే, వారే వాటిని కరిగించి, వచ్చిన బంగారానికి సమానంగా స్వామివారి బంగారు డాలర్లు దేవస్థానానికి ఇచ్చేటట్లు, తరుగులు, కరిగింపు, ముద్రణ ఖర్చులను రిజర్వ్‌బ్యాంకు నిబంధనల ప్రకారం దేవస్థానం చెల్లించేటట్లు ఒప్పందం కుదిరింది. స్వచ్ఛమైన ఈ బంగారం డాలర్లకు భక్తుల నుంచి చాలా గిరాకీ ఉండేది... వీటిని దేవాలయం ట్రెజరీలో ఉంచి, ఆలయానికి, ఇతర విక్రయశాలలకు అమ్మకానికి పంపేవారు. అలా ఆలయం లోపల ఒక విక్రయకేంద్రం ఉంది. 'డాలరు శేషాద్రి' అధీనంలో డాలర్ల అమ్మకం జరిగేది. ఎన్నో ఏళ్లు శేషాద్రి ఈ కార్యక్రమం చేసినా, డాలర్లు పోవడం, తరుగు రావడం, అమ్మిన డబ్బు జమ కాకపోవడం వంటి సంఘటనలు ఎప్పుడూ జరగలేదు.

ట్రెజరీ నుండి ఆలయానికి వేల డాలర్లు అమ్మకానికి వస్తాయి. అలా వచ్చిన డాలర్లు పారుపత్తేదారు శేషాద్రి అధీనంలో ఉంటాయి. కొన్ని రోజులకవలసరమైన డాలర్లను శేషాద్రి డాలర్లు అమ్మే కౌంటరు షరాఫ్‌లకు అందజేసి, అలా ఎఇన్న అందజేశాడో పేష్కారు ఆఫీసుకు తెలియజేస్తాడు. తనకు వచ్చిన డాలర్లు షరాపులకిచ్చి, ఆ లెక్క చూపడం వరకే పారుపత్తేదారు

(శేషాద్రి) బాధ్యత. షరాపు డాలర్లు అమ్మి తర్వాత పేష్కారు ఆఫీసులో ఖరీదు జమకట్టి, లెక్కలు చూపాలి... పారుపత్తేదారు నుండి తాను తీసుకున్న డాలర్ల లెక్క చెప్పాల్సిన బాధ్యత షరాఫ్‌ది... ఇది అమలులో ఉన్న విధానం.

2006లో డాలర్లు మాయమయిన కేసు పూర్వాపరాలు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జగన్నాథరావుగారి విచారణా నివేదికలో చాలా విశదంగా ఇవ్వబడ్డాయి. ఆ దర్యాప్తు నివేదిక ప్రకారం- వెంకటాచలపతి అనే షరాఫ్‌కు శేషాద్రి 2006 జూన్ 6 నాడు ఈ డాలర్లు అప్పగించాడు. తర్వాత 2006 జూలై 31న శేషాద్రి పదవీ విరమణ చేసి తన దగ్గర ఉన్న మొత్తం డాలర్లను గురురాజుకు అప్పగించాడు. తర్వాత తనిఖీలలో తేలిన విషయం- షరాపు దగ్గర ఉండాల్సిన డాలర్లలో 300 డాలర్లు తక్కువ పడ్డాయి. 2006 నవంబర్ 5న- అంటే డాలర్లు తీసుకున్న 5 నెలల తర్వాత - షరాపు వెంకటాచలపతి తనకు శేషాద్రి 300 డాలర్లు ఇవ్వలేదని ఫిర్యాదు చేశాడు. అప్పటికే శేషాద్రి పదవీ విరమణ చేసి నాలుగు నెలలయింది. శేషాద్రిని ప్రశ్నిస్తే- తాను డాలర్లు ఇచ్చినట్లున్న రశీదులు, డాలర్లు ముట్టినట్టు వెంకటాచలపతి రాసిచ్చిన రశీదులు చూపించి, ఆ తరుగుకు, తనకేమీ సంబంధం లేదని చెప్పడంతో, కార్యనిర్వహణాధికారి అప్పటి చీఫ్ విజిలెన్స్ అధికారి హరిరావు ఐపీఎస్ ద్వారా విచారణ జరిపించారు. ఆ సమయానికి శేషాద్రి మళ్లీ ఆలయంలో నియమింపబడడంతో అప్పుడే పోయిన డాలర్ల కథ మళ్లీ బయటకు వచ్చింది. శాసనసభలో ప్రశ్నలు రావడం, రాష్ట్ర ప్రభుత్వం సీబీసీఐడీ ద్వారా విచారణకు ఆదేశాలివ్వడం జరిగింది. దేవస్థానం వారి దర్యాప్తులోనూ, సీబీసీఐడీ వారి దర్యాప్తులోనూ వెంకటాచలపతిని దోషిగా నిరూపిస్తూ ఆధారాలు చూపించబడ్డాయి. వెంకటాచలపతి ఇంట్లో కొన్ని డాలర్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకోవడంతో, వెంకటాచలపతి తానే కాజేసినట్లు ఒప్పుకున్నాడు. (ఇవన్నీ జస్టిస్ జగన్నాథరావు విచారణ నివేదికలోని అంశాలు.)



శేషాద్రి నిర్దోషిగా తేలినా ఆలయంలోని అధికారుల వర్గ వైషమ్యాల వలన, ఈ విషయం పెద్ద వివాదాస్పదమై, డిప్యూటీ కార్యనిర్వహణాధికారిలోను, పేష్కారులోను పర్యవేక్షణ లోపం ఉందనీ, అన్ని డాలర్లను శేషాద్రి- వెంకటాచలపతికి ఎందుకిచ్చాడనీ... వీరందరి మీద చర్యలు తీసుకోవాలని ఆందోళన మొదలైంది. వివాదం మీడియాలో చిలికి చిలికి గాలివాన కావడం, ప్రతిరోజూ దీనిపై చర్చలూ, కథనాలూ ప్రసారాలు కావడంతో - డాలర్లే కాదు, అసలు స్వామివారి నగలు, హుండీలో వేసిన ఆభరణాల భద్రతపై కూడా భక్తులకు అనుమానాలు కలిగేటట్లు వ్యాఖ్యానాలు రాసాగాయి. దాంతో ప్రభుత్వం- ఆలయంలో డాలర్లే కాక, ఆభరణాలు, ఇతర హుండీ కానుకలు భద్రమేనా, ఆచరణలో ఉన్న పరిపాలనా విధానాలు సక్రమంగా ఉన్నాయా లేదా అన్న విషయం క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక ఇవ్వాలని జస్టిస్ జగన్నాథరావు (విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి)ని విచారణా సంఘంగా నియమించడం జరిగింది.

ఆయన దాదాపు సంవత్సరం పైగా అన్ని విషయాలూ పరిశీలించి, సమగ్ర నివేదిక అందజేశారు. ఇది జరుగుతున్న సమయంలో ఇంకొక సంఘటన సంచలనం సృష్టించింది. తిరుమల తిరుపతి దేవాలయాల యాజమాన్యంలో ఉన్న తిరుపతి లోని శ్రీ కోదండరామస్వామి వారి ఆలయంలోని ప్రధాన అర్చకుడు వెంకటరమణ దీక్షితులు స్వామివారి 12 నగలు - ఒక్కొక్కటీ 100 గ్రాముల బరువైనవి - 8 లక్షల రూపాయలకు అంగడిలో తాకట్టు పెట్టిన విషయం సాంవత్సరిక తనిఖీలలో బయటపడింది. ఇది పెద్ద సంచలనానికి దారితీసి, మీడియాలో చాలా తీవ్రమైన చర్చలు జరిగి, ఆ చర్చలలో డాలరు శేషాద్రి విషయం కూడా చర్చకు వచ్చి, అతనిమీద, ఇతర పై అధికారులు వాసుదేవన్ (పేష్కారు), ప్రభాకరరెడ్డి (డి. ఈవో)ల మీద చర్య తీసుకోవాలని కొన్ని వర్గాల నుంచి ఒత్తిడి వచ్చింది. కానీ అప్పటికే న్యాయమూర్తి జగన్నాథరావు తమ నివేదిక సమర్పించడం జరిగిపోయింది. ఆలయంలో వర్గ తగాదాల వల్ల ఆ రిపోర్టు బహిర్గతం కాలేదు... ఈ వర్గ వైషమ్యాలు ఎంతవరకూ వెళ్లాయంటే- అదివరకే ఉన్న చీఫ్ విజిలెన్స్ అధికారి రిపోర్టు, సీబీసీఐడీ రిపోర్టు, న్యాయమూర్తి జగన్నాథరావు రిపోర్టులను పక్కన పెట్టి, ఇప్పటి ముఖ్య విజిలెన్సు అధికారితో హడావుడిగా రెండు రోజుల్లో ఇంకొక రిపోర్టు చేయించి, వీరిని దోషులుగా చూపించి, పదవుల నుంచి తాత్కాలికంగా కార్యనిర్వహణాధికారి తొలగించడం, దానికి దేవస్థాన ఉద్యోగ సంఘాలు నిరసనలు, సమ్మెలు జరపటం, రెండు రోజులలో పాలకమండలి ప్రత్యేక సమావేశంలో కార్యనిర్వహణాధికారి చేసిన సస్పెన్షన్ ఉత్తర్వులను ఉపసంహరించడం జరిగాయి. (సశేషం)

(తిరుమల చరితామృతం పుస్తకం నుంచి)

అయోధ్య కాండ




'ఆంధ్ర వాల్మీకి'

**వాసుదాసస్వామి**

(వావిలికొలను సుబ్బారావు)

**విరచిత**

# 'మందర-మకరందం'




### సర్గ-113

**(గత సంచిక తరువాయి)**

పుణ్యాత్మా! నీకిలాంటి నడవడి గొప్పది. స్వభావసిద్ధం. నీలాంటి కొడుకు పుట్టినందువల్ల మీ తండ్రి దశరథుడు చని పోయినా జీవించినవాడితో సమానం" అని చెప్పగా, భరతుడు ఆ మునికి నమస్కారం చేసి బయల్దేరాడు. సైన్యం వెంట వస్తుంటే, భరతుడు అయోధ్యకు పోతూ, యమునానదిని దాటి, సంతోషంగా గంగానదిని చూసి, అదీ దాటి, శృంగిబేరపురంలో ప్రవేశించి, ప్రయాణమై పోయి, తండ్రి-అన్న లేని అయోధ్యను చూశాడు. భరతుడు సారథితో, "సారథీ! అయోధ్య వున్న పరిస్థితి చూడు. అందం చెడి, సంతోషహీనమై, దుఃఖంతో కూడి, నిస్సారమై ఎలా వుందో చూడు" అంటాడు.

◆◆◆

### సర్గ-114

**ఆనందహీనమైన అయోధ్యాపురి ప్రవేశించిన భరతుడు**

సీతారామలక్ష్మణులు లేని అయోధ్యలో, అదలించే వారు లేకుండా పిల్లులు, గూబలు విస్తారంగా తిరుగుతున్న దానిలాగా వున్న అయోధ్యలో, బాధతో కూడుకున్న అయోధ్యలో, కాంతి హీనమైన అయోధ్యలో, చిమ్మచీకట్లు కమ్ముకున్నట్లుగా వున్నా అయోధ్యలో, భరతుడు దుఃఖాక్రాంతమైన మనసుతో ప్రవేశం చాడు. భరతుడు రథం మీదే వుండి, దిగకుండా, సారథిని చూసి, "అయ్యో! సారథీ! శ్రీరామచంద్రమూర్తి ఈ వూళ్లో వున్నప్పటిలాగా శుభకరమైన పాటలు, మంగళ వాద్యాలు చెవుల వినబడడం లేదు. ప్రసిద్ధమైన చందనం వాసనతో, పూలదండల వాసనతో నిండిన మనో హరమైన గాలి వీయడం లేదు. శ్రీరామ చంద్రమూర్తి నగరంలో లేకపోవడం వల్లే కదా! పల్లకీల మోతలు కాని, ఏనుగుల ఘీంకారాలు కాని, గుర్రాల సకిలింపులు కాని, రథాల చప్పుడులు కాని వినపడడం లేదు. సుఖం అనుభవించాల్సిన వారు కూడా దుఃఖంగా కనపడుతున్నారు. ఎవరూ ఆభరణాలు ధరించలేదు. విలాసంగా తిరగడం లేదు. ఈ పూరి కాంతి మా అన్నతోనే పోయింది. ఇప్పుడీ అయోధ్య జడివానతో కమ్ముకున్న శుక్ల పక్ష రాత్రిలాగా వుంది. సఖుడా! ఈ వూరి ప్రజల సంతోషం శ్రీరామచంద్రమూర్తితోనే పోయింది. ఆయన వస్తేనే కాని మళ్లీ తిరిగిరాదు. కాబట్టి ఆయనొచ్చే వరకు వీరి స్థితి ఇంతే!" అని అంటూ దుఃఖంతో రాజు ఇంట్లోకి ప్రవేశించాడు. సింహంలేని గుహలోకి నిర్భయంగా పోయినట్లు అందులోకి పోయిన భరతుడికి ఆ ఇల్లు సూర్యుడు లేని ఆకాశంలాగా కనిపించింది. అది చూసి బాధ పడ్డాడు భరతుడు.



అనువక్త-వాచవి
వనం జ్వాలా నరసింహారావు

◆◆◆

### సర్గ-115

**నందిగ్రామం చేరిన భరతుడు**

వూళ్లోకి తన వెంట వచ్చినవారందరినీ ఎవరెవరి ఇళ్లకు వాళ్లను పొమ్మని చెప్పాడు భరతుడు. అప్పుడు, వ్రతదీక్షలో వున్న భరతుడు వసిష్ఠుడితో, "నేను ఇక్కడ వుంటే శోకంతో బతకలేను. ఏది చూసినా నాకు తండ్రి, అన్న జ్ఞాపకానికి వస్తుంటారు. వారనుభవించాల్సిన వాటిని వారు లేకుండా నేనెలా అనుభవిస్తా? ఇక్కడ నాకు సుఖం లేదు. నందిగ్రామం పల్లెటూరు. అక్కడికి పోయి వుంటా. మీరంతా నాకు ఆజ్ఞ ఇవ్వండి. తండ్రి, రాజైన దశరథుడు స్వర్గానికి పోయాడు. గురువైన శ్రీరామచంద్రుడు అడవులకు పోయాడు. నేను ఆ నందిగ్రామంలోనే శ్రీరాముడి రాకకొరకు వేచి వుంటా. మళ్లీ శ్రీరామచంద్రుడితో తిరిగి వస్తా. రాష్ట్రానికంతా శ్రీరాముడే ప్రభువు కాని నేను కాను. కాబట్టి నేనెక్కడ వున్నా ఒకటే. రాజైన వాడే రాజధానిలో వుండాలి" అన్నాడు. భరతుడి మాటలను సుమంత్రుడు, ఇతర మంత్రులు, గురువైన వసిష్ఠుడు శ్లాఘించారు. ఆయన అలా చేస్తానంటే తమకు సమ్మతమే అన్నారు. మంత్రులంతా అలా తనకు అనుకూలంగా చెప్పడంతో శీఘ్రంగా రథాన్ని సిద్ధం చేయమని సారథిని ఆజ్ఞాపించాడు భరతుడు. తల్లులందరికీ నమస్కారం చేశాడు. శత్రుఘ్నుడు తోడురాగా, గురువు, మంత్రులు ముందు పోతుంటే, తూర్పు దిక్కుగా ప్రయాణమై పోయాడు. వచ్చిన ఒక్క పూట కూడా భోజనానికి అయోధ్యలో వుండలేదు. సేనలు, మంత్రులు వెంటరాగా, పాదుకలను రెంటినీ తలమీద పెట్టుకుని భరతుడు నందిగ్రామం చేరాడు.

అక్కడ వసిష్ఠుడితో ఇలా అన్నాడు: "మునీంద్రా! రాజ్యాన్ని తాను వచ్చేవరకు నన్ను పాలించమని చెప్పి, తనకు మారుగా తన స్థానంలో వుండడానికి ఈ పాదుకలను ఇచ్చాడు శ్రీరాముడు. కాబట్టి ప్రజల యోగక్షేమాలను ఇక నుంచి ఇవే విచారిస్తాయి". అ తరువాత మంత్రులతో, "మ అన్నగారి పాదాలకు ఛత్రం పట్టండి. వింజామరలు వీచండి. ఈ చరణాలే ఇకమీద భూమిని రక్షించే భారాన్ని వహిస్తాయి. నామీద ఎంతో దయతో మా అన్న వీటినిచ్చాడు. మళ్లీ శ్రీరామచంద్రమూర్తి తిరిగి వచ్చేవరకు భక్తితో వీటిని కాపాడుతూ వుంటా. ఆయన రాగానే రాజ్యంతో సహా వీటిని ఆయనకు సమర్పించి ఆయన్ను కొలుస్తా. అలా చేసి అపకీర్తిని పోగొట్టుకుంటా. మా అన్న రాజ్యాన్ని ఆయనకే ఇవ్వడం అందరికీ సంతోషం కలిగిస్తుంది. రాజ్యం చేయడం కంటే ఇదే నాకు నాలుగింతలు మేలు చేస్తుంది" అంటాడు.

ఇలా మునివేషం ధరించిన భరతుడు పావుకోళ్లు రెంటినీ బంగారు సింహాసనం మీద వుంచి సంతోషంతో వాటికి పట్టాభిషేకం చేసి, ప్రతిరోజూ ఎవరైనా తెచ్చి ఇచ్చిన



కానుకలుంటే వాటిని ముందుగా పాదుకలకు-చరణాలకు సమర్పించి, ఆ నివేదితాన్ని తరువాత తానూ గ్రహిస్తూ రాజ్యాన్ని చేశాడు.

◆◆◆

## సర్గ-116

### చిత్రకూటం వదిలిపోయిన ఋషులు

చిత్రకూటంలో శ్రీరామచంద్రమూర్తి తమ్ముడు లక్ష్మణుడితో వుంటూ, భరతుడు వచ్చిపోయిన తరువాత, ఆ పర్వతం మీద వున్న మునులు తనను చూసి తమలో తాము గుస-గుస లాడుకుంటూ ఎదో చెప్పబోయి ఆగిపోవడం గమనించాడు శ్రీరాముడు. వారిని చూసి వారేం చెప్పదలచుకున్నారో తెల్సుకుందామని ఆ మునులలో పెద్దవాడైన ఒకరిని చూసి చేతులు జోడించి, నమస్కారం చేసి, శ్రీరామచంద్రమూర్తి ఇలా అన్నాడు: "మునివర్యా! ఇదివరకు లాగా నేనిప్పుడు నడచుకోవడం లేదా? నా తమ్ముడేమైనా ధర్మం తప్పాడా? లేక సీత నా సేవ చేస్తూ, పొరపాటున మీ సేవలను పతివ్రతలకు తగనట్లు ప్రవర్తించిందా? ఎందుకిలా ఋషీశ్వరులు తత్తరపడుతున్నారు?".

### తమ కష్టాలను శ్రీరాముడితో చెప్పిన వృద్ధఋషి

శ్రీరాముడిలా అడగగానే వయసులో పెద్దవాడైన ఆ ముని వణకుతూ ఇలా చెప్పాడు. "నాయనా! రామచంద్రా! స్వభావంగా గొప్ప శుభాచారంకల సీత తపస్వుల విషయంలో వక్ర మార్గాన ఎలా పోతుంది? ఆమెలో ఏ లోపం లేదు. నిన్ను ఉద్దేశించే ఈ మునులు ఆడగాలనుకుంటున్నారు. వారి తత్తరపాటుకు నువ్వే కారణం. నువ్వేం చేశానంటావా? రాక్షసులవల్ల బాధపడ్తూ ఇలా గుస-గుసలాడుకుంటున్నారు. రాక్షసరాజైన రావణాసురుడికి ఖరుడు అనే ఒక తమ్ముడున్నాడు. వాడు దయాహీనుడు. మనుష్యులను తింటాడు. పొగరుబోతు... పాపాత్ముడు... యుద్ధంలో ఆరితేరినవాడు. (సశేషం)

# అభినవ శంకర విజయం




(గత సంచిక తరువాయి)

చిరంజీవి శివస్వామికి మూడవ యేడు వచ్చింది. ఆ సమయంలో శ్రీశ్రీశ్రీ వృద్ధనృసింహ భారతీ స్వామివారు తమ ధర్మ విజయ యాత్రలో భాగంగా మైసూరు వచ్చారు. నగరమంతా అందంగా అలంకరించారు ప్రజలు. పౌరులందరూ స్వామివారిపై పూలవానలు కురిపించారు.

మైసూరు మహారాజు భక్తిశ్రద్ధలతో స్వామివారికి అధికారికంగా స్వాగత సత్కారాలు నిర్వహించారు. పల్లకిలోనుంచి దిగుతున్న స్వామివారి పాదపద్మాల దర్శనమే జన్మసార్థక్యమని జనం తండోపతండాలుగా వచ్చారు. మహారాజు స్వయంగా వచ్చి, స్వామివారి పాద ప్రక్షాళనంచేసి ఆ పవిత్రజలాన్ని తమ శిరసున చల్లుకున్నారు. ఈ సంగతి చెప్తూ, ‘‘రాజయోగి చరించు తీర్థంబుగాన’’ అని చక్కని ముక్తాయింపు నిచ్చారు లలితాదిత్య కవి.

నగరంలో అడుగుపెట్టిన వెంటనే స్వామివారు రామశాస్త్రిగారి పెద్ద కొడుకుని రమ్మని కబురు పంపించారు.

వెంటనే నరసింహ శాస్త్రిగారు(రామశాస్త్రిగారి జ్యేష్ఠ పుత్రులు) తమ్ముడితో కలసి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారు చి. శివస్వామిపై వాత్సల్యపూరితమైన దృక్కులను ప్రసరింప చేశారు.

స్వామివారిని చూస్తూనే భక్తిపారవశ్యంతో చి. శివస్వామి సాష్టాంగ నమస్కారం చేశారు. పూర్వజన్మ సంస్కారఫలంగా ఆనాడు నాటిన జ్ఞాన బీజాలు ఈనాడు మొలకెత్తినట్లుగా అమృతం చిలకరించే స్వామివారి చూపు సోకి చి.శివస్వామి తన్మయు లయ్యారు.

**“తొల్లిటి బాములందు మదితోటను నాటిన జ్ఞానబీజముల్**
**జల్లన మొల్కలెత్త సుధ జల్లుల౯ జల్లినయట్లు స్వామిచూ**
**పల్లన సోకినన్ వివశుడై వడు గానతకాయుడై క్షణో**
**త్పల్లవితాంతరంగుడయి పాద నమస్కృతి నాచరించెడిన్.”**

అప్పుడు ఆ బాలునివంక ప్రేమతో చూస్తూ... చిరునవ్వు నవ్వుతూ ...

‘‘నీకేమి కావా’’లని స్వామివారు అడిగారు.

అప్పుడు చి. శివస్వామి పలికిన మాట అత్యాశ్చర్యకరమైనది.

‘‘ఇదే దానమివ్వతగిన సమయం. మీరే దయగల దాతలు. నేను దానం స్వీకరించ తగినవాడను. మీ పాద పద్మాలయందు స్థిరమైన భక్తిని ప్రసాదించి, కృతార్థుణ్ణి చేయండి’’ అని చి. శివస్వామి కోరారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని లలితాదిత్య కవి ఆదిశంకరుల శివ భుజంగ ప్రయాత స్తోత్రం లోని


మల్లాప్రగడ
శ్రీమన్నారాయణ మూర్తి

**“అయం దాన కాల స్త్వహం దానపాత్రం భవానేవ దాతా త్వదన్యం న యాచే ।**
**భవద్భక్తి మేవ స్థిరాం దేహి మహ్యం**
**కృపాశీల శంభో! కృతార్థోస్మి తస్మాత్॥”**

అనే శ్లోకానికి

**“ఇదె దానం బొనరింప కాల మిదిగో! యేన్ దానపాత్రంబ, నీ**
**వె దయార్ద్రండగు దాత వీశ! యితరున్ వేడంగబోవన్, భవ**
**త్పదపద్మ స్థిరభక్తి నీగదె కృతార్థత్వంబు చేకూర్ప న**
**య్యదియే చా లను శాంకరోక్తి వటు వత్యాశ్చర్యతం బేర్కొనెన్”**

అనే పద్యరూపం కల్పించారు.

అంతటితో ఆగక, చక్కని అర్థాంతరన్యాసలో ఆ సన్నివేశాన్ని రసరమ్యంగా వ్యాఖ్యానించారు లలితాదిత్య కవి.

‘‘వస్త్రంలో దాచి ఉంచిన కర్పూరం నిప్పుసోకిన వెంటనే సువాసనలు వెదజల్లుతూ వెలుగుతుంది కదా! దాన్ని ఎవరు అడ్డుకోగలరు? ఆనకట్టకు రంధ్రంపడితే, నదీ ప్రవాహ వేగాన్ని అడ్డుకోవటం సాధ్యమా? శిశిరంలో మోడువారిన చెట్లన్నీ వసంతం ప్రవేశించగానే చెట్లన్నీ చిగురించి, పుష్పించటాన్ని ఎవరైనా అడ్డుకోగలరా? పరుసవేదిని సమీపించగా లోహం బంగారంగా మారటం ఎవరు ఆపగలరు?

సద్గురువు సన్నిధిలో సాధకుని పూర్వపుణ్య సంస్కారం జాగృతం కావటం అత్యంత సహజం. దాన్ని ఎవరాపగలరు? తరించటానికి ప్రతిబంధకంగా ఉన్న సకల పాపాల అడవులనూ దగ్ధంచేసే దావాగ్ని కదా! గురుదేవుల చూపు! ‘‘ - ఈ భావాన్ని

అద్భుతమైన సీస పద్యంగా మలచి, అందించారు లలితాదిత్య కవి.

పద్యం చిత్తగించండి:

**"చీర నిగూఢ కర్పూరంబునకు వహ్ని యగుపడ సౌగంధ్య మడ్డగలరె?**
**ఆనకట్టను రంధ్ర మలవడఁ బొంగెడి యాపగావేగంబు నడ్డగలరె?**
**శిశిరార్తి యడగి హెచ్చిన వసంతంబు రానలరుల చివురుల నడ్డగలరె?**
**పరుసవేదికి దవ్వుఁ దరగ తాకిన రాతి హాటక భావంబు నడ్డగలరె?**
**సద్గురుని చెంతఁజేరిన సాధకునకు**
**పుణ్య సంస్కార నివహ ప్ర**
**బోధ మడ్డ శక్యమే? ప్రతిబంధక సకల**
**దురిత వికట వన దావకీల దేశికుని దృష్టి"**

(సశేషం)

---

# ధర్మజిజ్ఞాస



పి. భాస్కరయోగి

(గత సంచిక తరువాయి)

**15. వివాహం** : మానవుల జీవితాన్ని కళ్యాణం చేయడం కొరకు, క్రమశిక్షణగా ఉంచడం కొరకు ఈ కార్యక్రమం మన వ్యవస్థలో ఏర్పడింది. సత్సంతానం, సక్రమ సంతానం జాతి పురోభివృద్ధికి ముఖ్యమని గ్రహించిన ఋషులు. ఈ కార్యక్రమం ఏర్పాటుచేశారు. మంత్రాలతో మమతల్ని ముడివేసే కార్యక్రమం. ప్రపంచంలోనే ఏ జాతిలో లేని గొప్ప సంస్కారం ఇది. గృహస్థాశ్రమ వ్యవస్థను సుసంపన్నం చేసుకోవాలంటే ఈ సంస్కృతిని మనం ఇలాగే కొనసాగించాలి.

**16. అంత్యేష్టి** : మనిషి మరణానంతరం చేసే సంస్కారం అంత్యేష్టి. జీవుడు బ్రహ్మరంధ్రం ద్వారా తల్లి గర్భంలో ప్రవేశించింది మొదలు తుది శ్వాస విడిచేంత వరకు చేసిన కార్యక్రమాలే ఈ సంస్కారంలో బయల్పడతాయి. అంత్యేష్టి విధానం ఒక్కో కులంలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా చేస్తారు.

నిష్క్రమణము, అక్షరాభ్యాసము, డోలాహరణం, కర్ణవేధ కూడా కొందరు ధర్మశాస్త్రకారులు చెప్పినప్పటికీ షోడశ సంస్కారాల్లో ఇవే ప్రసిద్ధమైనవిగా చాలామంది పండితుల అభిప్రాయం. ఈ రోజుల్లో అక్షరాభ్యాసం చాలా మంది తప్పక ఆచరిస్తున్నారు. విద్యను సరస్వతీ రూపంలో ఆరాధించే సంస్కారం మనది. ఈ సంస్కారాన్ని అక్షరాభ్యాస విధానం గూర్చి ప్రముఖ పండితులు దేవరకొండ శేషగిరిరావు తమ 'భారతీయ సంస్కారములు' అన్న గ్రంథంలో చాలా బాగా వివరించారు.

అయితే చాలా మంది స్మృతికారుల్లో ఈ షోడశ సంస్కారాల సంఖ్యపై భేదాభిప్రాయాలున్నాయి. కొందరు కొన్నింటిని విశేషంగా ప్రతిపాదించగా, మరికొందరు కొన్నింటిని వదిలిపెట్టడం జరిగింది. ఇంకా చాలా సంస్కారాలు మానవులకు అవసరం కాబట్టి ఇంకొన్ని సంస్కార విశేషాలు ప్రతిపాదించారు. సర్వసాధారణంగా కనిపించేవి చాలా ఉన్నప్పటికీ ధర్మనిర్ణయం చేయగల మహర్షుల సంఖ్యనే మనం ప్రామాణికంగా గ్రహించాలి.

## 253. రుద్రాక్ష గొప్పతనం వివరించండి?

మానవుడు (జీవుడు) 'త్రయిత వాదం'లో ముఖ్యుడు. జీవుని మనుగడయే 'ప్రపంచం'. జీవుని ఆనందం-ఆరోగ్యం, ఆరోగ్యం-ఔషధ ప్రాప్తం, ప్రకృతి ఔషధ మూలం, ఆ ఔషధాలు వృక్షాల నుండి లభిస్తాయి. వృక్షాలకు పండ్లు, కాయలు, పూవులు, ఆకులు ఏవైనా కావచ్చు.

ఔషధాలు అనగా రుద్రాక్షలుగాని, గుండస్నానాలు కూడా కావచ్చు.

**రుద్రాక్షోత్పత్తి (దేవీ భాగవతము) :**

పూర్వం త్రిపురాసురుని సంహారానికై శివుడు 'మనోహర అఘోరము' అనే అస్త్రాన్ని రూపొందించడానికి తపస్సు చేశాడు. ఆ అస్త్రం ఘోరమైన అగ్నిరూపంతో కూడింది. అది సర్వదేవతా శక్తి కలిగింది, దేవతల రక్షణ కొరకై త్రిపురాసుర సంహారము కొరకు ధ్యానిస్తూ మూసిన కన్నులను వేయి దివ్య సంవత్సరాలు తర్వాత తెరవగా అందుండి అశ్రు బిందువులు కిందరాలాయి, ఆ బిందువులే అంకురించి మహా రుద్రాక్ష వృక్షాలుగా మొలకెత్తాయి- అని పురాణ కథ.

రుద్రాక్షలు నాలుగు రకాలు- 1. రుద్రాక్ష - గోళాకారము. 2. భద్రాక్ష - కోలగా, బల్లపరుపుగా, బాదంకాయలా ఉంటుంది. 3. రౌద్రాక్ష - పొడవుగా కోలగా ఉంటుంది. 4. సాద్రాక్ష - శుభాక్ష- ఇవి చిన్నసైజువి.

నేడు చాలా మంది 'సరైనవి కాని' రుద్రాక్షలు విక్రయిస్తున్నారు. నేపాల్ దేశం రుద్రాక్షలకు ప్రసిద్ధి. రుద్రాక్షలు భారతదేశంలో కాశి, మలేసియా, శ్రీలంక, ఆస్ట్రేలియా ఉత్తర భాగం, ఇండోనేసియా, పసిఫిక్ మహా సముద్ర ద్వీపాలు. ఇంకా చాలా దేశాలకు నేపాల్ నుండే దిగుమతి అవుతాయి.

(సశేషం)

# అంబాష్టకమ్





తాడేపల్లి పతంజలి

(గత సంచిక తరువాయి)

**శ్లో॥ న్యంకాకరే వపుషి కంకాళ రక్త పుషి కంకాది పక్షి విషయే**
**త్వం కామనా మయసి కిం కారణం హృదయ! పంకారి మే హి గిరిజాం ।**
**శంకాశిలా నిశిత టంకాయమాన పద సంకాశమాన సుమనో**
**ఝుంకారి భృంగతతి మంకా నుపేత శశి సంకాశ వక్త్ర కమలాం ॥ 7**

**పద విభాగము:** హృదయ!, ని+అంక+ఆకరే (న్యంకాకరే), వపుషి, కంకాళ, రక్త, పుషి, కంక+ఆది+పక్షి (కంకాదిపక్షి), విషయే, త్వం, కామనామ్, అయసి, కిం, కారణమ్, పంక+ అరిమ్ (పంకారిమ్), ఏహి, గిరిజాం, శంకా+శిలా (శంకాశిలా), నిశిత, టంకాయమాన, పద, సంకాశమాన, సుమనో ఝుంకారి, భృంగతతిమ్, అంక+అనుపేత (అంక+అనుపేత), శశి, సంకాశ, వక్త్రకమలాం (వక్త్ర + కమలాం).

**అన్వయము:** హృదయ!, న్యంకాకరే, కంకాళ రక్త పుషి, కంకాదిపక్షి విషయే వపుషి, త్వం కిం కారణం కామనాం అయసి? పంకారిం, శంకాశిలా నిశిత టంకాయమాన పద, సంకాశమాన సుమనో ఝుంకారి భృంగతతిం, అంక అనుపేత శశిసంకాశ వక్త్రకమలాం గిరిజాం ఏహి.

**ప్రతి పదార్థము:** హృదయ! = ఓ హృదయమా!, ని+అంక+ఆకరే = అనేక నిందలకూ, కళంకాలకూ నిలయమైనదీ, కంకాళ = అస్థిపంజరాన్నీ, రక్త = రక్తాన్నీ, పుషి = పోషించేదీ, కంక+ఆది+పక్షి = రాపులుగుల వంటి అనేక పక్షులకు, విషయే = ఆధారమైందీ, అయిన, వపుషి = శరీర విషయంలో, త్వం = నీవు, కామనాం = కోరికను, అయసి = పొందుతున్నావు, కిం కారణం = కారణం ఏమిటి?, పంక+అరిం = పాపాలకు శత్రువైనదీ, శంకా-శిలా = అనుమానాలనే రాళ్లకు, నిశిత = కరుకైన, టంకాయమాన = ఉలుల వంటివైన, పద = పాదాల మీద, సంకాశమాన = బాగా ప్రకాశిస్తున్న, సుమనో = దేవతలనే, ఝుంకారి = రొద చేస్తున్న, భృంగ తతిం = తుమ్మెదల సమూహం కలదీ, అంక = కళంకంతో, అనుపేత = కూడుకొనని, శశిసంకాశ = చంద్రుడివంటి, వక్త్రకమలాం = ముఖ పద్మం కల, గిరిజాం = పార్వతీ దేవిని, ఏహి = పొందవలసింది.

**తాత్పర్యము:** ఓ మనసా! అనేక నిందలకు, కళంకాలకు నిలయమైనది, అస్థిపంజరాన్ని, రక్తాన్ని పోషించేది, రాపులుగుల వంటి పక్షులకు ఆధారమైనది అయిన ఈ శరీర విషయంలో నీవు ఎందుకు కోరికను పొందుతున్నావు? పాపాలకు శత్రువైనదీ, అనుమానాలనే రాళ్లకు కరుకైన ఉలుల వంటి పాదాలు కలదీ, ఆ పాదాలపై ప్రకాశిస్తున్న దేవతలనే రొద చేస్తున్న తుమ్మెదల సమూహం కలదీ, కళంకరహితమైన చంద్రుడి వంటి ముఖపద్మం కలది అయిన పార్వతీదేవిని ఆశ్రయించు.

**విశేషములు:** ఈ శ్లోకంలో కవి తన మనస్సును ఉద్దేశించి, క్షణికమైన శరీర సౌఖ్యాల పట్ల ఆకర్షితుడవకుండా, శాశ్వతమైన ఆనందాన్ని ప్రసాదించే పార్వతీదేవిని ఆశ్రయించమని ఉపదేశిస్తున్నాడు.

◆ శరీర నిరసన: 'న్యంకాకరే వపుషి కంకాళ రక్త పుషి కంకాది పక్షి విషయే' అనే వాక్యం శరీరానికి ఉన్న అనిత్యత్వాన్ని, అశాశ్వతత్వాన్ని, చివరికి అది పక్షుల ఆహారంగా మారుతుందని వర్ణించడం ద్వారా ప్రపంచ భోగాలపై విరక్తిని కలిగించడంలో కవి ఉద్దేశం స్పష్టమవుతుంది.

◆ పార్వతీదేవి మహిమలు: పార్వతీదేవిని 'పంకారిమ్' (పాపాలకు శత్రువు) అని వర్ణించడం ద్వారా ఆమె పాపాలను హరించివేసే శక్తిని సూచిస్తుంది. 'శంకాశిలా నిశిత టంకాయమాన పద' అనే రూపకం, అనుమానాలనే రాళ్లను

ఆమె పాదాలు ఉలి వలె ఛేదిస్తాయని, భక్తుల సందేహాలను నివృత్తి చేస్తుందని తెలుపుతుంది.

◆ దేవతల సేవ: 'సంకాశమాన సుమనో ఝంకారి భృంగతతిమ్' అనే వర్ణన, ఆమె పాదాలపై వాలిన దేవతల సమూహం తుమ్మెదల గుంపు వలె రొద చేస్తూ ఆమెను స్తుతిస్తున్నారని, ఆమె అత్యున్నత స్థానాన్ని తెలియజేస్తుంది.

◆ ముఖ సౌందర్యం: 'అంకానుపేత శశి సంకాశ వక్త్ర కమలాం' అని వర్ణించడం ద్వారా ఆమె ముఖం కళంకం లేని చంద్రుడి వలె ప్రకాశవంతంగా ఉందని, అందంగా ఉందని తెలియజేస్తుంది. చంద్రునితో పోల్చడం సాధారణం, కానీ 'అంక అనుపేత' అని వర్ణం కలుపుతూ ఆ పోలికను మరింత సుందరంగా, అద్భుతంగా మార్చింది.



◆ భక్తి మార్గ ఉపదేశం:మొత్తంగా, ఈ శ్లోకం భక్తుడి మనస్సును అశాశ్వతమైన లోక విషయాల నుండి మళ్లించి, శాశ్వతానందాన్ని, ముక్తిని ప్రసాదించే దైవం (పార్వతీదేవి) పట్ల భక్తిని పెంపొందించుకోవాలని ప్రబోధిస్తుంది.

**శ్లో॥ జంభారి కుంభి పృథు కుంభాపహాసి కుచ సంభావ్య హార లతికా**
**రంభా కరీంద్ర కర దంభాపహోరుగతి డింభానురంజిత పదా ।**
**శంభా వుదార పరిరంభాంకుర త్పులక దంభానురాగ పిశునా**
**శం భాసురాభరణ గుంఫా సదా దిశతు శుంభాసుర ప్రహరణా ॥ 8**

**పద విభాగము:** జంభారి, కుంభి, పృథు, కుంభాపహాసి (కుంభ + అపహాసి), కుచ, సంభావ్య, హారలతికా, రంభా, కరీంద్ర, కర, దంభాపహ (దంభ + అపహ), ఊరుగతి (ఊరు + గతి), డింభానురంజిత (డింభా + అనురంజిత), పదా, శంభౌ, ఉదార, పరిరంభా (పరిరంభ + అంకురత్), అంకురత్పులక (అంకురత్ + పులక), దంభానురాగ (దంభ + అనురాగ), పిశునా, శం, భాసుర, ఆభరణ, గుంఫా, సదా, దిశతు, శుంభాసుర, ప్రహరణా.

**అన్వయము:** జంభారికుంభి పృథుకుంభాపహాసి కుచ సంభావ్య హారలతికా, రంభా కరీంద్ర కర దంభాపహోరుగతి, డింభానురంజిత పదా, శంభౌ ఉదార పరిరంభాంకురత్పులక దంభానురాగ పిశునా, భాసురాభరణ గుంఫా, శుంభాసుర ప్రహరణా, సదా శం దిశతు.

**ప్రతి పదార్థము:** జంభారి = జంభాసురుని సంహరించిన ఇంద్రుడి, కుంభి = ఏనుగైన ఐరావతం యొక్క, పృథు = మిక్కిలి గొప్పవైన, కుంభ = కుంభ స్థలాల్ని, అపహాసి = అపహసిస్తున్న, కుచ = స్తనాల మీద, సంభావ్య = మిక్కిలిగా అందగించే, హార లతికా = ముత్యాలహారం కలది, రంభా = అరటి బోదెల యొక్క, కరీంద్ర కర = శ్రేష్ఠమైన ఏనుగు తొండం యొక్క, దంభ = గర్వాన్ని, అపహ = పోగొట్టే, ఊరు = తొడలు కలిగి, గతి = నడక చేత, డింభ = పిల్లలకు వలె, అనురంజిత = ఎర్రబడిన, పదా = పాదాలు కలది, శంభౌ = శివుని తోడి, ఉదార = గాఢమైన, పరిరంభా = ఆలింగనం వల్ల, అంకురత్ = మొసులెత్తుతున్న, పులక = గగుర్పాటు, దంభ = అధికమైన, అనురాగ = ప్రేమకు, పిశునా = సూచన అయినది, భాసుర = ప్రకాశిస్తున్న, ఆభరణ = సొమ్ములు, గుంఫా = కూర్పు గలది, శుంభాసుర = శుంభుడనే రాక్షసుడిని, ప్రహరణా = శిక్షించినది అయిన పార్వతీదేవి, (నాకు), శం = శుభాన్ని, సదా = ఎల్లప్పుడు, దిశతు = ఇచ్చుగాక!

**తాత్పర్యము:** జంభాసురుని సంహరించిన ఇంద్రుడి ఐరావతం యొక్క గొప్ప కుంభ స్థలాలను సైతం అపహసించే స్తనాలపై అందమైన ముత్యాల హారం కలది, అరటి బోదెల, శ్రేష్ఠమైన ఏనుగు తొండాల గర్వాన్ని సైతం తొలగించే అందమైన తొడలు, నడక చేత లేలేత పిల్లల పాదాల వలె ఎర్రబడిన పాదాలు కలది, శివునితోడి గాఢమైన ఆలింగనం వల్ల మొలకెత్తుతున్న పులకలతో కూడిన అపారమైన ప్రేమకు సూచన అయినది, ప్రకాశించే ఆభరణాల కూర్పు గలది, శుంభుడనే రాక్షసుడిని సంహరించినది అయిన పార్వతీదేవి, నాకు ఎల్లప్పుడూ శుభాన్ని ప్రసాదించును గాక!

విశేషములు: ఈ శ్లోకంలో కవి పార్వతీదేవి యొక్క అపారమైన సౌందర్యం, ఆమె వీరత్వం, మరియు శివుని పట్ల ఆమెకున్న అనురాగాన్ని అద్భుతంగా వర్ణించారు.

◆ అపూర్వ సౌందర్య వర్ణన: ఆమె పాదాలు లేలేత పిల్లల పాదాల వలె ఎర్రగా ఉండటం, ఆమె మృదుత్వాన్ని, కోమలత్వాన్ని సూచిస్తుంది.

◆ శివతోడి అనురాగం: శంభౌ ఉదార పరిరంభాంకురత్పులక దంభానురాగ పిశునాఅనే వాక్యం శివుని పట్ల ఆమెకున్న గాఢమైన ప్రేమను, ఆలింగనం వల్ల కలిగే పులకలు ఆ ప్రేమకు నిదర్శనమని సూచిస్తుంది. ఇది ఆమె పార్వతీరూపంలోని గృహస్థ ధర్మాన్ని, అనురాగాన్ని ప్రతిబింబిస్తుంది.

◆ వీరత్వం: శుంభాసుర ప్రహరణాఅనే విశేషణం ఆమె కేవలం సౌందర్యమూర్తి మాత్రమే కాదు, దుష్ట సంహారిణి అని, శు

ంభాసురుడిని సంహరించిన పరాక్రమశాలి అని స్పష్టం చేస్తుంది. ఇది ఆమె దుర్గా, కాళీ స్వరూపాలను స్మరింపజేస్తుంది.

◆ ఐశ్వర్యం: భాసురాభరణ గుంఫాఆమె దివ్యమైన, ప్రకాశవంతమైన ఆభరణాలతో అలంకరింపబడినదని, ఐశ్వర్యానికి ప్రతీక అని తెలియజేస్తుంది.

◆ ఈ శ్లోకం భక్తుడు అమ్మవారి సర్వగుణ సంపన్నత్వాన్ని కీర్తిస్తూ, ఆమె నుండి నిరంతర శుభాన్ని ఆకాంక్షించే ప్రార్థన.

**శ్లో॥ దాక్షాయణీ దనుజ శిక్షా విధౌ వికృత దీక్షా మనోహర గుణా**
**భిక్షాశినో నటన వీక్షా వినోదముఖి దక్షాధ్వర ప్రహరణా ।**
**వీక్షాం విధేహి మయి దక్షా స్వకీయ జన పక్షా విపక్ష విముఖీ**
**యక్షేశ సేవిత నిరాక్షేప శక్తి జయ లక్ష్మ్యావధాన కలనా ॥ 9**

**పద విభాగము:** దాక్షాయణీ, దనుజ, శిక్షా, విధౌ, వికృత, దీక్షా, మనోహర, గుణా, భిక్షాశినః, నటన, వీక్షా, వినోదముఖీ (వినోద+ ముఖీ), దక్షాధ్వర, ప్రహరణా, వీక్షాం, విధేహి, మయి, దక్షా, స్వకీయ, జన, పక్షా, విపక్ష, విముఖీ, యక్షేశ, సేవిత, నిరాక్షేప, శక్తి, జయ, లక్ష్మ్యావధాన (లక్ష్మీ+ అవధాన), కలనా.



**అన్వయము:** దనుజ శిక్షావిధౌ వికృత దీక్షా, మనోహర గుణా, భిక్షాశినః నటన వీక్షా వినోదముఖీ, దక్షాధ్వర ప్రహరణా, దక్షా, స్వకీయ జన పక్షా, విపక్ష విముఖీ, యక్షేశ సేవిత, నిరాక్షేప శక్తి, జయలక్ష్మ్యావధాన కలనా దాక్షాయణీ, మయి వీక్షాం విధేహి.

**ప్రతి పదార్థము:** దనుజశిక్షావిధౌ = రాక్షస సంహార విషయంలో, వికృతదీక్షా = అసాధారణమైన పట్టుదల గలది, మనోహర గుణా = మనసును ఆకర్షించే గుణ సంపద కలది, భిక్షాశినః = శివుడి, నటన వీక్షా = తాండవాన్ని తిలకించటంలో, వినోద ముఖీ = ఆనందించే ముఖం కలది, దక్షాధ్వర ప్రహరణా = దక్షుడి యజ్ఞాన్ని ధ్వంసం చేసిందీ, దక్షా = సమర్థురాలు, స్వకీయజన పక్షా = తన భక్తులకు అండగా నిలిచేది, విపక్ష విముఖీ = శత్రువులకు ప్రతికూలమైనది, యక్షేశ సేవిత = కుబేరుడి చేత సేవింపబడేది, నిరాక్షేప శక్తి = ఎదుర్కొనటానికి వీలు కాని శక్తి గలది, జయలక్ష్మీ = విజయలక్ష్మిని పొందటంలో, అవధాన = ఏకాగ్రత, కలనా = కలదిఅయిన, దాక్షాయణీ = దక్షప్రజాపతి కూతురైన పార్వతి, మయి = నా పట్ల, వీక్షాం = దృష్టిని, విధేహి = ఉంచవలసింది.

**తాత్పర్యము:** రాక్షస సంహార విషయంలో అసాధారణమైన పట్టుదల గలది, మనసును ఆకర్షించే గుణ సంపద కలది, శివుడి తాండవాన్ని చూస్తూ ఆనందించే ముఖం కలది, దక్షుడి యజ్ఞాన్ని ధ్వంసం చేసినది, సమర్థురాలు, తన భక్తులకు అండగా నిలిచేది, శత్రువులకు ప్రతికూలమైనది, కుబేరుడి చేత సేవింపబడేది, ఎదుర్కొనడానికి వీలుకాని శక్తి గలది, విజయలక్ష్మిని పొందడంలో ఏకాగ్రత కలది (లేదా విజయానికి ప్రశస్తమైన పూర్వ చరిత్ర కలది) అయిన దక్ష ప్రజాపతి కూతురు పార్వతీదేవి, నా పట్ల తన కరుణా దృష్టిని ప్రసరించును గాక!

**విశేషములు:** ఈ శ్లోకంలో పార్వతీదేవి యొక్క శక్తి, సామర్థ్యాలు, భక్తుల పట్ల ఆమెకున్న వాత్సల్యం, ఆమె దైవిక గుణాలు అనేక కోణాల్లో వర్ణించబడ్డాయి.

◆ దుష్ట శిక్షణ: దనుజ శిక్షా విధౌ వికృత దీక్షాఆమె రాక్షస సంహారంలో అచంచలమైన సంకల్పాన్ని కలిగి ఉందని, దుష్టశక్తి నిగ్రహకురాలిని అని తెలియజేస్తుంది.

◆ శివ భక్తి మరియు ఆనందం: భిక్షాశినో నటన వీక్షా వినోదముఖీఅనే వర్ణన శివుని తాండవాన్ని చూసి ఆనందించే ఆమె స్వభావాన్ని, శివుని పట్ల ఆమెకున్న లోతైన భక్తిని, ప్రేమను తెలుపుతుంది.

◆ దక్షాధ్వర విధ్వంసం: దక్షాధ్వర ప్రహరణాఅనేది దక్షుడి యజ్ఞాన్ని ధ్వంసం చేసిన సతీదేవి (పార్వతీదేవి పూర్వ రూపం) కథను గుర్తుచేస్తుంది, తద్వారా ఆమె అన్యాయాన్ని సహించదని, అవసరమైనప్పుడు తీవ్ర చర్యలు తీసుకుంటుందని తెలియజేస్తుంది.

◆ కరుణామయి, శత్రు భయంకరిణి: స్వకీయ జన పక్షా విపక్ష విముఖీఆమె తన భక్తులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి శత్రువులకు వ్యతిరేకంగా ఉంటుందని తెలియజేస్తుంది. ఇది ఆమె భక్తుల రక్షణకు ఎంతటి శక్తిని ప్రయోగిస్తుందో సూచిస్తుంది.

◆ ఐశ్వర్యం మరియు శక్తి: యక్షేశ సేవిత (కుబేరుడిచే సేవింపబడునది) ఆమె ఐశ్వర్య దేవత అని, ధనానికి అధిపతి అని సూచిస్తుంది.నిరాక్షేప శక్తిఆమె శక్తి అప్రతిహతమని, ఎవరూ దాన్ని ప్రశ్నించలేరని లేదా నిరోధించలేరని తెలియజేస్తుంది.

◆ విజయలక్ష్మి: జయలక్ష్మ్యావధాన కలనాఆమె విజయానికి ప్రతీక అని, సదా విజయాన్ని సాధించడంలో ఏకాగ్రత కలదని లేదా ఆమె చరిత్ర అంతా విజయాలతో నిండి ఉందని తెలియజేస్తుంది.

◆ ఈ శ్లోకం భక్తుడు తనపై కరుణా దృష్టిని ఉంచమని అమ్మవారిని వేడుకుంటున్న ప్రార్థన. (సశేషం)

# ధార్మిక దిగ్గజానికి ప్రతిబింబం హరే శ్రీనివాస

**ఏ అధికారికైనా కొన్ని పదవులు వన్నె తెస్తాయి. కానీ అన్ని పదవులకు వన్నె తెచ్చే సమర్ధ సంస్కార అధికారిగా డా. కె.వి. రమణాచారి ప్రసిద్ధులయ్యారు. ఉత్తమ అధికారి గానే కాక సాంస్కృతిక కళాబంధుగా, ధార్మికవేత్తగా వీరి కీర్తి తెలుగునాట అమోఘం. ఎంతో యోగం ఉంటే కానీ తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా పనిచేసే అవకాశం లభించదు. ఆ పదవిని వెంకన్న అనుగ్రహంతో చేపట్టి ఎన్నో అద్భుత కార్యక్రమాలను, సంస్కరణలను అమలుచేసిన ఆధ్యాత్మిక ధీశాలిగా పేరు గడించారు రమణాచారి. తిరుమల తిరుపతి సేవలో తన అనుభవాలను అద్భుత ఘట్టాలను 'హరే శ్రీనివాస' రూపంలో వారు వెలువరించిన గ్రంథానికి దర్పణం ఈ సమీక్ష.**

భగవంతుని శక్తి సర్వవ్యాపకం. ఎవరికీ అంతు తెలియని ఆ అద్భుతశక్తి విశ్వమంతా పరివ్యాప్తమవుతూ సృష్టి స్థితి లయల సాకారంగా ఆవిష్కరింపబడుతుంది. యుగ ధర్మాలను అనుసరించి వివిధ రూపాలు, అనేక నామాలతో అపార కరుణా కటాక్ష వీక్షణను ప్రసరించి, సకల జీవరాశులను ఆదుకొంటూ జగత్తును ఆనందమయం చేస్తుంది. ఈ విధంగా కలియుగంలో "కలౌ వేంకట నాయకః" అని మానవుని ఉద్ధరించడానికి తిరుమల సప్తగిరులపై అవతరించిన భక్త సులభుడు వేంకటేశ్వర స్వామి.

"కట్టెదురా వైకుంతము, కాణాచయిన కొండ, తెట్టెలాయ మహిమలే తిరుమల కొండ" అని పద సంకీర్తనాచార్యుడు అన్నమయ్య, తిరుమలను సాక్షాత్తు వైకుంతముగా భావించి ఎలుగెత్తి రాగాలను ఆలపిస్తూ కీర్తనా తతులను సమర్పించిన క్షేత్రం. అటువంటి భక్తి పునీతమై, మహిమాన్వితమైన ఆ పుణ్యక్షేత్ర నాయకుని పాద రేణువుగా తమ వంతు సేవలు అందించి, ఆ శ్రీనివాసుని అనుగ్రహాన్ని అడుగడుగునా అనుభవించి, అనుభూతి చెందిన భక్తవరులు కె. రమణాచారి గారు.

ప్రతీ క్షణం తాము పొందిన గాఢమైన పారవశ్యతతను, పరమ దయాళువైన శ్రీనివాసుని లీలా విలాసాలను నలుగురికి అందించాలనే సత్సంకల్పంతో రచించిన పుస్తకం 'హరే శ్రీనివాసా!' ఇది చదివిన పఠితృల మనస్సులు ఆనందంతో ఊయలలూగుతాయి. ఆ అనుభూతులను తనివితీరా ఆస్వాదించి ఆ స్వామి లీలలలో తేలియాడుతాయి. వేంకటేశ్వరుని సాన్నిధ్యాన్ని అనుభవిస్తూ తన్మయమవుతాయి. భగవంతునికి చేరువగా ఉండి సేవలు చేసే మహద్భాగ్యాన్ని పొందిన రమణాచార్యులు గారు ధన్యజీవులు.




2007 సంవత్సరంలో 'సర్వశిక్షా అభియాన్'లో ముఖ్యకార్యదర్శిగా ఉన్న సమయంలో ఆనాటి ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారు రమణాచారిని పిలిచి టిటిడి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమించాలని అనుకుంటున్నట్టు చెప్పడం ఆయన కోరిక తీరడానికి మొదటి అడుగు వేయించింది.

75 ఏళ్ల చరిత్ర కలిగిన టిటిడి చరిత్రలో ఈవోగా పనిచేసిన తొలి వైష్ణవులు ఆయన. బాధ్యతలు స్వీకరించిన మొదటిరోజు ప్రథమ సేవకునిగా స్వామిని దర్శించుకున్న ఆయన ఆనంద భాష్పాలతో అపరిమితమైన తన్మయత్వానికి లోనయ్యారు. తమ పదవీ కాలంలో అధికారికంగా చేయగలిగినన్ని పనులు చేశారు. వాటి అమలులో ఆయన ఎదుర్కొన్న సమస్యలు, సవాళ్లు అన్నీ ఇన్నీ కావు. వాటన్నిటిని ఎలా ఎదుర్కోగలిగారన్న ప్రశ్నకు ఆయన సమాధానం ఒక్కటే..' హరే శ్రీనివాసా!'

## చతుర్యుగ బంధ భక్తి చైతన్య యాత్ర

అనేక సందర్భాలలో ఆయన తిరుమల వాసుని సందర్శించినప్పుడల్లా ఆయన మనసులో ఒక ప్రశ్న వేధించేది. ఎన్నో కోరికలతో, మొక్కుబడులతో ఎంతో దూరం నుండి ఆశగా వచ్చి, గంటల తరబడి నిరీక్షిస్తే భక్తులకు స్వామి దర్శనం లిప్తపాటు! ఇది ఆయనను కలచి వేసేది. ఇందుకోసం ఏమీ చేయలేమా? భగవంతుడే భక్తుల దగ్గరికి వస్తే? ఇది సమాధానం లేని ప్రశ్న. ఆలోచించడానికే ఆస్కారం లేనటువంటి విషయం.

దానికి అధికారికంగా చర్యలు చేపడితే తప్ప సాధ్యం కానిది. మరి భక్తుల మొరనాలించే ఆ పరంధాముడు నిస్వార్థంగా తన భక్తుల కోసం తపిస్తున్న రమణాచారి కోరికను మన్నించకుండా ఉంటాడా?

చాలా కాలంగా కుదిపేసిన ఈ ప్రశ్నను పరిష్కరించే ప్రయత్నంలో భాగంగా ఆయన పదవిలోకి రాగానే భక్తుల వద్దకు స్వామిని తీసుకెళ్లే మహోత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అదే "చతుర్యుగ బంధ భక్తి చైతన్య

యాత్ర". ధర్మకర్తల మండలి సమావేశంలో జరిగిన అనేక చర్చలు, సందేహాల అనంతరం ఒక ప్రణాళిక ఏర్పడింది. మూడు రథాలతో స్వామివారిని భక్తులకు చేరువగా తీసుకు వెళ్లేందుకు మార్గాలను ఎంచుకున్నారు. ఎక్కడో ఓ మూల ఇది సవ్యంగా జరుగుతుందా? అనే శంక. మరోవైపు సంకల్పం కలిగించిన భగవంతుడే నిర్విఘ్నంగా నిర్వహింపజేస్తాడన్న విశ్వాసం. ఈ రెండింటి మధ్య ఆయన ముందడుగు వేశారు.

ఒక రథం కృతయుగావతారుడు వరాహ లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం సింహాచలానికి, మరొక రథం త్రేతాయుగ అవతార మైన రాముడు వెలసిన భద్రాచలానికి, మూడవది ద్వాపర యుగ దైవం శ్రీకృష్ణుడు వెలసిన కృష్ణాజిల్లా మువ్వ ఆలయానికి చేరుకునేలాగా ప్రణాళిక సిద్ధమైంది. ప్రతీ రథంలో కలియుగ దైవం వేంకటేశ్వరుడు భక్తుల చెంతకు చేరతాడు. ఎంతటి అద్భుతావహమైన ఆలోచన? కేవలం రథాలు నిర్మాణం జరిగితే సరిపోతోందా? సేవా బృందాలు, అర్చక బృందాలు, సంబారాలు సమకూర్చే అధికారులు, సాంకేతిక లోపాలను సరి చేయడానికి ఇంజనీర్లు, భోజన వసతులు, భద్రతా సిబ్బంది, వేదపండితులు, పరిచారకులు, మంగళ వాయిద్యకారులు, వైద్య సిబ్బంది ఇంతమందితో రథయాత్ర జరగాలి.

డిశంబరు 7వ తేదీ, 2007వ సంవత్సరం ఏకాదశి నాడు నిర్దిష్ట సమయానికి, వివిధ ప్రాంతాల పీఠాధిపతుల సమక్షంలో, వేలాదిమంది భక్తుల గొంతుకలు 'గోవింద' నామస్మరణతో మారుమోగుతుండగా అఖిలాండకోటి నాయకుని రథచక్రాలు ముందుకు కదిలాయి. ఆ సమయంలో రమణాచారి గారి మనస్సులో పొంగిన భావోద్వేగం వర్ణనాతీతం.

మానవుని మనసులో ఏదైనా ఒక కార్యం చేయాలనే కోరిక భగవంతుని సంకల్పంతోనే మొలకెత్తినా కూడా పరంధాముడు మనలను పరీక్షలకు గురి చేసి, తిరిగి మనకు ఆయన పట్ల ఉన్న విశ్వాసాన్ని వృద్ధి చేస్తూ ఆ కార్యాన్ని విజయవంతం చేస్తాడు. రథయాత్రలో కూడా అక్కడక్కడ కొన్ని ఇబ్బందులు తలెత్తినా అవలీలగా వాటిని అధిగమిస్తూ నిర్దేశించిన మార్గాలగుండా యాత్ర కొనసాగింది. అడుగడుగునా ఆనందోత్సాహాలతో, పార వశ్యంతో భక్తులు నీరాజనాలు, కానుకలు సమర్పించి తమ భక్తి తత్పరతను చాటుకున్నారు.

## దర్శన సౌకర్యాలు

ఒక్కోసారి ఎదలో కలిగిన ఒక చిన్న ఆలోచన కావచ్చు. ఎదుటివారి నుండి ఎదుర్కొన్న ఏదేని ఒక ప్రశ్న కావచ్చు. ఆయో మయావస్థలోకి నెట్టేస్తుంది. హృదయాన్ని తొలిచి ఇంద్రియాలను స్తంభింపజేస్తుంది.

ఒకనాడు అటువంటి ప్రశ్ననే ఆయన ఎదుర్కొన్నారు.



'డయల్ యువర్ ఈవో' కార్యక్రమంలో భాగంగా ఒక విలేఖరి "పెరుగుతున్న భక్తుల సంఖ్యకు తగినట్లు సదు పాయాల్ని ఏం పెంచుతున్నారు"? అని అడిగిన ప్రశ్న ఆయనను కుదురుగా ఉండనివ్వలేదు. దాంతో సభ్యులతో చర్చించి అనేక వ్యతిరిక్తతలను అధిగమించి చేసిన సౌకర్యాలు...

◆'వైకుంఠం' కాంప్లెక్స్‌ను ఎయిర్ కండిషన్ చేయించడం.

◆కాంప్లెక్స్‌లో భక్తులకు అల్పాహారం, పిల్లలకు, వయో వృద్ధులకు పాలు ఇవ్వడం.

◆కంపార్టుమెంట్లలో టీవీలు పెట్టి, శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ కార్యక్రమ ప్రసారాలను చూసే ఏర్పాటు.

◆వయోధికులు, చంటిపిల్లల తల్లులు, వికలాంగులకు నేరుగా మహాద్వారం చేరుకొనే విధంగా నిర్ణీత సమయాన్ని కేటా యించడం.

◆10 రూపాయల టిక్కెట్టుకు భోజనం పెట్టే విధానాన్ని రద్దు చేయడం.

◆ఉచిత భోజన వసతి కొరకు 'తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద మందిరం' పేరుతో భవనాన్ని నెలకొల్పడం. ముఖ్య మంత్రి చేతులమీదుగా ప్రారంభమైన ఈ భవనంలో ఒకేసారి నలభైవేల మంది భోజనం చేసే వీలు.

◆అలిపిరి దారిలో కాలినడకన వచ్చే భక్తుల సౌకర్యార్థం శీఘ్రదర్శన టిక్కెట్టు, ఫలహారం ఇచ్చే సౌకర్యం.

## నిత్యకళ్యాణమస్తు

రమణాచారి గారు పదవిలోకి వచ్చేటప్పటికే టిటిడి 'కళ్యాణమస్తు' అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. దానిని 'నిత్య కళ్యాణమస్తు' గా మారిస్తే బాగుంటుందన్న ఆలోచన ఆయనకు కలిగింది. స్వామివారి సన్నిధిలోనే కాక రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తూ, ఒక్కో జంటకు దేవస్థానమే అన్ని ఖర్చులు భరిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన. అది సామాన్యమైనది కాదు. అపార భక్తి ప్రపత్తులతో కొండ మీదకు నడిచి వచ్చి ముడుపులు, కానుకలు చెల్లించే సామాన్య

పేద భక్తుని కుటుంబంలో ఒక్క పెళ్లి జరిపించడం కష్టమా? అన్న ఆలోచన ఆయనను బాగా ప్రభావితుని చేసింది. ఛైర్మన్‌తో, అధికారులతో, అర్చకులతో మాట్లాడి నిర్ణయం తీసుకున్నారు. కేవలం వివాహం చేయడం కాకుండా ఈ పథకం కోసం పేర్లు నమోదు చేసుకున్న జంటలకు మొదటి దశలో ఆశ్రమ ధర్మాలను, రెండవ దశలో గృహస్థాశ్రమ ఔన్నత్యాన్ని చెప్పిన తరువాత మూడవ దశలో గృహస్థు దీక్ష తీసుకునేట్లు చేసి, వారి జీవితాలను సుఖమయం చేయాలనుకున్న ఆయన సంకల్పం ఎంత గొప్పదో అర్థమవుతుంది. సమాజంలో ఎంతోమంది పవిత్రమైన వివాహ బంధపు విలువలు తెలియక విడిపోతున్నారు. అటువంటివి జరగకుండా వాళ్లంతా కళకళ లాడుతూ ఉండాలనుకున్న ఆయన ఉద్దేశ్యం శ్లాఘనీయం.

రాష్ట్రవ్యాప్తంగా 293 చోట్ల కళ్యాణాలు ఏర్పాటు చేయ బడ్డాయి. 2007 ఆగస్ట్ 26వ తేదీ సుముహూర్తం నిర్ణయించ బడింది. ఆ రోజు హైదరాబాదులో లలితకళా తోరణ ప్రాంగణంలో ముఖ్యమంత్రి స్వయంగా వధూవరులకు అక్షతలు పంచిపెట్టాల్సి ఉండగా ముందురోజున లుంబినీ పార్క్ వద్ద గోకుల్ ఛాట్‌లో జరిగిన బాంబు పేలుళ్లు రాష్ట్రమంతా కలవరం సృష్టించాయి. కరుణా సింధువు శ్రీనివాసుని మీద నమ్మక ముంచి వివాహాలను ప్రారంభించారు. ఒకే సమయంలో 8,113 జంటలు వేదమంత్రాల సాక్షిగా ఒక్కటైనారు. తిరిగి 2008 మార్చి 19 నాడు 6,373 జంటలు కన్నుల పండుగగా కళ్యాణాలు జరిపించుకున్నారు. ఆయనకు బదిలీ అయిన తరువాత ఈ కార్యక్రమం నిలిచిపోవడం శోచనీయం.

## శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్

టి.వి ఛానల్స్ లో సనాతన ధర్మానికి సంబంధించని ఎన్నో ఛానల్స్ ఉండడం, ప్రపంచానికి తలమానికంగా ఉన్నటువంటి సనాతన ధర్మాన్ని గురించిన ఛానల్ లేకపోవడం ఆయనను ఒక నిర్దిష్ట గమ్యం వైపు నడిపించింది. తిరుమలేశుని వైభవాన్ని ప్రపంచవ్యాప్తం చేయడానికి టి వి ఛానల్ పెట్టాలని, ముందు తెలుగు భాషలో ప్రారంభించి, క్రమంగా అన్ని భాషల్లో అమలుచేయాలని మనస్సంకల్పం కలిగింది. టిటిడి సలహా దారు, ఛైర్మన్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి సాను కూలంగా స్పందించారు. హిందూత్వం పట్ల పక్షపాతం ఉన్నప్ప టికీ ముఖ్యమంత్రి డా. రాజశేఖర్ రెడ్డి క్రిస్టియన్ కావడం వలన ఒప్పుకుంటారో లేదో అనే పలు సందేహాలు. శ్రీనివాసుని మీద భారం వేసి ఆయనను కలవడానికి వెళ్లి విషయం చెప్పిన వెంటనే ఆయన అంగీకరించడం నిజంగా దైవలీల.

అంతటితో ఒక ఉద్విగ్నతకు తెర పడినా వారం, పదిరోజుల్లో రమణాచారి గారి మీద వచ్చిన అనూహ్యమైన ఒత్తిడులు ఒక



దశలో ఛానల్ ఆలోచన విరమించుకుంటే మంచిదేమోనన్న నిరాశకు గురి చేశాయి. అయినా ఆయన తమ ప్రయత్నాన్ని మటుకు విరమించుకోలేదు. ఎన్నో సమస్యలను అధిగమించి, చివరకు టిటిడి ఛైర్మన్ ప్రతిపాదించిన 'శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్' పేరుతో రెండు మాసాల్లో కేంద్ర ప్రసార శాఖ నుండి లైసెన్సు రావడంతో ఆయన పరమానందభరితులయ్యారు. ధర్మం కోసం పోరాడేవారికి తప్పక విజయం లభిస్తుందన్న దానికి ఇంతకంటే నిదర్శనం ఉండదు. ఛానల్ నిర్వహించడం నల్లేరుపై నడక కాదు. దానికొక సమర్థుడైన నిర్వహణాధికారి (సిఇఓ) కావాలి.

అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఐఎఎస్ అధికారి, వివిధ పదవులు సమర్థంగా నిర్వహించిన సుబ్రహ్మణ్యేశ్వర శర్మ గారి పేరు రమణాచారి గారి తలపులో మెరిసింది. ఛైర్మన్ గారు కూడా ఈ ప్రతిపాదనను బలపరిచారు. అప్పటికే 'మా' టి.వి వారు ఆయనను ఛైర్మన్ గా రమ్మని ఆహ్వానించి ఉన్నారు. అయినప్పటికీ శర్మగారు వీరి ఆహ్వానాన్ని మన్నించి ఎస్.వి.బి.సి ఛానల్ కు ఛైర్మన్ గా ఉండడానికి అంగీకరించడం శ్రీనివాసుని కటాక్షమే.

ఆర్థిక పరమైన ఇబ్బందులు మొదలైన సమస్యలు ముందుకు వచ్చాయి. ఆపరేటర్లు ముందుకు వచ్చి ఉచితంగా స్వామి సేవలో భాగస్వాములమవుతామని ముక్తకంఠంతో చెప్పడం మరో విజయం. 2008 జూలై 7వ తేదీన ఉదయం 5.30 గంటలకు రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ చేతుల మీదుగా ఛానల్ ఆవిష్కరించబడింది. దీని వెనుక ప్రపంచానికి ఆధ్యాత్మిక పరిమళాలు అందించాలని, సనాతన ధర్మాన్ని పరిరక్షించు కోవాలన్న ఆయన తపన అర్థమవుతుంది. (సశేషం)

**హరే శ్రీనివాస**, రచయిత : డా. కె.వి. రమణాచారి
పేజీలు : 192, వెల : రూ. 150
ప్రతులకు : ఎమెస్కో బుక్స్, హైదరాబాద్, విజయవాడ

**- ధూళిపాళ అరుణ**

# ధర్మరాజు అశ్వమేధయాగంచేయ సంకల్పించుట



డా. ఎమ్వీఎస్ సత్యనారాయణ

**గత సంచికలో- జరాసంధుని మనుమడైన మేఘసంధి అర్జునుడితో "ఈ అశ్వాన్ని బంధిస్తాను, కావాలంటే యుద్ధం చేసి విడిపించుకో" అంటూ యుద్ధాన్ని ప్రారంభించాడు. అర్జునుడి మీద ప్రకాశవంతమైన బాణాలను ప్రయోగించాడు.**

మేఘసంధి ప్రయోగించిన బాణాలను అర్జునుడు ముక్కలు ముక్కలు చేశాడే తప్ప ఆతని శరీరాన్ని తాకేటట్లు బాణాలు ప్రయోగించలేదు. మేఘసంధి గుఱ్ఱాలను, సారథిని బాధించక మెల్లగా మేఘసంధి శరీరాన్ని కప్పేటట్లు అర్జునుడు బాణాలు వేశాడు. అలా చేయడం అర్జునుడి చేతకానితనమని భావించిన మేఘసంధి, పొగరు తలకెక్కి విలాసంగా అర్జునుడిని చేరి, ఆతని శరీరంలో నాటుకొనేటట్లు గట్టి బాణాలు సంధించాడు. అర్జునుడు ఆ బాధను సహిస్తూనే మేఘసంధి శరీరాన్ని తాకకుండా సారథిని పడగొట్టాడు. గుఱ్ఱాలను చంపాడు. రథాన్ని బ్రద్దలు చేశాడు. వింటిని పిండి పిండి చేశాడు. వెంటనే మేఘసంధి, చేతిలో భయంకరమైన గదను తిప్పుతూ అర్జునుడి మీదికి ఉరికాడు. అలా గదను ప్రయోగించినా అర్జునుడు కోపం చెందక బాణాలతో ఆ గదను ముక్కలు ముక్కలు చేశాడు. దాంతో మేఘసంధి భయపడ్డాడు.

అప్పుడు అర్జునుడు మేఘసంధితో ఇలా అన్నాడు- "మా అన్న ధర్మరాజు, ఎదిరించిన ఎవ్వరి ప్రాణాలకు ముప్పు రానీయకు అని ఆజ్ఞాపించడం వల్ల ఇంతసేపు యుద్ధభూమిలో నాకు ఎదురుగా నిలబడగలిగావు. సరే రాజధర్మాన్ని అనుసరించి నీవు ఎదిరించడం ధర్మమే! ఇక శాంతి వహించు." అర్జునుడి మాటలు యదార్థమని తోచింది మేఘసంధికి. వెంటనే అర్జునుడి పాదాలు పట్టుకొని భక్తితో నమస్కరించాడు. అర్జునుడు కూడా మేఘసంధిని ఎంతో ప్రేమతో లేవనెత్తి కౌగలించుకొన్నాడు.



అప్పుడు అర్జునుడు "మగధాధిపతీ! రాబోయే చైత్ర మాసంలో పూర్ణిమ రోజున మా అన్నగారైన ధర్మరాజు అశ్వమేధ యాగాన్ని చేయబోతున్నాడు. నీవూ, నీ బంధువులు వచ్చి వీక్షించండి" అని చెప్పగానే, మేఘసంధి అంగీకరించాడు. అర్జునుడిని వినయంతో పూజించి సాగనంపాడు. అర్జునుడు కూడా సంతోషించి మేఘసంధిని పట్టణానికి వెళ్లమని ఆజ్ఞాపించి, యజ్ఞాశ్వాన్ని ముందుకు పయనింపజేశాడు. ఆ అశ్వం, వంగ, పుండ్ర, మ్లేచ్ఛ దేశాలలో సంచరింపగా, ఆ దేశాధిపతులు ఎదుర్కొన్నారు. అర్జునుడు వాడి బాణాలతో వారినందరినీ జయించి, తన ప్రయాణాన్ని ముందుకు కొనసాగించాడు. అప్పుడు ఆ గుఱ్ఱం చేది దేశంలో ప్రవేశించింది. అప్పుడు శిశుపాలుడి కుమారుడు 'శరభుడు' తన రాజధాని అయిన శక్తిపురం నుంచి బయటకు వచ్చి యుద్ధం చేశాడు. అర్జునుడి ధాటికి ఆగలేని శరభుడు ఆయనను ఆశ్రయించి వినయంతో పూజలు చేసి గౌరవించాడు. అక్కడి నుండి యజ్ఞాశ్వం ముందుకు పయనించగా టెంకణాధిపతి, కిరాతరాజు మొదలగు రాజులు ఎదుర్కొనగా, అర్జునుడు వారికి బుద్ధి చెప్పి, అటు నుంచి కోసల దేశీయులను కాశీ దేశ వాసులను జయించి, దశార్ణ దేశంలో ప్రవేశించాడు.

అర్జునుడిని ఎదిరించబోయి దశార్ణ దేశాధిపతి చిత్రాంగదుడు పరాజయాన్ని పొంది, ఎంతో వినయంతో అర్జునుడిని పూజించి, ఆయన ఆదరం పొంది తిరిగి రాజధానికి వెళ్లిపోయాడు. అటు పిమ్మట యజ్ఞాశ్వం నిషాద దేశంలో ప్రవేశించింది. ఆ దేశానికి రాజు ఏకలవ్యుడి కుమారుడు. అతడు అర్జునుడి పరాక్రమాన్ని తెలుసుకోలేక యజ్ఞాశ్వాన్ని బంధించి, యుద్ధానికి దిగాడు. అర్జునుడు ఆ నిషాదరాజు సైన్యాన్ని బాణాగ్నిజ్వాలలతో దహింపజేశాడు. అతడి గర్వాంధకారాన్ని తీవ్ర బాణకాంతుల చేత నశింపజేశాడు. అప్పుడు నిషాధిపతి బుద్ధి తెచ్చుకొని వినయంగా అర్జునుడిని సమీపించి పూజించి, గౌరవించి, వీడ్కోలు పలికాడు. అర్జునుడు గుఱ్ఱాన్ని అనుసరించి

ఆయా దేశాలను జయిస్తూ దక్షిణాపథం చేరాడు. ఆ ప్రాంతంలోని పౌండ్ర, ఆంధ్ర, ద్రావిడ, కేరళ, కర్ణాటక భూపతులు అర్జునుడికి లొంగిపోయి, గౌరవించి సాగనంపారు. తరువాత అర్జునుడు గుఱ్ఱాన్ని అనుసరిస్తూ సౌరాష్ట్ర దేశంలో ప్రవేశించి గోకర్ణం, ద్వారకా నగరాలను ప్రవేశించాడు.

అర్జునుడి రాకను తెలిసికొన్న యాదవులు, యుద్ధం చేయకుండా ఎంతో ప్రేమతో అర్జునుడిని పూజించారు. అర్జునుడు కూడా తగు విధంగా ప్రశంసించాడు. తరువాత యజ్ఞాశ్వం పశ్చిమ సముద్రతీరాన ఉన్న దేశాలలో తిరిగి, పాంచాల దేశం మీదుగా పయనించి గాంధారదేశం ప్రవేశించింది. ఆ దేశాన్ని శకుని కుమారుడు పాలిస్తున్నాడు. అతడు పిల్లదనం చేత కలిగిన చెడు ప్రవర్తన కలిగిన వాడగుటచేత మిడిసిపాటుతనంతో తన సేవలను ప్రోగు చేసికొని భయంకరంగా అర్జునుడిని ఎదుర్కొన్నాడు. అయినా అర్జునుడు తొందరపడక, తన అన్నగారైన ధర్మరాజు ఆదేశాన్ని తెలియజేశాడు. కాని ఆ మాటలను శకుని కుమారుడు విని కూడా మూర్ఖత్వంతో తన పట్టుదలను విడనాడక, భయంకర యుద్ధం చేశాడు. అర్జునుడికి కోపం వచ్చింది. వెంటనే తన వాడి బాణాలతో గాంధార దేశ చతుర్బలాలపై విజృంభించాడు. ఆ ధాటికి తట్టుకోలేక సైన్యం చాలా భాగం నశించింది. మరికొంత సైన్యం చెల్లాచెదురయ్యింది. పరిస్థితిని చూసిన శకుని పుత్రుడు రోషంతో విజృంభించాడు. అర్జునుడిపై వాడిగల బాణాలను ప్రయోగించాడు. శకుని పుత్రుని బాహుబల సంపదని గమనించిన అర్జునుడు మనస్సులో ఆనందించి వాత్సల్యంతో ఇలా అన్నాడు- "శకుని పుత్రా! ధర్మరాజు రాజులెవ్వరినీ చంపవద్దని ఆజ్ఞాపించడం చేత నేను ఆయన ఆజ్ఞను శిరసావహిస్తున్నాను. నేను స్వతంత్రించి ఆయన ఆజ్ఞను ధిక్కరిస్తే ఆ ప్రభువు నన్ను పరాజయం పొందినవాడిగా భావిస్తాడు. అందుచేత నేను నీతో యుద్ధం చేయాలని భావించడం లేదు. నీవు కూడా యుద్ధం మానుకో." ఆ మాటలు విన్న శకుని పుత్రుడు అర్జునుడిని బాణాలతో కప్పివేశాడు.

అప్పుడు అర్జునుడు వాడి బాణాలతో శకుని కుమారుడి శరస్త్రాణం నేలమీద పడేటట్లుగా కొట్టాడు. ఆశ్చర్యం కలిగించే ఆ పనిని చూసి అక్కడకు దగ్గరగా ఉన్న ప్రజలు "మహావీరుడైన అర్జునుడిని తలచుకొంటే ఈ రాజు శిరస్త్రాణం తెగ్గొట్టినట్టు శిరస్సును కూడా తెంపగలడు. కేవలం శిరస్త్రాణం పడగొట్టడం అతని దయకు నిదర్శనం" అనుకొంటూ ఉండగా మొదట రథాన్ని వెనుకకు తిప్పుకొని చాలా దూరం వెళ్లి కూడా, ఆ శకుని కుమారుడు మహావేగంతో తిరిగి వచ్చి, అర్జునుడి మీద ఉరికాడు. తన సైన్యాన్ని ఉసిగొల్పాడు. వారంతా అర్జునుడిని



నాలుగువైపులా చుట్టుముట్టి అనేక శస్త్రాస్త్రాలు ప్రయోగించారు. మహాపరాక్రమవంతుడైన అర్జునుడు, గాంధార సైన్యం ప్రయోగించిన ఆయుధాలను ముక్కలు ముక్కలుగా నేలపై పడేటట్లు చేశాడు. గాంధార సైన్యం భయంతో పారిపోయింది. శకుని కుమారుడిని రక్షించుకోవడానికి మంత్రులు, తల్లి పూజాద్రవ్యాలు తీసికొని, వేగంగా అర్జునుడిని సమీపించి "అర్జునా! నీకు నమస్కారం రాజు యొక్క తొందరపాటును పెద్ద మనస్సుతో క్షమించు. రాజును రక్షించు" అంటూ ప్రార్థన చేశారు. అర్జునుడు ఆ సాధ్విని ప్రశంసించి, మన్నించదగిన మాటలతో మంత్రులకు సంతోషం కలిగించి, మృదుస్వరంతో శకుని కుమారుడితో ఇలా అన్నాడు- "రాజకుమారా! నీవు నా మీదకు యుద్ధానికి రావడం నా మనస్సుకు బాధ కలిగించింది. ధర్మరాజు నాతో ఏ రాజునూ చంపక మంచి మాటలతో వశపరచుకో" అన్నాడని అందరూ వినేటట్లు నీకు చెప్పాను గదా! అందువల్లనే నేను కేవలం నీ సైన్యాన్ని చంపి, నిన్ను చంపకుండా వదిలిపెట్టాను. పైగా ఈ గాంధార దేశంతో సంబంధమున్న గాంధారిని, ధృతరాష్ట్రుడిని స్మరించి, నీ పట్ల ఇలా శాంతంగా ప్రవర్తించాను. అందుకే నీవు ఇంతసేపు యుద్ధరంగంలో నా ఎదుట నిలబడగలిగావు. ధర్మరాజుతో విరోధం కాదు- పొత్తు మంచిది. రాబోయే చైత్ర మాస పూర్ణిమ నాడు రాజశ్రేష్ఠుడైన ధర్మరాజు చేసే అశ్వమేధ యాగానికి నీవు, నీ బంధుగణం రండి." తరువాత యజ్ఞాశ్వం హస్తినాపురం వైపు వెళ్లటం మొదలుపెట్టింది.

(సశేషం)

# ఆర్ష ధర్మంపై అన్యుల విషం

## భరతజాతిని మేల్కొల్పే 'అరవిందుని' కలం

(గత సంచిక తరువాయి)

పాశ్చాత్య దేశాలు ఇస్లాం పట్ల కారణం లేకుండా ద్వేషం చూపుతున్నారని, కొందరు తీవ్రవాదుల చర్యల్ని బట్టి ముస్లిం లందరిపై ద్వేషాన్ని చూపుతున్నారని ఇస్లామిక్ మేధావులు కొందరు తమ రచనల ద్వారా పాశ్చాత్య మేధావుల్ని మెప్పింప గలిగారు. వాదన వల్లనా, ధనం వల్లనా చెప్పలేం. కాని పాశ్చాత్య దేశాల్లో కూడా ఇస్లాంను గూర్చి మాట్లాడడానికి వెనుకంజ వేస్తుం టారు. మేధావులైతే అలా విమర్శించడాన్ని ఖండిస్తారు కూడా.

అమెరికాలోని జంట టవర్ల విధ్వంసం తరువాత కొంతకాలం పాటు ముస్లింలపై ప్రజలు కోపంతో ఉన్నది నిజమే. కానీ ఇస్లామోఫోబియా అనే వాదం వచ్చిన తరువాత ఆ ద్వేషం మాయమైంది. ఇస్లాంపై లోతుగా అధ్యయనం చేసిన ప్రొఫెసర్ Robert Spencer తన పుస్తకాల్లో ఈ పరిణామాన్ని వివరించారు. ఈయన పుస్తకాల్ని భారతీయ విద్యావంతులందరూ చదవాలి (అమెజాన్‌లో లభ్యమవుతాయి).

ఏ విషయంపైన అయినా ఫోబియా (అకారణ భయం/ ద్వేషం) మన ఆలోచన రాహిత్యాన్ని అల్పబుద్ధిని, ద్వేషభావాన్ని సూచిస్తుంది. ఏదైనా విషయంపై మీకు ఫోబియా ఉందని ఇతరులు అంటే ఎవరూ ఒప్పుకోరు. ఒక మానసికరోగం ఉందంటే అది లేదని నిరూపించుకోవడానికి ప్రయత్నిస్తాం. మేధావులు ఇదే బోనులో పడ్డారు. తమకు ఆ రోగం లేదని, తాము అతి ఉదారవాదులమని నిరూపించుకోవాలి కదా. అందు వల్ల తమను తాము ప్రజ్ఞావంతులుగా చూపుకోవాలి అను కున్నారు. ట్విన్ టవర్స్ ధ్వంసమైన స్థలంలో గొప్ప మసీదును కట్టి తమ ఉదారవాదాన్ని నిరూపించుకోవడానికి ప్రయత్నిం చారు. కానీ ఎందుకో అది జరగలేదు.

చరిత్రలో భారత్‌పై ఇస్లాం వ్యవహరించిన తీరును దేశ విభజన సమయంలోనూ, ప్రస్తుతంలోనూ వ్యవహరిస్తున్న తీరును చూస్తే ఎవరికైనా మన జాగ్రత్తలో మనం ఉండాలనే భావన మనసులో కలుగుతుంది. Good fences make good neighbours అని ఒక సామెత ఉంది. అలాగే జాగ్రత్తలో ఉండడం అకారణ ద్వేషం కాదు. రాజ్య విస్తరణ, మత మార్పిడి వ్యూహాలు ఎప్పటిలాగే ఆ మతంలో ఉండడాన్ని 1990లో కాశ్మీరు సంఘటనలు, పశ్చిమ బెంగాల్, కేరళలలో ప్రస్తుతం జరుగుతున్న సంఘటనలు స్పష్టం చేస్తాయి. కేరళలోని లవ్ జిహాద్‌లు చూసినా ఎవరైనా జాగ్రత్తగా ఉండాలనుకుంటారు. లవ్ జిహాద్ గూర్చి బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్సు దేశాల్లోని రాజకీయ నాయకులే దాన్నొక సమస్యగా చెప్పారు. మన దేశంలో పలు సందర్భాల్లో ముస్లిం యువతతో పాటు తీవ్రవాదులు కలిసి పాకిస్తాన్ జిందాబాద్ అని నినాదాల్ని ఇవ్వడాన్ని చూస్తున్నాం. యూరప్ విషయంలో మహమద్ గడాఫి చెప్పింది భారత్‌కూ అన్వయించే ప్రమాదం ఉంది. తాము మైనారిటీగా ఉన్న దేశంలో తమను తాము బాధితులుగా వర్ణించుకోవడం, తమ మత సిద్ధాంతాన్ని వ్యూహాన్ని మాత్రం జాగ్రత్తగా అమలు చేయడం, మైనారిటీలుగా ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా హక్కుల్ని సాధించడం మొదలైన వాటిని గమనించి దేశ భద్రత అనే అంశాన్ని మరువకుండా ఉండాలి. దేశ భద్రతను గూర్చి అలా ఆలోచించడాన్ని ఫోబియా అనలేం.



**హిందువులు పిరికిపందలా?**

స్వాతంత్ర్య పోరాట సమయంలో గాంధీజీ ఒకవైపు ఆత్మహత్యా సమానమైన విధానాన్ని పాటిస్తూనే మరోవైపు హిందువులను పిరికిపందలని అన్నాడు. కలకత్తాలో హిందువులపై అత్యాచారాలు జరిగినప్పుడు తను నడుపుతున్న Young India అనే పత్రికలో (29-5-1924) సరిగ్గా వంద సంవత్సరాల క్రితం ఇలా అన్నాడు.

“నా అనుభవమే చెపుతుంది ముసల్‌మాన్ బెదిరించేవాడు (Bully) హిందువు పిరికివాడు (Coward). అలాంటప్పుడు హిందువు తన పిరికితనానికి ముస్లింను తప్పు పట్టడం సరైనదా? పిరికి పందలున్నప్పుడు బెదిరించేవాళ్లు కూడా ఉంటారు. ముస్లింలు చేసే బెదిరింపుల కన్నా హిందువుల పిరికితనానికి నేనెక్కువ సిగ్గుపడుతున్నాను.”

గాంధీ మాటలు ఆయన నిస్సహాయతను, విసుగును సూచి స్తాయి. నీపై దౌర్జన్యం జరిగితే ఆత్మరక్షణ చేసుకునే హక్కు నీకుంది, చేసుకోకుంటే నీ ఖర్మ అని ఆయన పరోక్షంగా చెప్పాడు. దుర్బలస్య బలం రాజా, అంటే బలం లేని వాడికి బలం రాజు (ప్రభుత్వం) అని ఒక వాక్యం ఉంది. పిరికివాడు తన్ను రక్షించే రాజు నుండి సహాయం పొందాలి. అది మరిచి ఎలక్షన్ సమయంలో తన కులం వాడికో లేదా కుక్క బిస్కెట్లు

పడేసినవాడికో ఓటు వేస్తే వాని భవిష్యత్తు కుక్క జీవితంలాగా ఉంటుంది.

సుభాష్ చంద్రబోస్, పటేల్ లాంటి నాయకులు పిరికివారేం కాదు. గాంధీజీ పిరికితనం ఆ సమయంలో హిందువులకు వ్యాపించింది. గాంధీజీ రాజ ధర్మాన్ని మరచిపోయి మహాత్మ స్థాయి అనే మోహంలో పడి అహింస అనే వ్యక్తి ధర్మాన్ని అన్ని సందర్భాల్లో రాజ ధర్మంగా ప్రచారం చేయడం వల్ల ఆ ప్రచారాన్ని ఒక వర్గం మాత్రమే నమ్మారు, నష్టాన్ని పొందారు.

ఇదే ధోరణిలో విన్స్టన్ చర్చిల్ (Royal Albert Hall 18-3-1931) ఇలా అన్నాడు. 'ఒకవైపు హిందువు తన వాదనకు పదును పెడుతుంటే మరోవైపు ముస్లిం తన కత్తికి పదునుపెడు తుంటాడు'. పధ్నాలుగు వందల సంవత్సరాల క్రితం అరే బియాలో జరిగిందే తరువాత అనేక దేశాల్లో జరిగింది. ఇటీవలి కాలంలో 1990లో కాశ్మీరులో జరిగింది. Tarek Fatah అనే పాకిస్థాని పాత్రికేయుడు (కెనడా నివాసి) నిష్పక్షపాతంగా అనేక వాస్తవాల్ని చెప్పారు. ఆయన తన యూట్యూబ్ భాషణల్లో కాశ్మీరు సంఘట నల్ని వివరంగా చెప్పారు. 1990 లోని సంఘటనను ఆయన షరియా బోల్షివిక్ అని వర్ణించారు. ఇస్లాం మరియు కమ్యూ నిష్టులు ఇందులో భాగస్వాములు అని కూడా చెప్పాడు. ఆయన యూ ట్యూబ్ భాషణలు తప్పకుండా వినాల్సినవి.



ఇస్లాంలోని ప్రత్యేకత ఏమంటే ఖురాన్‌ను, ప్రవక్త జీవితచరిత్రను కలిపి చదివితే ఏ దేశంలోనైనా ఇస్లాం యొక్క వ్యూహాలు ఏ దశలో ఉన్నాయి, ఏ విధంగా రూపొందుతున్నాయి అన్నది తెలుసుకోగలం. దీర్ఘకాలిక పోరాట విధానాన్ని గూర్చి అనేక మేధావులు విశ్లేషించారు. ప్రస్తుతం అనేక దేశాలు కాగు తున్న నీటిలో కప్ప లాగా ఉన్నాయి. పశ్చిమ దేశాల సమస్య కేవలం ఒక మత విశ్వాసం నుండి మరొక మత విశ్వాసానికి మారడం. రెండూ విశ్వాసాలే. కానీ భారతీయ మతాల సమస్య వేరు. తత్త్వశాస్త్రం పునాదులపై ఉన్న మతాలు తత్త్వాన్ని, తర్కాన్ని వదిలి విశ్వాసంలోకి దిగజారడమౌతుంది.

భారతీయ మతాలు తత్త్వచింతనపై ఆధారపడినవని ప్రపంచానికి స్పష్టంగా, గట్టిగా తెలియజేసిన వ్యక్తి వివేకానందుడు. చికాగో నగరంలో 1893లో వివేకానందుని ప్రసంగం హిందూమత చరిత్రలో ఒక మలుపు. సరైన సమయంలో సరైన వ్యక్తి సరైన సభలో సరైన విధంగా మాట్లాడటం, ప్రపంచానికి భారతీయ తత్త్వశాస్త్రాన్ని పరిచయం చేయటం ఆయన సాధించిన ఘన విజయం. ఆయన ఏ విష్ణువునో, శివుణ్ణో పూజించాలని యజ్ఞాల్ని చేయాలని, పుణ్యం వస్తుందని చెప్పలేదు. కేవలం ఉపనిషత్తుల్లో ఉన్న సిద్ధాంతాన్ని చెప్పాడు. వివేకానందుడికి ముందు మన తత్త్వశాస్త్రజ్ఞానం సంప్రదాయ పీఠాలకు పరిమితమై ఉండేవి. Schopenhauer Aran, Emerson లాంటి విద్వాంసులు అనువాదాల ద్వారా మన మూలగ్రంథాల్ని తెలుసుకున్నా ఇతర మతాల వారికి మన గ్రంథాలు తెలియవు. వివేకానందుని తరువాత ఆ కోవలో పలువురు సన్యాసులు హిందూమత మూలాలను పాశ్చాత్యదేశాల్లో వివరించారు. ప్రపంచ మేధావులు అత్యంత ప్రభావితులయ్యారు.

ప్రపంచంలో పలు దేశాల్లో ఇస్లామిక్ తీవ్రవాద సంస్థలు పనిచేస్తున్నాయి. వీటిని అనేక దేశాలు నిషేధించాయి. ఈ సంస్థలు తమ సభ్యులకు పలు విధాలుగా ప్రేరణనిస్తారు. కాఫిర్ (ఇస్లాంను నమ్మనివారు)లను మత మార్పిడి చేసినా, లేదా వారితో సంఘర్షణలో మరణించినా స్వర్గం లభిస్తుంది అని వీరి బోధన. ఆత్మహత్య దళాలకు ఇంకా గొప్ప ప్రేరణనిస్తారు. స్వర్గసుఖాలను పలు విధాలుగా వర్ణించి చెపుతారు. ఒకవేళ శత్రువుపై విజయాన్ని సాధిస్తే వారి ఆస్తులు, స్త్రీలు అందరూ నీ సొమ్మే యథేచ్ఛగా అనుభవించవచ్చు, ఇదే భగవంతుని ఆజ్ఞ అని వర్ణిస్తారు. శత్రువు నుండి ఇలా సొంతం చేసుకున్న ఆస్తిని మాల్-ఎ-ఘనీమత్ అంటారు.

భగవంతుడు ప్రపంచంలో అందర్నీ ఇస్లాంలోనే సృష్టించాడని, కానీ సైతాన్ వాళ్లను ఇతర మతాల్లోకి మార్చాడని కావున వారిని మళ్లీ మన మతంలోకి తేవడం పవిత్ర ధర్మమని వీరి వాదన. ఇదే వాదనను ఒక హైదరాబాద్ పార్లమెంట్ సభ్యుడు కూడా చేశారు. కానీ ఇదే వాదనను వైష్ణవులు, శైవులు కూడా చేయవచ్చు. దీన్ని ఎవరూ నిరూపించలేరు, ఖండించలేరు. కానీ అజ్ఞానులైన యువత, లేదా స్వార్థపరులైన యువత ఈ మాటల్ని నమ్మడానికి సిద్ధంగా ఉంటారు.

ఇలాంటి తీవ్రవాద గ్రూపులకు వామపక్షాల మద్దతు ఉంటుంది. సందర్భాన్ని బట్టి అగ్రదేశాల మద్దతు కూడా కూడా ఉంటుంది. ఉదాహరణకు చాలా ఏళ్ల పాటు అమెరికా ఆఫ్ఘనిస్తాన్‌లోని తాలిబాన్‌లను ప్రోత్సహించింది. అలాగే భారత్ ఎదుగుదలను అడ్డుకోవడానికి పాకిస్తాన్‌ను వాడుకుంది. పాకిస్తాన్‌లోని ప్రస్తుత అనిశ్చిత పరిస్థితిలో మళ్లీ వారిని వాడుకొనే అవకాశం ఉంది. (సశేషం)

**గోవును కాపాడండి**

(గత సంచిక తరువాయి)

దూడని కనదు కాబట్టి పాలివ్వదు. కాబట్టి ఎలా ఇస్తాను పీఠానికి. అని ఆయన అమ్మేశారు. ఎవరికో అమ్మేశారు నాలుగు వందల రూపాయలొచ్చాయి. ఆ డబ్బు పట్టుకెళ్ళి మహాస్వామికి ఇచ్చారు. స్వామీ ఆవు ఇద్దామనుకున్నాను.

కానీ నేను ఏ ఆవు పొల్లిన తర్వాత, ఈని దూడని కన్న తర్వాత తెచ్చేద్దామనుకున్నానో అది పొల్లలేదు. అందుకని దానిని అమ్మేసాను. నాలుగువందలొచ్చాయి, నా సంకల్పానికి దోషం రాకూడదు. ఆవుకు బదులు డబ్బిచ్చేస్తున్నానన్నారు. ఆయ నన్నారు మహాస్వామి ఇలా తిరిగి, నువ్వు ఎవరికి పొల్లలేదని చెప్పి ఆవునిచ్చేసావో, దానితో బరువులు మొయిస్తే, ఒకవేళ అది ఎలాగో పొల్లదు, ఈనదు, దూడని కనదు, పాలివ్వదు అని వాళ్ళు దాన్ని చంపి ఉంటె, దాని నెత్తురు, మాంసం తట్టలోపెట్టి నాకిచ్చావా? అని అడిగారు. అని నాకిడబ్బక్కరలేదు, వెళ్ళి ఆ ఆవుని పట్టుకొచ్చి ఇవ్వు అన్నారు. ఆయన ఎంత కష్టపడ్డారో ఆ ఆవు ఎక్కడుందో కనిపెట్టడానికి.



తూములూరి మోహన్ కుమార్

వెళ్ళిపోతున్నారు. వెళ్ళిపోతున్నప్పుడు ఆరోజు సాయంకాలం ముందు మహాస్వామి బయలుదేరారు, వెనకావతల ముఖ్యమైన సామాను పట్టుకొని గుర్రం బయలుదేరింది. ఓ ఆవు, దూడ కూడా బయలుదేరాయి. ఒక సిక్కు వ్యక్తి దారి చూపిస్తున్నాడు.

స్వామీ మరి నడిచి వెడతారు లేకపోతే పల్లకిలో వెడతారు. ఆయన మేనాలో ఉన్నారు, వెడుతున్నారు. చీకటిపడిపోయింది. చాలాదూరం వెళ్ళిపోయిన తర్వాత, దారిచూపిస్తున్న వ్యక్తి దారి తప్పిపోయానని తెలుసుకున్నాడు. అప్పటికి రాత్రి పది అయింది. అరణ్యంలో చిక్కుకున్నారు. క్రూరజంతువుల అరుపులు వినపడుతున్నాయి. ఎలా! వెంటనే స్వామికి చెప్పారు. స్వామీ!, దారితప్పిపోయంటా అరణ్యంలోకి వచ్చేసాం అని. ఒక రైలు గేటు కనపడింది. ఆ గేటుకి చిన్న తొట్టెలా ఉంది. అందులో ఈ ఆవుని దూడని ఎక్కించేసి, తాడుకట్టి మేనా అడ్డంగాపెట్టి, తానూ అందులో కూర్చున్నారు సత్యదండం

# కంచిస్వామి దివ్య చరిత్ర 'గిని - అద్వైత గని'

యదార్థమా! కాదా!? ఎంత వెతికారో, ఎక్కడో లంబాడీల దగ్గర ఉంది ఆ ఆవు అని తెలిసింది. ఆ ఆవు దొరకలేదు. మహాస్వామికి తీసుకొచ్చి ఆవు అప్పగించాలి ఎలా? అప్పుడు వాళ్ళ పరివేదన గమనించి, కబురుచేశారు. ఆ ఆవుకోసం ఇంక వెతకద్దులేండి. కానీ ఇకపైన ఎప్పుడు గోసేవలోమాత్రం ఏమరకుండా జీవించండి. ఏ కారణానికి ఆవుని అమ్మవద్దు అన్నారు. వాళ్ళ నాన్నగారు వాళ్ళకి చెప్పిందేమిటంటే, మీకు ఐశ్వర్యం కాదురా...! ఐశ్వర్యాలకి మించిన మహదైశ్వర్యాన్ని ఇస్తున్నాను, ఏమిటో తెలుసా! మహాస్వామి పాదాలందించి మీకిచ్చాను. ఆయనని సేవించి తరించిపొండి అన్నారు. వాళ్ళు సేవించి తరించిపోవట్లా! ఇందాక చెప్పలా! వసంతం, వసంతం, వసంతం...మా జీవితాలు వసంతం అన్నారు.

మరి కనీసం ఒక్క ఆవుని పోషించక్కర్లా? ఒక్క ఆవుకి ప్రదక్షిణం చేయక్కర్లా? ఒక గ్రాసం పెట్టక్కర్లా? ఆవు అంటే ఒకానొక సందర్భంలో తన ప్రాణత్యాగం చెయ్యడానికి సిద్ధపడ్డారు. ఒకప్పుడు పీఠం ఖర్గపూర్ వెళ్ళింది. ఖర్గపూర్ లో పీఠపరివారంలో కొంతమంది అనారోగ్యం పాలైయ్యారు. అనారోగ్యం పాలైపోతే, ఏం చెయ్యాలి? అందుకని కొన్నాళ్ళు ఉండిపోయారు. సుమారు ఓ రెండునెలలు ఉండిపోయారు ఖర్గపూర్ లో. తర్వాత వాళ్ళకి స్వస్థత కలిగింది. టాటా నగర్ పట్టుకుని.


అంటే ఆయన ఉద్దేశ్యం! ఆవు వాసన చూసి ఏ పెద్దపులి అయినా, ఆవుని చంపటానికి వస్తే, ఆవుని చంపడానికి ముందు తనని చంపేశాకా ఆవు మీద పంజాతో కొట్టాలి. అలా అన్వయమా? నాజోలికొచ్చి ఆవుజోలికెళ్ళు. రాగలదా ఏదన్నా? రాగలదా? కుదురుతుందా! రాత్రంతా కామాక్షి, కామాక్షి, కామాక్షి, కామాక్షి అంటూ కూర్చున్నారు. అరుస్తూనే ఉన్నాయ్, దగ్గరకొస్తూనే ఉన్నాయ్. వెళ్ళిపోతూనే ఉన్నాయ్. తెల్లవారింది. దారితెలిసింది. పీఠం వెళ్ళిపోయింది. అంటే ఒక ఆవు కోసం అవసరమైతే తన శరీర త్యాగానికి సిద్ధపడ్డారు. ఆయన కారుణ్యం ఏమని చెప్పమంటారండీ! చిన్న చిన్న విషయాలకి మనం స్పందించేదేమిటి అనుకుంటాం. కానీ ఆయన యొక్క జీవితాన్ని పరిశీలిస్తే మనస్సు అన్నదానికి ఎంత ఆర్ద్రత ఉండాలో అర్థమవుతుంది.

**నువ్వు సుమంగళివి**

మీకు నేను ఈ ఒక్క ఉదాహరణ చెప్తాను. ఒకానొకప్పుడు పీఠంలో మహాస్వామి వారు కూర్చుని ఉండగా ఒకావిడ బిక్కు బిక్కుమంటూ కన్నుల నీరుపెట్టుకొని కళ్ళొత్తుకుంటూ వరుసక్రమంలో వస్తోంది. స్వామి వారు చేత్తో ఇంత కుంకుమ తీసి ఆవిడ చేతిలో వేశారు. ఆవిడ తీసుకోకుండా చెయ్యి వెనక్కి

తీసేసుకుంది. తీసేసుకుని కళ్ళనీళ్ళు పెట్టుకుని పక్కకు వెళ్ళిపోయింది. అందరూ వచ్చి అయ్యో అయ్యో అయ్యో... మహాస్వామి వారి చేత్తో కుంకుమ ఇస్తే పుచ్చుకోవా? ఇంతకన్నా అన్యాయం ఉందా? పుచ్చుకోమ్మా! అన్నారు. ఆవిడంది..కాదు. నా భర్త మరణించాడు. ఆయన శరీరం కూడా లభించలేదు.

అటువంటి వారికి ఉత్తరక్రియలు ఎలా చెయ్యాలి అని అడగటానికి వచ్చాను భర్త మీద ప్రేమతో. నాకు కుంకుమ ఏమిటి? అంది. అమ్మా! కాదు! ఆయన చేత్తో ఇచ్చారంటే ఏదో ఉంది. "త్రికాలవేది". పుచ్చుకో అన్నారు. కాదనలేక ఆవిడ చెయ్యి చాపింది. కుంకుమవేసి చూసి అన్నారు. అమ్మా! నువ్వు సుమంగళివమ్మా! నీ భర్త బ్రతికున్నాడు. నీ భర్త తిరిగొస్తాడు. బొట్టు పెట్టుకో అని, సువాసిని పూజ అవుతోంది. ఆ సువాసినులని పిలిచి, ఈవిడ కొప్పులో పూలు తురమండన్నారు. ఆవిడ కొప్పునిండా మల్లెపూలు పెట్టి, బొట్టుపెట్టి, కాళ్ళకి పసుపురాసి, పారాణి పెట్టి పంపించారు. వచ్చినప్పుడు....నేను పూర్వ సువాసినిని అనుకొని అమంగళకరంగా వచ్చింది. నీ భర్త ఉన్నాడు అని మహాస్వామివారు చెప్పారు. లేడు...చనిపోయాడు అని చెప్పి ప్రభుత్వం నుంచి టెలిగ్రామ్ కూడా వచ్చేసింది. ఆవిడ మహాస్వామివారి మాట నమ్మింది. "త్రికాలవేది". ఎక్కడో ఉన్నాడు నా భర్త. బొట్టుపెట్టుకొని ఎదురు చూస్తోంది. వారం రోజులైంది. తెల్లవారకట్ల తలుపు కొట్టారెవరో. వెళ్ళి తలుపుతీసింది. భర్తగారొచ్చారు. ఆవిడ తెల్లబోయింది. ఒక స్త్రీ ఎంత ఆనందం ముప్పిరిగొన్న శోకం ఎంత పొందేస్తుందండి అసలింకా. అసలు ఉంగరమిచ్చినంత మాత్రం చేతనే, సీతమ్మ బుగ్గలు ఎర్రబడిపోయి....





**గృహీత్వా ప్రేక్షమాణా సా భర్తు హ్ కరవిభూషణమ్ ।**
**భర్తారమివ సంప్రాప్తా జానకీ ముదితా భవత్ ॥**

అన్నారు వాల్మీకి మహర్షి రామాయణంలో. వెళ్ళిపోయాడనుకున్న భర్త తిరిగొస్తే ఆ స్త్రీ ఆనందానికి అంతుంటుందాండి? (సశేషం)

('గిని..అద్వైతగని' పుస్తకం నుంచి)






# దక్షిణామ్నాయ శృంగేరీ శ్రీశారదాపీఠ వైభవం

### భూలోక శ్రీ శారదాచంద్రమౌళీశ్వరులు

జగద్గురువులు ఆ పేరు వినగానే మాటలు రాని మూగవారు కూడా మాటలు పలకడం ప్రారంభిస్తారు. అంతటి మహాత్మ్యం దాన్లో ఉంది. అసలు శృంగేరి అనగానే దేవలోకం, దేవతా స్వరూపాలు కళ్లముందు కన్పిస్తాయి. అలాంటి శృంగేరిలో తపశ్చక్రవర్తి, సకల నిగమాగమసార హృదయులు, రాజ గురులు, భూమండలాచార్యులు, శ్రీ దక్షిణామ్నాయ శృంగేరి శారదాపీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామివారు దేవతా స్వరూపంలో - అత్యంత తేజోమూర్తులుగా ఒక్కసారి చూస్తేనే జన్మజన్మల పాపాలు అదృశ్యమయ్యేలా మనకు దర్శనమిస్తారు. పీఠాధిపతులంటే ఇలా ఉంటారా? అనుకునేంత నిరాడం బరులుగా కన్పిస్తారు. దర్శనానికి వచ్చిన ప్రతి ఒక్క భక్తుని భాషాభేదం లేకుండా ఆప్యాయంగా ఆశీర్వదిస్తారు. సమస్యల్ని వింటారు. బాధల్ని మనోనేత్రంతో చూస్తారు. దీవిస్తారు. వారి నుంచి దీవన తీసుకోగానే మనలో తెలియని ధైర్యం, సంతోషం, ఆనందం అన్నీ కలిసి వెయ్యి ఏనుగుల బలం వస్తుంది. నిజంగా ఆయన ఈ కలియుగంలో కనిపించే భగవత్ స్వరూపం. అందుకే స్వామివారు కొన్ని కోట్ల మంది చేత పూజింప బడుతున్నారు.

శ్రీ జగద్గురు శంకరాచార్య మహాసంస్థానం- దక్షిణామ్నాయ శ్రీ శారదాపీఠం శృంగేరి. సాక్షాత్తూ ఆదిశంకరుల పాదస్పర్శతో, జగన్మాత శ్రీ శారదాంబ గజ్జెల సవ్వడితో ఇక్కడి అణువణువూ దేవతా స్వరూపంగా మారిపోయింది. ఆ పేరు వింటేనే ఏదో మహిమగల శక్తి మన శరీరంలోకి ప్రవేశిస్తుంది. అలాంటి పుణ్యస్థలంలో ఆదిశంకరులవారు ప్రప్రథమ ఆమ్నాయపీఠంగా యజుర్వేద పీఠాన్ని దక్షిణామ్నాయ శ్రీ శారదాపీఠంగా స్థాపించారు. (విభాండక మహర్షి కుమారుడు ఋష్యశృంగుడు తపస్సు గావించిన పుణ్యదేశం శృంగగిరి కాలక్రమేణా శృంగేరిగా మారింది.) మరి అలాంటి పుణ్యప్రదేశానికి వెళ్లటం మనందరి పూర్వజన్మ సుకృతంగా భావించాలి.

త్రిమూర్తి స్వరూపం మొదటి పరంపరగా కొనసాగగా తర్వాత ఆదిశంకరులవారు కొనసాగించి విదేహముక్తి పొందే ముందు శ్రీ సురేశ్వరాచార్యుల వారికి పీఠ నిర్వహణ అప్పచెప్పారు. అక్కడి నుంచి వారి శిష్యుల పరంపర అవిచ్ఛిన్నంగా కొనసాగుతూ నేటికి 36వ పీఠాధిపతిగా పీఠాధిరోహణం గావించిన శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామివారిచే పీఠాధిపత్యం కొనసాగుతున్న ఈ పీఠానికి 37వ పీఠాధిపతిగా జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ స్వామి వారిని మహాసన్నిధానం వారు నియమించారు.

అలాంటి ఈ మహిమాన్వితమైన పీఠంలో ఉన్న మహాసన్నిధానం వారి చల్లని దీవెనలతో నాకు జరిగిన కొన్ని మహిమలను పాఠకులకు ఈ సందర్భంగా తెలియజేయటం నా బాధ్యతగా భావిస్తున్నాను.

### నా అనుభవాలు

అది 2002 సంవత్సరం. అప్పటి శృంగేరీ పీఠ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి ఆకెళ్ల సత్యనారాయణమూర్తి గారితో ప్రప్రథమంగా జగద్గురువుల దర్శనానికి బయలుదేరాను. ఒక పక్క తెలియని భయం, మరో పక్క ప్రపంచంలోనే అతిపెద్ద పీఠాధిపతిని చూడబోతున్నాననే ఆనందం. జగన్మాత, జగద్గురువుల దర్శనం అయింది. పరిచయాలు అయ్యాక, పాదపూజ భిక్షావందనం

చేసుకున్నాం.

"ఎప్పుడు వెళ్తున్నారు" అన్నారు స్వామివారు.

"ఈరోజు సాయంత్రం గురువుగారు" అన్నాను.

"ఈరోజు ఉండండి గురువుగారు చెప్తున్నారు" అన్నారు.

నేను మా సభ్యుల వంక చూసి...

"శెలవు రేపటి వరకే స్వామీ... మీరు మంత్రాక్షతలు ఇస్తే వెళ్తాం" అన్నాను.

మళ్ళీ గురువుగారు కాస్తంత ప్రేమతో "గురువుగారు చెప్తున్నారు. రేపు సాయంత్రం వెళ్ళండి" అన్నారు.


మేం ఒకరి మొహాలు ఒకరం చూసుకున్నాం. మమ్మల్ని మళ్ళీ పిలిచి, గురువుగారు -

"టిక్కెట్ల గురించి ఆలోచించక, వాటిని ఆపేసి తిరిగి తీసుకోండి" అన్నారు.

స్వామివారు అన్నిసార్లు చెప్పాక ఎందుకు లెమ్మని ఆగాం. మర్నాడు పొద్దున పేపర్లు చూస్తే నిన్న మేం వెళ్ళాల్సిన రైతు పట్టాలు తప్పింది. మేం ఎక్కవలసిన బోగీ, పక్క బోగీ రెండూ దెబ్బ తిన్నాయి. 30 మందికి గాయాలయ్యాయి. వెంటనే ఒక్కసారి ఒళ్ళు గగుర్పొడిచింది.

ఉదయం గురువుగార్ని కలిసాం. మా వైపు చూస్తూ చిరునవ్వుతో మంత్రాక్షతలు ఇస్తూ...

"ప్రతి నెలా గురువుగారి దర్శనానికి వస్తుం డండి. అంతా మంచి జరుగుతుంది" అన్నారు. ఆ రోజు నుండి ఇప్పటి వరకు సంవత్సరానికి సుమారు 10 సార్లు క్రమం తప్పకుండా వెళుతుంటాము.



## శ్రీమతి అనారోగ్యం... చిటికెలో మాయం

2010 సంవత్సరం ఏప్రిల్ 25న జరిగిన ఆరోగ్య పరీక్షలలో నా భార్య శారదకు ఎడినో కార్సినోమా అని (ముక్కు లోపల క్యాన్సర్) అని డాక్టర్లు చెప్పారు. జీవితం చీకటి. అంతా అయోమయం. ఈ సమస్య నుంచి నా భార్యను ఎలా కాపాడుకోవాలో అని ఆలోచిస్తూ నిద్ర రాకపోయినా అలాగే పడుకున్నా. కలలో జగద్గురువులు నా భార్యకు పూర్తి ఆరోగ్యం చేకూరుతుందని ఆశీర్వదిస్తున్నారు. అదాటున ఒక్కసారిగా లేచా. అప్పుడు అనుకున్నా తెల్లవారగానే శృంగేరికి బయలుదేరాలని. వెంటనే జగద్గురువుల దర్శనానికి వెళ్ళా (అప్పటికే జగద్గురువులు సైనిక్‌పురి శృంగేరి శంకర మఠానికి నన్ను ధర్మాధికారిగా నియమించారు) నన్ను దూరం నుంచి చూడగానే జగద్గురువులు కనిపెట్టేశారు. దగ్గరికి వెళ్ళా.

"బాగున్నారా?" అని ఆప్యాయంగా పలకరించారు గురువుగారు.

"స్వామీ! నా భార్యకు సమస్య వచ్చింది. అనారోగ్యం. తను అలా బాధపడుతుంటే నేను మఠనిర్వహణ సరిగా చేయలేను. తను ఆరోగ్యంగా ఉండేలా చేయండి. ఈ మందులు తెచ్చాను. తమరు ఆశీరనుగ్రహం అందించి వ్యాధి నయం అయ్యేలా చేయండి. ఇదే నా కోరిక" అన్నాను.

వెంటనే స్వామివారు ఆ మందుల్ని తీసుకుని వాటిమీద తీర్థం చల్లి, "మీకు పరిపూర్ణంగా ఆశీస్సులు ఇస్తున్నాం. ఆ శారదాచంద్రమౌళీశ్వరులు, శ్రీ శారదాంబ చల్లగా చూస్తారు" అని మందులు అందించారు. (ఈ సన్నివేశం రాస్తుంటే నాకు తెలియకుండానే కన్నీళ్ళు వస్తున్నాయి... తన్మయత్వంతో ఆశ్చర్యం కలుగుతున్నది.)

అంతే- వెంటనే గురునివాస్‌లో ఆ మందులు వాడడం ప్రారంభించింది. కొన్ని రోజులకు పరీక్ష చేయించా. అంతా నార్మల్ ఇప్పటికీ తను బాగా ఉంది. మరి వారు భగవత్ స్వరూపం కాక ఇంకేమిటి?

## జగద్గురువుల వాక్కు.. దైవవాక్కు

నా సహ పాత్రికేయుడు జగన్ ఆర్థికంగా పర్లేదు. ఒక్కడే



అబ్బాయి. చదువులో బెస్ట్. తనకూ ఎప్పట్నుంచో జగద్గురువులను చూడాలని. అవకాశం, అవసరం రెండూ వచ్చాయి. ఒకరోజు నేను చెప్పా "జగన్! శృంగేరి గురువుగారి దర్శనానికి వెళుతున్నా, వస్తావా?" అని. ముందు కాస్త ఆలోచించారు. తరువాత సరే అన్నాడు. ప్రయాణానికి సిద్ధం అయ్యాం. వాళ్ళబ్బాయిది ఎంసెట్ పరీక్షల హాల్ టిక్కెట్ తీసుకుని వస్తున్నా అని నాతో చెప్పాడు. గురువుగారి దీవెనలు కావాలన్నాడు. శృంగేరి వెళ్ళాం. జగద్గురువుల దర్శనం లభించింది. జగన్‌ని స్వామివారికి పరిచయం చేశా.

"స్వామీ! నా సహచర ఉద్యోగి. వాళ్ళబ్బాయి ఎంసెట్ పరీక్ష హాల్ టిక్కెట్. మంచి ర్యాంక్ రావాలి. ఉచిత సీటు రావాలి. అన్ని ఇబ్బందులు పోయే విధంగా ఇంజనీరింగ్ చదివి మంచి ఉద్యోగం వచ్చేలా దీవించండి" అని ప్రాధేయపడ్డా గురువుగార్ని.

స్వామివారు చేతిలో హాల్ టిక్కెట్ పెట్టుకుని-

"గురువుగారు పరిపూర్ణంగా ఆశీర్వదిస్తున్నారు. అన్నీ మీరనుకున్నట్టుగానే జరుగుతాయి" అంటూ మంత్రాక్షతలు, హాల్‌టిక్కెట్ జగన్ చేతిలో పెట్టారు. పరీక్షలయిపోయాయి. గురువుగారి దీవెనలు ఫలించాయి. రెండు వేల లోపు ర్యాంక్ వచ్చింది. వాళ్ళింటి దగ్గర జె.ఎన్.టి.యు.లో ఎం.టెక్ (మెకానికల్) బెస్ట్ ర్యాంక్‌తో పూర్తి చేశాడు. గురువుగారు చెప్పినట్టే 'ఒరాకిల్'లో ఉద్యోగం. విచిత్రమేమంటే, ఆ ఉద్యోగం కూడా వాళ్ళింటికి కాస్తంత దూరంలో. అందుకే గురువుగారి వాక్కు దైవ వాక్కు. జగద్గురువులకి వారి మహిమలకి నమస్కారాలు.

+++

2013 డిసెంబర్ 30. సైనిక్‌పురి శృంగేరి శంకరమఠానికి జగద్గురువులు మహాసన్నిధానం వారి రాక. వేల సంఖ్యలో జనం... స్వామివారి పరివారం. మఠం ప్రాంగణం లోపలే శ్రీ శారదాంబ సన్నిధానం ఎదురుగా జగద్గురువులు ఆశీనులయ్యారు. ఫ్యాన్లు తిరుగుతున్నాయి. ఎయిర్‌కూలర్లు పనిచేస్తున్నాయి. స్వామివారి పక్కన నిలబడ్డ మాకు స్వామివారి పరివారానికి చెమటలు కక్కుతున్నాయి. బట్టలు తడిసిపోతున్నాయి. తుడుచుకుంటున్నాము. నుదుట భస్మం కరిగిపోయింది. జనప్రవాహం. స్వామివారి దర్శనానికి వస్తున్న వేలకొలది భక్తుల్ని ఆశీర్వదిస్తూ ప్రసాద వితరణ చేస్తున్నారు. అయినా స్వామివారికి మాత్రం కాస్తంత కూడా చెమట పట్టలేదు. వస్త్రాలు తడవలేదు. ముఖాన, శరీరం మీద భస్మపు పుండరీకాలు కాస్తంత కూడా కనుమరుగు కాలేదు. అలా చిరునవ్వుతోనే భక్తులకు సమాధానం చెబుతున్నారు. మనం పురాణాల్లో చదువుకున్నాం. దేవతాస్వరూపులకు చెమట పట్టదని, ఇప్పుడు ప్రత్యక్షంగా చూశాం. స్వామివారు అంగీకరించకపోతే ఒక్క ఫోటో కూడా రాదు. అప్పుడప్పుడు నా మనస్సు బాగోలేనప్పుడు అప్పటి ఆ వీడియో చూస్తూ, స్వామివారికి దణ్ణం పెట్టుకుంటూ ఉంటాను. వారే నా శ్వాస- నా ప్రాణం - నా జీవితం. మరోసారి గురువుగారికి సాష్టాంగ ప్రణామాలతో.

**- పండరినాథ్**
ధర్మాధికారి, శృంగేరి శంకరమఠం
సైనిక్‌పురి, సికింద్రాబాద్

# దర్శనమ్
ఆధ్యాత్మిక వార్తామాసపత్రిక

బ్ర॥శ్రీ దివ్యజ్ఞాన సిద్ధాంతి గారు, పుత్రులు బ్ర॥శ్రీ గౌరీభట్ల రామకృష్ణశర్మ సిద్ధాంతి, శ్రీ సిద్ధకుంజికా పీఠము
శ్రీ మహాకాల మందిరము, విశ్వం విహార్, మేడిపల్లి (ఔదుంబరపురి),డిమార్ట్ ఎదురుగా, హైదరాబాద్, ఫోన్ : 94403 50868, 8008513203

శ్రీ విశ్వావసు సం ॥ దక్షిణాయణం
హేమంత ఋతువు
మార్గశిర శు.ఏకాదశి - పుష్య శు.ద్వాదశి

## డిశంబర్ DECEMBER 2025

ఉ: ఉదయం, మ: మధ్యాహ్నం, సా: సాయంత్రం, రా: రాత్రి, తె: తెల్లవారుఝామున, వ: వర్జ్యము, శే.వ.: శేషవర్జ్యము, ల: నుండి

| | | | | | |
|---|---|---|---|---|---|
| SUN ఆది<br>రాహు కాలం సా. 4.30 మొ 6.00<br>యమగండ కాలం మ. 12.00 మొ 1.30<br>వారదుర్ముహూర్తం సా. 4.24 మొ 5.12 | 15.1.2026<br>సంక్రాంతి<br>23.1.2026<br>వసంత పంచమి<br>15.2.2026<br>మహాశివరాత్రి | **7**<br>తదియ రా.10.36<br>ఆరుద్ర ఉ.10.19<br>వ.రా.9.45ల11.16 | **14**<br>దశమి రా.8.11<br>హస్త ఉ.10.42<br>వ.రా.7.14ల8.58 | **21**<br>పాడ్యమి ఉ.7.55<br>పూర్వాషాఢ రా.3.00<br>వ.ఉ.11.24ల1.08 | **28**<br>అష్టమి ఉ.7.23<br>త.నవమి రా.తె.5.39<br>రేవతి రా.3.59<br>వ.సా.4.33ల6.04 |
| MON సోమ<br>రాహు కాలం ఉ.7.30 మొ 9.00<br>యమగండ కాలం ఉ.10.30 మొ 12.00<br>వారదుర్ముహూర్తం మ. 12.24 మొ 1.12<br>మ. 2.48 మొ 3.36 | **1** మార్గశిర మాసం శుక్ల పక్షం<br>ఏకాదశి మ.2.00<br>రేవతి రా.7.35<br>వ.ఉ.8.10ల9.41 | **8**<br>చవితి రా.8.56<br>పునర్వసు ఉ.9.10<br>వ.సా.4.48ల6.21 | **15**<br>ఏకాదశి రా.9.44<br>చిత్త మ.12.35<br>వ.సా.6.37ల8.22 | **22**<br>విదియ ఉ.9.16<br>ఉత్తరాషాఢరా.తె.4.32<br>వ.ఉ.11.26ల1.08 | **29**<br>దశమి రా.3.32<br>అశ్విని రా.2.36<br>వ.రా.10.45ల12.15 |
| TUE మంగ<br>రాహు కాలం మ. 3.00 మొ 4.30<br>యమగండ కాలం ఉ. 9.00 మొ 10.30<br>వారదుర్ముహూర్తం ఉ. 8.24 మొ 9.12<br>రా. 10.48 మొ 11.36 | **2**<br>ద్వాదశి మ.12.00<br>అశ్విని సా.6.10<br>వ.మ.2.20ల3.50<br>తి.రా.3.08ల4.38 | **9**<br>పంచమి రా.737<br>పుష్యమి ఉ.8.18<br>వ.రా.8.47ల10.21 | **16**<br>ద్వాదశి రా.11.38<br>స్వాతి మ.2.51<br>వ.రా.8.57ల10.43 | **23**<br>తదియ ఉ.10.14<br>శ్రవణం రా.తె.5.40<br>వ.ఉ.8.48ల10.29 | **30**<br>ఏకాదశి రా.1.20<br>భరణి రా.1.04<br>వ.ఉ.11.35ల1.05 |
| WED బుధ<br>రాహు కాలం మ. 12.00 మొ 1.30<br>యమగండ కాలం ఉ. 7.30 మొ 9.00<br>వారదుర్ముహూర్తం ఉ. 11.36 మొ 12.24 | **3**<br>త్రయోదశి ఉ.9.45<br>భరణి సా.4.35<br>వ.రా.3.46ల5.15 | **10**<br>షష్ఠి సా.6.47<br>ఆశ్లేష ఉ.7.52<br>వ.రా.7.52ల9.28 | **17**<br>త్రయోదశి రా.1.47<br>విశాఖ సా.5.23<br>వ.రా.9.55ల11.42 | **24**<br>చవితి ఉ.10.38<br>ధనిష్ఠ ఉ.6.14<br>వ.ఉ.9.51ల11.29 | **31**<br>ద్వాదశి రా.10.57<br>కృత్తిక రా.11.23<br>వ.మ.12.14ల1.43 |
| THU గురు<br>రాహు కాలం మ. 1.30 మొ 3.00<br>యమగండ కాలం ఉ. 6.00 మొ 7.30<br>వారదుర్ముహూర్తం ఉ. 10.00 మొ 10.48<br>మ. 2.48 మొ 3.36 | **4**<br>చతుర్దశి ఉ.7.28<br>కృత్తిక మ.2.57<br>వ.రా.తె.5.53 | **11**<br>సప్తమి సా.6.22<br>మఖ ఉ.7.51<br>వ.మ.3.54ల5.32 | **18**<br>చతుర్దశి రా.తె.4.02<br>అనూరాధ రా.8.02<br>వ.రా.2.09ల3.55 | **25**<br>పంచమి ఉ.10.29<br>శతభిషం ఉ.6.16<br>వ.మ.1.27ల3.03 | |
| FRI శుక్ర<br>రాహు కాలం ఉ. 10.30 మొ 12.00<br>యమగండ కాలం మ. 3.00 మొ 4.30<br>వారదుర్ముహూర్తం ఉ. 8.24 మొ 9.12<br>మ. 12.24 మొ 1.12 | **5** ○<br>పూర్ణిమ రా.తె.5.05<br>రోహిణి మ.1.15<br>శే.వ.ఉ.7.22<br>తి.సా.6.24ల7.54 | **12**<br>అష్టమి సా.6.25<br>పుబ్బ ఉ.8.16<br>వ.మ.3.45ల5.25 | **19** ●<br>అమావాస్య ఉ.6.09<br>జ్యేష్ఠ రా.10.37<br>వర్జ్యంలేదు | **26**<br>షష్ఠి ఉ.9.54<br>పూర్వాభాద్రరా.తె.5.54<br>వ.మ.12.39ల2.14 | |
| SAT శని<br>రాహు కాలం ఉ. 9.00 మొ 10.30<br>యమగండ కాలం మ. 1.30 మొ 3.00<br>వారదుర్ముహూర్తం ఉ. 6.00 మొ 7.36 | **6** మార్గశిరం కృష్ణ పక్షం<br>పాడ్యమి రా.2.42<br>త.విదియ రా.12.30<br>మృగశిర ఉ.11.40<br>వ.రా.7.36ల9.07 | **13**<br>నవమి రా.7.05<br>ఉత్తర ఉ.9.14<br>వ.సా.6.09ల7.51 | **20** పుష్యమాసం శుక్ల పక్షం<br>పాడ్యమి పూర్తి<br>మూల రా.1.00<br>వ.రా.11.09ల1.00 | **27**<br>సప్తమి ఉ.8.51<br>ఉత్తరాభాద్రరా.తె.5.07<br>వ.మ.3.11ల4.44 | |

| తేది | సూ.ఉ. | సూ.అ. |
|---|---|---|
| 1 | 6.14 | 5.44 |
| 5 | 6.16 | 5.43 |
| 10 | 6.18 | 5.41 |
| 15 | 6.21 | 5.40 |
| 20 | 6.24 | 5.39 |
| 25 | 6.26 | 5.39 |
| 30 | 6.29 | 5.39 |

### పండుగలు

1 సర్వేషాం ఏకాదశి గీతాజయంతి
2 శ్రీహనుమద్వ్రతం
4 శ్రీదత్తాత్రేయజయంతి
8 సంకష్టహరచతుర్థి
15 సర్వేషాం ఏకాదశి మూలకార్తి
16 ధనుస్సంక్రమణం ధనుర్మాసవ్రతారంభం
18 మాసశివరాత్రి
26 క్రిస్టమస్ ఈవ్
25 క్రిస్టమస్
26 బాక్సింగ్ డే
28 పూర్వాషాఢకార్తి
30 సర్వేషాం ముక్కోటి వైకుంఠ ఏకాదశి

### మీ కోసం...

1. 
2. 
3. 
4. 
5. 
6. 
7. 
8. 
9. 
10. 
11. 
12. 
13. 
14. 
15. 
16. 
17. 
18. 
19. 
20. 
21. 
22. 
23. 
24. 
25. 
26. 
27. 
28. 
29. 
30. 
31. 

# లలితా సహస్రనామ స్తోత్రం (సరళ వ్యాఖ్య)



ఆచార్య కుప్పా విజయశ్రీ

(గత సంచిక తరువాయి)

**258. యోగినీ యోగదా యోగ్యా యోగానందా యుగంధరా**

శ్రీచక్రములో ఉన్న యోగినుల స్వరూపము శ్రీమాత. ధ్యానమనే యోగము నిచ్చి దాని ద్వారా తెలియబడేది శ్రీమాత. ఆ ధ్యాన యోగమందు సాధకుల ఆనంద స్థితి అయిన యోగానంద స్వరూపము శ్రీమాత. సృష్టి చేయుట కొరకు శివుడు, శక్తి అనే యుగళ రూపం ధరించింది.

ఈ నామ పారాయణతో ధ్యాన యోగం అలవడుతుంది.

**259. ఇచ్ఛాశక్తి జ్ఞానశక్తి క్రియాశక్తి స్వరూపిణి**

సాధకుల ప్రతీ సంకల్పంలోనూ ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తుల రూపంలో ఉంటుంది శ్రీమాత.

ఈ నామ పారాయణతో సంకల్ప సిద్ధి, కార్య సిద్ధి లభిస్తాయి.

**260. సర్వాధారా సుప్రతిష్ఠా సదసద్రూప ధారిణీ**

సమస్త జగత్తుకు ఆధారమైన శ్రీమాత సత్ (కనిపించేవి) అసత్ (కనిపించనివి) రూపాలతో సృష్టి అంత సుప్రతిష్ఠితమై ఉంది.

ఈ నామపారాయణతో ఆర్తులకి ఏదో ఒక ఆధారం లభించి పరిష్కారం దొరుకుతుంది.

**261. అష్టమూర్తి రజాజైత్రీ లోకయాత్రా విధాయినీ**

పంచభూతాలు, సూర్య చంద్రులు, యజ్ఞము అనే ఎనిమిది రూపాలలో శక్తి శ్రీమాత. పుట్టుకయే లేని శ్రీమాత సృష్టి, స్థితి, లయలను పద్నాలుగు లోకాలలో నిర్వ హిస్తూ సర్వత్రా జయము పొందుతుంది.

ఈ నామపారాయణతో గ్రహ దోషాలు తొలగి శుభాలు చేకూరతాయి.

**262. ఏకాకినీ భూమరూపా నిర్ద్వైతా ద్వైతవర్జితా**

మొత్తం సృష్టిని ఏకాకిగా తానే నిర్వహిస్తుంది శ్రీమాత. భూమరూపము అంటే పరబ్రహ్మ స్వరూపిణి. కనిపించే ప్రపంచం ద్వైతం. దానికి వ్యతిరేకమైన అద్వైతమే శ్రీమాత. జీవాత్మ పరమాత్మ అనే భేదం లేనిది శ్రీమాత.

ఈ నామపారాయణతో ఏకాగ్రత అలవడుతుంది.



**263. అన్నదా వసుదా వృద్ధా బ్రహ్మాత్మైక్య స్వరూపిణీ**

భుజించడానికి అన్నము, అనుభ వించడానికి ఐశ్వర్యము ప్రసాదించేది శ్రీమాత. పండు ముత్తైదువలు అందరూ శ్రీమాత స్వరూపాలే. బ్రహ్మ, ఆత్మ రెండు ఒకటయిన స్వరూపం శ్రీమాత.

ఈ నామపారాయణతో ధనధాన్యాలు, ఐశ్వర్యము లభిస్తాయి.

**264. బృహతీ బ్రాహ్మణీ బ్రాహ్మీ బ్రహ్మానందా బలిప్రియా**

సృష్టిలోకెల్లా బృహత్ రూపం శ్రీమాత. వేదమూర్తులలో ఉండే శక్తి బ్రాహ్మణి. బ్రాహ్మి అనగా సరస్వతీ దేవి - శ్రీమాత అంశ. అలవికాని ఆనందస్వరూపమే శ్రీమాత. పూజా సమయంలో నైవేద్యముగా సమర్పించే పదార్థాన్ని బలి అంటారు. ఆ బలి అంటే శ్రీమాతకు ప్రీతి.

ఈ నామపారాయణతో సరస్వతి కటాక్షం కలుగుతుంది.

**265. భాషారూపా బృహత్సేనా భావాభావ వివర్జితా**

అన్ని భాషలూ శ్రీమాత స్వరూపాలే. సంకల్ప మాత్రం చేతనే అపారమైన సేనలను సృష్టించినది శ్రీమాత. భావనకి, అభావనకి దూరంగా ఉండేది శ్రీమాత.

ఈ నామపారాయణతో భాష మీద పట్టు వస్తుంది.

**266. సుఖారాధ్యా శుభకరీ శోభనా సులభాగతిః**

ఏ ఆరాటాలు లేకుండా హాయిగా శుభములు ఇచ్చే శ్రీమాతని ఆరాధించ వచ్చు. మంగళ కార్యాలు చేయించే శ్రీమాత భక్తులకు సులభంగా ప్రసన్న మవుతుంది.

ఈ నామపారాయణతో శ్రీమాతని సులభంగా ఆరాధించి శుభకార్యాలు చేసుకుంటారు.

ఈ క్రింది రెండు నామాల పారాయణతో నిరుద్యోగులకు ఉద్యోగం లభిస్తుంది.

**267. రాజరాజేశ్వరీ రాజ్యదాయినీ రాజ్యవల్లభా**

కుబేరుడు, ఇంద్రుడు మొదలైన రాజరాజులందరికీ ఈశ్వరి రాజరాజేశ్వరి. అందరికీ రాజ్యాలను ప్రసాదించింది

శ్రీమాతే. శ్రీచక్ర మహా సామ్రాజ్యానికి శ్రీమాత అధినేత్రి (వల్లభ)

**268. రాజత్కృపా రాజపీఠ నివేశిత నిజాశ్రితాః**

రాజ్యాలు ఏర్పరచి వాటిని నడపడానికి శక్తిని ప్రసాదించడం రాజత్కృప. తనను ఆశ్రయించిన భక్తులను రాజపీఠంపై కూర్చోపెడుతుంది.

**269. రాజ్యలక్ష్మీః కోశనాథా చతురంగ బలేశ్వరీ**

**270. సామ్రాజ్యదాయినీ సత్యసంధా సాగర మేఖలా**

సమస్త లోకాలలో వ్యాపించి తనని ఆశ్రయించిన వారికి ఆనందాన్ని ప్రసాదించే లక్ష్మి రాజ్యలక్ష్మి. శ్రీమహారాజ్ఞి అయిన శ్రీమాత తనని ఆశ్రయించిన భక్తులకు రాజ్యపాలనకు కావాల్సిన అర్హతలు - సముద్ర పర్యంతము ఉండే సామ్రాజ్యము, సత్య వాక్పరిపాలన, సర్వ సంపదలు, అంగబలము, అర్థబలము ప్రసాదిస్తుంది.

ఈ నామపారాయణతో అంగబలము, అర్థబలము లభిస్తాయి.

ఈ క్రింది మూడు నామాల పారాయణతో లోకవశీకరణ, సర్వార్థ సాధన కలుగుతాయి.

**271. దీక్షితా దైత్యశమనీ సర్వలోక వశంకరీ**

**272. సర్వార్థదాత్రీ సావిత్రీ సచ్చిదానంద రూపిణీ**

శ్రీమాత గురురూపంతో మంత్రదీక్షని ఇచ్చి భక్తులలో అధర్మ తత్వాన్ని పోగొట్టి, ధర్మార్థకామమోక్షాలని అనుగ్రహించి, సమస్త లోకాలను వశం చేసుకునే శక్తిని ఇస్తుంది. సూర్యునికి ప్రకాశించే శక్తిని ఇచ్చే సావిత్రి దేవత శ్రీమాత. నిరతిశయ ఆనంద స్వరూపం.

ఈ నామాల పారాయణతో సర్వలోక వశీకరణ లభిస్తుంది.

**273. దేశకాలా పరిచ్ఛిన్నా సర్వగా సర్వమోహినీ**

సమస్త లోకాలనీ మోహింపజేస్తూ, సమస్త దిక్కులలోను గమనం కల శ్రీమాతకి దేశము, కాలము అనే పరిమితులు లేవు.

**274. సరస్వతీ శాస్త్రమయీ గుహాంబా గుహ్యరూపిణీ**

సకల శాస్త్రాల సారమైన శ్రీమాతని తెలుసుకోవాలంటే జ్ఞానానికి అధినేత్రి అయిన సరస్వతీ దేవిని ఉపాసించాలి. హృదయస్థానంలో దహరాకాశం అనే గుహలో ఉండే శ్రీమాత రహస్య జ్ఞాన స్వరూపిణి.

ఈ నామ పారాయణతో విద్య, శాస్త్ర పాండిత్యము అబ్బుతాయి.

(సశేషం)

అద్భుతమైన స్తోత్ర సంపద, ఇప్పుడు మీకు అందుబాటులో ఈ వెబ్‌సైట్ లో !!

stotranidhi.com

తెలుగు । ಕನ್ನಡ । தமிழ் । देवनागरी । english

www.stotranidhi.com




- దేవ, ఋషి ప్రోక్త స్తోత్రములు
- మహా మహిమాన్వితమైన స్తోత్రములు
- అరుదుగా లభించే విశేష స్తుతులు
- పూజా విధానములు, వ్రతములు
- అష్టోత్తరములు, సహస్రనామములు
- స్వరసహిత వేద సూక్తములు
- సంధ్యావందనం, సుందరకాండ
- శ్రీమద్భగవద్గీత, దుర్గా సప్తశతీ
- కీర్తనలు, మంగళ హారతులు
- ... ఇంకా ఎన్నెన్నో !!

Scan this QR code to visit website

పూజా కార్యక్రమాలలో, పండుగ రోజులలో, ఆలయాలలో మరియు మీ దైవకార్యాలలో పఠించండి, తరించండి !!

Email: stotranidhi@gmail.com /stotranidhi Download on the App Store GET IT ON Google Play




## నవగ్రహాది జ్యోతిర్మండల స్వరూపము

(గత సంచిక తరువాయి)

యత్త్వైతద్భవతా ప్రోక్తం సో-హమిత్యేతదాత్మనః ।
వక్తుం న శక్యతే శ్రోతుం తన్మమేచ్ఛా ప్రవర్తతే ॥ 84
యో-స్తి సో-హమితి బ్రహ్మన్ కథం వక్తుం న శక్యతే ।
ఆత్మన్యేష న దోషాయ శబ్దో-హమితి యో ద్విజ ॥ 85

రాజు ఇట్లు చెప్పసాగినాడు. మీరన్నట్లు సమస్త కార్యాలకు ధర్మాధర్మాలు కారణమనుటలో ఎట్టి సందేహము లేదు. కర్మఫలాన్ని అనుభవించుటకై ఒకదేహం నుండి మొరియొక దేహాన్ని పొందుతున్నాడు. కాని సో-హమనేది చెప్పటకు వీలు కాదని మీరన్నారు కాని నాకు దానిని గురించి తెలిసికొవలెనని కోరికయుంది. బ్రాహ్మణుడా! కర్తృత్వ భోక్తృత్వరూపంతో ఉన్న ఆత్మగురించి ఎందువల్ల చెప్పరాదు. ఈ అహంశబ్దము ఆత్మయందు దోషకారణము కాదు గదా అని అన్నాడు.83-85

**బ్రాహ్మణ ఉవాచ :**

శబ్దో-హమితి దోషాయ నాత్మన్యేష తథైవ తత్ ।
అనాత్మన్యాత్మవిజ్ఞానం శబ్దో వా భ్రాంతిలక్షణః ॥ 86
జిహ్వా బ్రవీత్యహమితి దంతోష్ఠౌ తాలుకే నృప ।
ఏతే నాహం యతస్సర్వే వాఙ్నిష్పాదనహేతవః ॥ 87
కిం హేతుభిర్వదత్యేషా వాగేవాహమితి స్వయమ్ ।
అతః పీవానసీత్యేతత్ వక్తుమిత్థం న యుజ్యతే ॥ 88
పిండః పృథగ్యతః పుంసః శిరః పాణ్యాదిలక్షణః ।
తతో-హమితి కుత్రైతాం సంజ్ఞాం రాజన్ కరోమ్యహమ్ ॥ 89
యద్యంతో-స్తి పరః కో-పి మత్తః పార్థివసత్తమ ।
తదైషో-హమయం చాన్యో వక్తుమేవమపీష్యతే ॥ 90
యదా సమస్తదేహేషు పుమానేకో వ్యవస్థితః ।
తదా హి కో భవాన్ సో-హమిత్యేతద్విఫలం వచః ॥ 91


గౌరీభట్ల విట్ఠలశర్మ సిద్ధాంతి

బ్రాహ్మణుడిట్లు చెప్పసాగినాడు, నీవన్నట్లు అహంశబ్దంలో దోషమేమీ లేదు కాని ఆత్మకాని దానిని, ఆత్మయని అనుకొనుట మాత్రము భ్రాంతివల్ల కలుగుతుంది. అహమ్ అని నాలుక, దంతాలు, పెదవులు, తాలువులు చెప్పతాయి. ఇవన్నీ అహం అనే శబ్దనిష్పాదనకు కారణాలు కాని అహం కాదు. నాలుక మొదలైన కరణాల ద్వారా ఈ శబ్దమే స్వయంగా అంటున్నదంటే అదీ తగదు. అందువల్ల నీవు లావుగా వున్నావనుట తగదు. శిరస్సు, చేతులు, పాదాలు మొదలైన అవయవాల రూపమైన ఈ శరీరము ఆత్మకంటె భిన్నమైనది అప్పుడు ఈ అహంపదాన్ని నేను ఎక్కడ ప్రయోగించాలి. నాకంటె భిన్నుడు ఇంక ఎవరైనా ఉంటే, అప్పుడు ఇది నేను, ఇతడు, ఇతరుడని చెప్పటకు వీలౌతుంది. అన్ని దేహాలలో ఉన్న ఆత్మ ఒక్కటే యైనప్పుడు నీవు, నేను, అని పలుకుట వ్యర్థము. 86-91

త్వం రాజా శిబికా చేయం ఇమే వాహాః పురస్సరాః ।
అయం చ భవతో లోకో న సదేతన్న ఋపోచ్యతే ॥ 92
వృక్షాత్ దారు తతశ్చేయం శిబికా త్వదధిష్ఠితా ।
కిం వృక్షసంజ్ఞా వా-స్యాః స్యాత్ దారుసంజ్ఞా-థవా నృప ॥ 93
వృక్షారూఢో మహారాజో నాయం వదతి తే జనః ।
న చ దారుణి సర్వస్త్వాం బ్రవీతి శిబికాగతమ్ ॥ 94
శిబికా దారుసంఘాతో రచనాస్థితిసంస్థితః ।
అన్విష్యతాం నృపశ్రేష్ఠ తద్భేదే శిబికా త్వయా ॥ 95
ఏవం ఛత్రశలాకానాం పృథగ్భావే విమృశ్యతామ్ ।
క్వ యాతం ఛత్రమిత్యేష న్యాయస్త్వయి తథా మయి ॥ 96
పుమాంస్త్రీ గౌరజో వాజీ కుంజరో విహగస్తరుః ।

దేహేషు లోకసంజ్ఞేయం విజ్ఞేయా కర్మహేతుషు ॥ 97
పుమాన్న దేవో న నరో న పశుర్న చ పాదపః ।
శరీరాకృతిభేదాస్తు భూపతే కర్మయోనయః ॥ 98



నీవు రాజువు ఇది పల్లకి, నీముందున్నవారు పల్లకిమోసేవారు, వీరు నీ ప్రజలు, అని చెప్పుట పరమార్థతః సత్యము కాదు. వృక్షమునుండి కఱ్ఱ ఏర్పడింది. దానివల్ల నీవధిష్ఠించిన పల్లకి ఏర్పడింది అట్టి స్థితిలో దీన్ని వృక్షమందామా? కఱ్ఱ అని అందామా? నీ ప్రజలు నిన్ను మహారాజు వృక్షాన్ని అధిరోహించినాడని కాని కఱ్ఱను ఆరోహించినాడని కాని అనక నీవు పల్లకిలో ఉన్నట్లు చెప్తారు. మహారాజా! ఈ శిబిక, రచనా విశేషంతో ఉన్న కఱ్ఱల సమూహము. దానికంటె భిన్నమైనది అయితే కఱ్ఱలలో పల్లకి ప్రత్యేకంగా వెదకి చూడుము. ఇదేవిధంగా ఛత్రిలో శలాకలు అనుదానిలో భిన్నత్వాన్ని గమనింపుము. శలాకలను వేరుచేసి నా ఛత్రి ఎక్కడికి పోయినదన్నట్లు, నీలోను, నాలోను ఉన్న పంచభూతాలొక్కటే. పురుషుడు, స్త్రీ, ఆవు, మేక, గుఱ్ఱము, ఏనుగు, పక్షి వృక్షము మొదలైన లౌకికసంజ్ఞలను కర్మహేతువులైన శరీరములందే తెలిసికొనవలెను. జీవుడు దేవతకాడు, మనుష్యుడు కాదు, పశువు కాదు, వృక్షమూ కాదు. మహారాజా! ఇవియన్నీ కర్మయోనులైన శరీరాకృతి భేదాలు.92-98

వస్తు రాజేతి యల్లోకే యచ్చ రాజభటాదికమ్ ।
తథా-న్యచ్చ నృపేత్థం తన్న సత్సంకల్పనామయమ్ ॥ 99
యత్తు కాలాంతరేణాపి నాన్యసంజ్ఞాముపైతి వై ।
పరిణామాదిసంభూతాం తద్వస్తు నృప తచ్చ కిమ్ ॥ 100
త్వం రాజా సర్వలోకస్య పితుః పుత్రో రిపో రిపుః ।
పత్న్యాః పతిః పితా సూనోః కం త్వాం భూప వదామ్యహమ్ ॥ 101
త్వం కిమేతచ్ఛిరః కిం ను గ్రీవా తవ తథోదరమ్ ।
కిముపాదాదికం త్వం వై తవైతత్కిం మహీపతే ॥ 102
సమస్తావయవేభ్యస్త్వం పృథగ్భావవ్యవస్థితః ।
కో-హమిత్యత్ర నిపుణో భూత్వా చింతయ పార్థివ ॥ 103
ఏవం వ్యవస్థితే తత్త్వే మయా-హమితి భాషితుమ్ ।
పృథక్కరణనిష్పాద్యం శక్యతే నృపతే కథమ్ ॥ 104

లోకంలో వస్తువు, రాజు, రాజ భటుడు, ఇతరుడు, ఇవియన్నీ సంకల్పమాత్రములేకాని యథార్థము కాదు. కాలాంతరంలో కూడా పరిణామమువల్ల ఇంకొక సంజ్ఞను పొందనిదే సత్పదార్థము. అట్టి వస్తువు ఏమున్నది? సమస్త జనులకు నీవు మహారాజువు. తండ్రికి పుత్రుడవు. శత్రువుకు శత్రువువు. భార్యకు భర్తవు. పుత్రునకు తండ్రివి అట్టి నిన్ను ఏమని సంబోధించాలి. నీవంటే ఈ శిరస్సా? ఈ మెడనా? ఈ ఉదరమా? ఈ పాదాదికమా? మహారాజా! ఇవి నీకు ఏమైతాయి? ఈ సమస్తావయవములనుండి నీవు భిన్నుడుగా ఉన్నావు. అట్టి సమయమున సో-హ మనే దానిని జాగ్రత్తగా ఆలోచించుకొమ్ము. మహారాజా! ఆత్మతత్త్వమిట్లుండగా దీనిని తక్కినవాటిని నుండి వేరుచేసి ఏవిధంగా చెప్పాలి? అట్లే అహమ్ ఈవిధంగా ఉంటుందని ఎట్లు చెప్పాలని అన్నాడు. 99-104

శ్రీ విష్ణు మహాపురాణమున రెండవ యంశమున ''సూర్యాదిజ్యోతిర్మండలసంస్థానము'' యను ఎనిమిదవ అధ్యాయము.



# మీ రాశి




**మేషం** (అశ్వని 4 పాదాలు, భరణి 4 పాదాలు, కృత్తిక 1వ పాదం)

విదేశయాన ప్రయత్నాలకు అనుకూలంగా వుంటుంది. ప్రయాజణాలెక్కువ చేస్తారు. మెలకువగా నుండుట అవసరం. స్థానచలన మేర్పడే అవకాశాలుంటాయి. ఋణలాభం పొందుతారు. ఎలర్జీతో బాధపడేవారు జాగ్రత్తగా నుండాలి. ప్రయత్న కార్యాలకు ఆటంకాలుంటాయి. నూతనకార్యాలు ఆలస్యంగా ప్రారం భిస్తారు. అల్పభోజనం వల్ల అనారోగ్యాన్ని పొందుతారు. ఏదో ఒక విషయం మిమ్మల్ని మనస్తాపానికి గురిచేస్తుంది. వీలైనంతవరకు అసత్యానికి దూరంగా నుండుట మంచిది.




**వృషభం** (కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి 4 పాదాలు, మృగశిర 1,2 పాదాలు)

ప్రయత్నకార్యాలందు దిగ్విజయాన్ని పొందుతారు. ఆకస్మిక ధనలాభముంటుంది. కుటుంబం అంతా సంతోషంగా కాలక్షేపం చేస్తారు. ఒక ముఖ్యమైన పని పూర్తికావడంతో మిక్కిలి ఆనందిస్తారు. కీర్తి ప్రతిష్టలు పొందుతారు. శాశ్వత పనులకు శ్రీకారం చుడతారు. మానసికానందం లభిస్తుంది. గతంలో వాయిదా వేయబడిన పనులు పూర్తవు తాయి. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. వృత్తిరీత్యా అభివృద్ధిని సాధిస్తారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగానుంటాయి. కొన్ని జటిలమైన సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.




**మిథునం** (మృగశిర 3,4 పాదాలు, ఆరుద్ర 4 పాదాలు, పునర్వసు 1,2,3 పాదాలు)

నూతన కార్యాలకు చక్కని రూపకల్పన చేస్తారు. ఆకస్మిక ధనలాభముంటుంది. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా ఉంటుంది. బంధు, మిత్రులతో కలిసి విందులు, వినోదాల్లో పాల్గొంటారు. శుభవార్తలు వింటారు. మనోల్లాసాన్ని పొంది, ఆనందంగా కాలక్షేపం చేస్తారు. ఆకస్మిక ధనలాభముంటుంది. నూతన వస్తు ఆభరణాలను పొందుతారు. కీర్తిప్రతిష్ఠలు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో సంతోషంగా కాలక్షేపం చేస్తారు. ఇతరులకు ఉపకారం చేయుటకు వెనుకాడరు. ఋణబాధలు తొలగిపోతాయి. ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశాలుంటాయి.




**కర్కాటకం** (పునర్వసు 4వ పాదం, పుష్యమి 4 పాదాలు, ఆశ్లేష 4 పాదాలు)

ప్రయత్న కార్యాలన్నీ సంపూర్ణంగా ఫలిస్తాయి. ఆకస్మిక ధనలాభమేర్పడుతుంది. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. పిల్లలకు సంతోషాన్ని కలుగజేస్తారు. కళాత్మక వస్తువులను సేకరిస్తారు. బంధు, మిత్రులను కలుస్తారు. క్రొత్త కార్యాలకు చక్కని రూపకల్పన చేస్తారు. మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ వహించక తప్పదు. ప్రయత్న కార్యాలు ఆలస్యంగా సఫలమవుతాయి. వృత్తి, ఉద్యోగ రంగాల్లో అభివృద్ధి ఉంటుంది.



**సింహం** (మఖ 4 పాదాలు, పుబ్బ 4 పాదాలు, ఉత్తర 1వ పాదం)


కుటుంబంలో చిన్నచిన్న గొడవలు వచ్చే అవకాశం ఉంది, పరిస్థితిని మీ అదుపులో ఉంచుకోండి. ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం. ఆర్థిక ఇబ్బందులను అధిగమించుటకు ఋణప్రయత్నాలు చేస్తారు. బంధు, మిత్రుల సహాయసహకారాలు ఆలస్యంగా లభిస్తాయి. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరును. శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. ధనచింత ఉండదు. సమాజంలో గౌరవమర్యాదలు లభిస్తాయి. అన్ని విధాలా సుఖాన్ని పొందుతారు. మనస్సు చంచలంగా ఉంటుంది. అకాల భోజనం వల్ల అనారోగ్య బాధలనుభవిస్తారు.



**కన్య** (ఉత్తర 2,3,4 పాదాలు, హస్త 4 పాదాలు, చిత్త 1,2 పాదాలు)


అన్నికార్యములందు విజయాన్ని సాధిస్తారు. అంతటా సౌఖ్యాన్ని పొందుతారు. శత్రు బాధలుండవు. శుభవార్తలు వింటారు. గౌరవ, మర్యాదలు అధికమవుతాయి. అద్భుత శక్తి సామర్థ్యాలను పొందగలుగుతారు. కుటుంబంలో అభివృద్ధితో పాటు ఆకస్మిక ధనలాభముంటుంది. స్త్రీల మూలకంగా లాభాలుంటాయి. ప్రయత్న కార్యాలన్నింటిలో విజయం పొందుతారు. శుభవార్తలు వింటారు. ఆకస్మిక ధనలాభ ముంటుంది. కుటుంబం అంతా

సౌఖ్యంగా ఉంటారు. అత్యంత సన్నిహితులను కలుస్తారు. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. మిక్కిలి ధైర్య సాహసాలు కలిగివుంటారు. సూక్ష్మబుద్ధితో విజయాన్ని సాధిస్తారు.




**తుల** (చిత్త 3,4 పాదాలు, స్వాతి 4 పాదాలు, విశాఖ 1,2,3 పాదాలు)

శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు. శుభవార్తలు వింటారు. బంధు, మిత్రులతో కలిసి విందులు, వినోదాల్లో పాల్గొంటారు. ఆకస్మిక ధనలాభాన్ని పొందుతారు. నూతన వస్తు ఆభరణాలను ఖరీదు చేస్తారు. ముఖ్యమైన కార్యాలు పూర్తి అవుతాయి. ఋణప్రయత్నాలు ఫలించును. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగానుండక మానసికాందోళన చెందుతారు. స్త్రీలకు స్వల్ప అనారోగ్య బాధలుండును. విదేశయాన ప్రయత్నాలు అనుకూలిస్తాయి. అనారోగ్య బాధలు అధికమవుతాయి. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంటుంది.



**వృశ్చికం** (విశాఖ 4వ పాదం, అనూరాధ 4 పాదాలు, జ్యేష్ఠ 4 పాదాలు)

క్రొత్తకార్యాలు ప్రారంభిస్తారు. మానసికానందాన్ని పొందుతారు. ప్రతివిషయంలో వ్యయ, ప్రయాసలు తప్పవు. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంది. వృత్తిరీత్యా క్రొత్త సమస్యల నెదుర్కొంటారు. బంధు, మిత్రులతో కలహాలేర్పడకుండా జాగ్రత్త పడుట మంచిది. స్థిరాస్తులకు సంబంధించిన సమస్యలు పరిష్కరింపబడతాయి. నూతన గృహకార్యాలపై శ్రద్ధ వహిస్తారు. ఆకస్మిక ధనలాభంతో ఆనందిస్తారు. బంధు, మిత్రులతో కలిసి విందులు, వినోదాల్లో పాల్గొంటారు. దైవదర్శనం చేసుకుంటారు. ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవుతాయి.




**ధనుస్సు** (మూల 4 పాదాలు, పూర్వాషాఢ 4 పాదాలు, ఉత్తరాషాఢ 1వ పాదం)

అపకీర్తి రాకుండా జాగ్రత్తపడుట మంచిది. మనోల్లాసాన్ని పొందుతారు. సోదరులతో వైరమేర్పడకుండా మెలగాలి. తలచిన కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. ఆర్థిక ఇబ్బందులు ఆలస్యంగా తొలగిపోతాయి. నూతన వ్యక్తులజోలికి వెళ్లరాదు. స్థిరాస్తుల విషయంలో జాగ్రత్తగానుండుట మంచిది. ఒక అద్భుత అవకాశాన్ని కోల్పోతారు. నూతన వ్యక్తుల పరిచయమేర్పడుతుంది. ప్రయాణాలవల్ల లాభాన్ని పొందుతారు. తలచిన కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. నూతనకార్యాలు వాయిదా వేసుకోక తప్పదు. గౌరవ మర్యాదలకు లోపముండదు.




**మకరం** (ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం 4 పాదాలు, ధనిష్ఠ 1,2 పాదాలు)

సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారు. కుటుంబంలో సుఖసంతోషాలు అనుభవిస్తారు. నూతన వస్తు ఆభరణాలను పొందుతారు. ప్రయత్నకార్యాలన్నింటిలో విజయం సాధిస్తారు. శుభవార్తలు వింటారు. ధైర్యసాహసాలు ప్రదర్శిస్తారు. ఆకస్మిక ధనలాభయోగముంటుంది. ఆకస్మిక ధనలాభముంటుంది. కుటుంబంలో ఆనందోత్సాహాలు లభిస్తాయి. బంధు, మిత్రులతో కలుస్తారు. సమాజంలో గౌరవం లభిస్తుంది. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా నుంటారు. ప్రతి విషయంలో అభివృద్ధి ఉంటుంది. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు. కోపాన్ని అదుపులో ఉంచుకోవాలి.



**కుంభం** (ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం 4 పాదాలు, పూర్వాభాద్ర 3 పాదాలు)

కుటుంబకలహాలు దూరమవుతాయి. ప్రయత్నకార్యాలకు ఆటంకాలెదురవుతాయి. వృథా ప్రయాణాలవల్ల అలసట చెందుతారు. చెడు పనులకు దూరంగా వుండుట మంచిది. అందరితో స్నేహంగా నుండుటకు ప్రయత్నించాలి. ఆర్థిక ఇబ్బందులు స్వల్పంగా వుంటాయి. విదేశయాన ప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబంలో అనుకోకుండా లాభమేర్పడే అవకాశముంటుంది. అనారోగ్యబాధలు అధికమవుతాయి. ఆకస్మిక ధననష్టాన్ని అధిగమిస్తారు. ముఖ్యమైన వ్యక్తులను కలుస్తారు. ఋణప్రయత్నాలు సులభంగా ఫలిస్తాయి. కుటుంబంలో అనారోగ్యబాధలుండును. బంధు, మిత్రులతో వైరమేర్పడకుండా జాగ్రత్త పడుట మంచిది.



**మీనం** (పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర 4 పాదాలు, రేవతి 4 పాదాలు)

విందులు, వినోదాలకు దూరంగా నుండుట మంచిది. ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశముంది. మానసికాందోళనతో ఉంటారు. కుటుంబంలో మార్పును కోరుకుంటారు. ప్రతి చిన్న విషయంలో ఆటంకాలెదురగును. ఆరోగ్యం గూర్చి ప్రత్యేక శ్రద్ధ అవసరం. వృత్తిరీత్యా అనుకూల స్థానచలనం ఉంటుంది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. పోట్లాటలకు దూరంగానుండుట మంచిది. అనారోగ్య బాధలధిగమించుటకు ఔషధసేవ తప్పదు. స్థిరాస్తులకు సంబంధించిన విషయాల్లో తొందరపాటు పనికిరాదు. అనుకూల స్థానచలనం కలిగే అవకాశాలున్నాయి.

**- గౌరీభట్ల రామకృష్ణ శర్మ**

## పదసంపద-250

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | | ✡ | 4 | 5 | 6 | 7 |
| 8 | | | ✡ | 9 | | | | |
| 10 | | ✡ | 11 | ✡ | | ✡ | 12 | |
| | ✡ | 13 | | 14 | | 15 | ✡ | |
| ✡ | 16 | | ✡ | | ✡ | 17 | | ✡ |
| 18 | ✡ | 19 | | | 20 | | ✡ | 21 |
| 22 | | | ✡ | 23 | | ✡ | 24 | |
| | ✡ | 25 | 26 | | ✡ | 27 | | |
| 28 | | | | ✡ | 29 | | | |

పద సంపన్నులు

పేరు ____________________

విలాసం ____________________

____________________

పిన్ ____________ ఫోన్ ____________

పద సంపద సమాధానాలను ఈ నెల 15 తేదీలోగా మా చిరునామాకు పంపాలి.

**దర్శనమ్** ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక

ఇం.నెం. 29-105/4/1, న్యూ విద్యానగర్, నేరేడ్‌మెట్, సికింద్రాబాద్-56

మీ అభిప్రాయాలను baludarshanam@gmail.comకు పంపగలరు.

### పదసంపద-249 సమాధానాలు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 మే | 2 లు | 3 కొ | లు | పు | ✡ | 4 మే | 5 ధా | 6 వీ |
| ✡ | 7 చే | రి | ✡ | ✡ | 8 శ | ర | వ | ణా |
| 9 ప | ✡ | 10 వి | 11 శ్వా | 12 మి | త్రు | డు | ✡ | వా |
| 13 ర్యా | 14 ఆ | ✡ | 15 న | త్తి | ✡ | ✡ | 16 ప్ర | ద |
| 17 వ | హ్ని | క | ము | ✡ | 18 ప్ర | ✡ | 19 వా | న |
| 20 ర | కం | ✡ | ✡ | 21 ము | దా | 22 వ | హ | ము |
| ణం | ✡ | 23 వం | దే | మా | త | ర | ము | ✡ |
| ✡ | 24 కా | శీ | ✡ | క్య | ✡ | వా | ✡ | 25 వే |
| 26 పా | ఆ | ✡ | 27 మ | ణి | మా | ణి | క్యా | లు |

### నవంబర్ నెల విజేతలు

**రాయపెద్ది అప్పాశేషశాస్త్రి**
శ్రీనివాస నగర్, ఆదోని

**వనమాల రామలింగాచారి**
ప్రశాంత్‌నగర్, యాదగిరిగుట్ట

**గుళ్లపల్లి విజయకుమార్**
జిఎస్ రాజు రోడ్, విజయవాడ

**గుడి చంద్రశేఖర్**
పెద్దశంకరంపేట్, మెదక్ జిల్లా

**మత్స్యరాజ విజయలక్ష్మి**
సియాటెల్, అమెరికా

**కాశీభట్ల మంజులాదత్తా**
చందానగర్, హైదరాబాద్

# ఆధారాలు

### అడ్డం

1. ప్రమాణమైన (4)
2. నల్లత్రాచు (4)
8. యజ్ఞంలో అగ్నిమథనం చేసే ఉపకరణం అట్నుంచి ఇటు. (3)
9. స్వాధీనపరుచుకొనే విద్య(5)
10. వానరం (2)
12. వాని లాగే స్త్రీ వాచక సర్వనామం, మదము కలిగినది (2)
13. విష్ణుశర్మ లోకానికి అందించిన ఐదుభాగాల కథల సమూహారము (5)
16. న్యాయం, పశువుల క్షీరం (2)
17. మాట (2)
19. పితృపాదులు అన్న మాటకు మాయాబజార్ ప్రతిగా అందించిన కొత్త ప్రయోగం (5)
22. 'ఓసి తారా'! లో చక్కని చుక్క (3)
23. చేనుకు బహువచనం అటునుంచి (2)
24. వధింపదగిన (2)
25. వధింపదగిన వాడు అటిటయ్యాడు (3)
27. మందిర (3)
28. కదిలేటికి వ్యతిరేకం(4)
29. మొదటి(ఉన్నత) పీఠం(4)

### నిలువు

1. జీవ సమూహము (4)
2. వాయుసుతుడొక వాహన సంస్థకు పేరైనాడు (3)
3. ముత్యము యొక్క విశేషణం తలకిందులుగా(2)
4. వటువు అధ్యయనంకోసం పూర్వం చేసే యాత్ర,ఇప్పుడు పెళ్లికి ముందు వరుడు తంతుగా చేస్తానేనే యాత్ర(4)
5. తలకిందులైన స్వప్నం (2)
6. కలహభోజనుణ్ణి పిలుద్దామా! (3)7. మంచి లక్షణాలకు నిలయమైనవాడు, శ్రీ నాథుని కాశీ ఖండంలో ఒక గొప్ప పాత్ర (4)
11. హంస మరోలా (2)
13. బాలసుబ్రహ్మణ్యం గారి ఇంటి పేరులో కొంత (5)
14. అజ్ఞాతవాసంలో సహదేవుని పేరు (5)
15. తాపసులు (3)
18. లోకమంతా పచ్చగా కనపడేలా చేసేది (4)
20. తలక్రిందులైన తిక్తం (2)
21. చదవడమనే సామా న్యార్థమే కాదు గురుముఖతః విద్యను నేర్చుకోవడం (4)
24. ఉన్న చోటు వదిలి వేరే ప్రాంతాలకు వెళ్ళడం (3)
26. అడివి, అడివియందుండే వాడు (2)
27. తేజో (తాజ్)మహల్ ఇక్కడే ఉంది (2)

**పద సంపాదకులు : ఎం. దత్తాత్రేయశర్మ**

Edited Printed, Published and Owned by Marumamula Rukmini, Printed at Capital Graphics, 118 Chenoy Trade Centre, Parklane, Secunderabad-500003, Published at 601, Chenoy Trade Centre, Parklane, Secunderabad-500003, Editor: Marumamula Rukmini.




హరేరామ హరేరామ రామరామ హరేహరే హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే

# శతకోటి హరేరామ నామ జపయజ్ఞము

శ్రీశ్రీశ్రీ అవధూతేంద్ర సరస్వతీ స్వామివారి శిష్యబృందం మరియు
శ్రీపాండురంగాశ్రమ భగవత్సేవా సమాజము గ్రామ శాఖల భక్తబృందముల వారిచే

# అఖండ హరేరామ నామ సప్తాహము

## హరేరామ నామ జపము

# 121

## కోట్లు పూర్తి

శ్రీవిశ్వావసు - పుష్య శుద్ధ చవితి,
తేదీ 24.12.2025, బుధవారము
నుండి ..
ద్వాదశి, తేదీ 31.12.2025, బుధవారము
వరకు ...
అఖండ హరేరామ నామ సప్తాహము
సాద మండపములో జరుగును

భక్తులెల్లరూ విచ్చేసి, కార్యక్రమములో పాల్గొని
శ్రీరుక్మిణీ పాండురంగస్వామి వారిని దర్శించి
స్వామివారి కృపకు పాత్రులు కాగలరని
కోరుచున్నాము

# శతకోటి హరేరామ నామ జపయజ్ఞ సేవా సమితి

గ్రామం.భావానందపురం, పోస్టు,మం.మరుకూకు, జి.సిద్ధిపేట, తెలంగాణ - చరవాణి : 9676454189, 9490069355



# బ్రహ్మస్వభవనం ట్రస్టు,వారణాసి

సోనార్‌పురా,క్షీర్‌సాగర్ స్వీట్‌హౌజ్ పక్కన,కేదారఖండం




**కాశీలో సదాచారసంపన్నులకు సకల వసతులతో రూ.ఐదు కోట్ల వ్యయంతో ఐదు అంతస్తుల ధార్మిక బ్రహ్మస్వ భవనం నిర్మాణం**

కాశీలోని కేదారఖండం సోనార్‌పురాలో శ్రీశ్రీశ్రీ బ్రహ్మానందతీర్థస్వామివారి సంకల్పంతో ఏర్పాటుచేసిన బ్రహ్మస్వభవనం ట్రస్టులో సదాచారసంపన్నులు, కాశీలో నిష్ఠగా దీక్షతో వాసంచేసేవారికి శుచిగా అన్నప్రసాదం, వసతి అందించటం, ధార్మిక సేవాకార్యక్రమాలు నిర్వహించుకోటానికి తగిన వ్యవస్థను అందించే సమున్నత లక్ష్యంతో బ్రహ్మస్వభవనం ట్రస్టు ఏర్పాటయింది. ఈ లక్ష్యంతో గత రెండున్నర సంవత్సరాలుగా తాత్కాలిక భవనంలో లక్ష మందికి మడితో భోజనం,వసతి అందించి ఎన్నో ధార్మిక కార్యక్రమాలు, సత్సంగాలను నిర్వహించింది. ప్రస్తుతం ఐదుకోట్ల రూపాయల వ్యయంతో ఐదు అంతస్తుల ధార్మిక భవనాన్ని నిర్మాణం చేస్తోంది. శృంగేరీ జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విధుశేఖరభారతీస్వామివారు తమ కరకమలములచే ఈ భవననిర్మాణానికి శిలాన్యాసం చేసి అనుగ్రహించారు. ఈ మహత్తర కార్యాచరణలో ఆస్తికమహాజనులందరూ భాగస్వాములై బ్రహ్మస్వ భవనం నిర్మాణానికి తమ శక్తిమేర విరాళాలు అదించి అన్నపూర్ణా,విశాలాక్షీ సమేత కాశీ విశ్వనాథుని అనుగ్రహానికి పాత్రులు కాగలరని కోరుతున్నాము.

BRAHMASWA BHAVANAM TRUST VARANASI

Merchant Name : BRAHMASWA BHAVANAM TRUST
UPI ID : brahmaswabhavanam@sbi

BHIM UPI

G20 — ONE EARTH • ONE FAMILY • ONE FUTURE

BRAHMASWA BHAVANAM TRUST
SBI A/C NO 43207617077
IFSC CODE SBIN0021461
SWIFT CODE SBININBB
SARASWATHI NAGAR BRANCH SAIDABAD, HYDERABAD

వివరాలకు 9441015469, 9866351972, 9440507716,9440734105 నెంబర్లకు సంప్రదించగలరు

## బ్రహ్మస్వభవనం నిర్మాణంలో భాగస్వాములయ్యే వదాన్యులకు సూచనలు... విన్నపం

లక్ష రూపాయలు విరాళం ఇచ్చే
వదాన్యులకు, వారి కుటుంబసభ్యులకు
ప్రతిసంవత్సరం మూడు రోజుల ఉచిత వసతి

ఐదు లక్షల రూపాయల విరాళం ఇచ్చే
వదాన్యులకు, వారి కుటుంబసభ్యులకు
ప్రతిసంవత్సరం 15 రోజుల ఉచిత వసతి

పది లక్షల రూపాయలు విరాళం ఇచ్చే
వదాన్యులకు, వారి కుటుంబసభ్యులకు
ప్రతిసంవత్సరం 30 రోజుల ఉచిత వసతి

ఇరవై ఐదు లక్షల రూపాయలు విరాళం ఇచ్చే
వదాన్యులకు,వారి కుటుంబసభ్యులకు
ప్రతిసంవత్సరం 60 రోజుల ఉచిత వసతి

కోటి రూపాయలు విరాళం ఇచ్చే
వదాన్యులకు,వారి కుటుంబసభ్యులకు
శాశ్వత వసతిగా ఒక గది కేటాయింపు
(ఒక అంతస్తుకు వారిపేర శిలాఫలకం)






దర్శనమ్ కార్యాలయాన్ని సందర్శించిన శృంగేరీ జగద్గురు శ్రీశ్రీశ్రీ విధుశేఖరభారతీస్వామివారు



RNI Regd No. APTEL/2005/16209
Date of Publication : 25th of Every Month
Date of Posting : 28th & 29th of Every Month

DARSHANAM
DECEMBER- 2025

Postal Regd.No. HQ/SD/508/2025-2027
WPP NO:PMG/TS/HQR/SC-01/WPP/2025-2027
Licensed to Post Without Prepayment
Posting at B.P.C - IV Patrika Channel,Nampally,Hyderabad-01


PM Hoist Double Cage, Hyderabad


PM Hoist with 12mts Horizontal rebar carrier, Vijayawada


Curved Hoist Bangladesh

# CMAC

Mechanisation & Automation in Construction
ISO 9001:2015 CERTIFIED COMPANY
AND
CE CERTIFIED COMPANY

## Equipments & Solutions for Infrastructure fraternity. Residential, Commercial Infrastructure, Power, Steel, Cement & Industrial Infra

Innovation with safety & Sustainability
Export them as Made in India


Multi Functional Hoist, Nagpur



MFH - CMAC Rambo with Rebar Carrier, Delhi


Chimney SRP, Mumbai


Pre Cast Panel Movement SRP, Hyd.


Anji Khad Cable Stayed Bridge Project,
Dist.: Reasi, Jammu


PMH at Pump House, Kaleshwaram


Bridge Special SRP at Durgam Cheruvu,
Cable Stayed Bridge, Hyd.

**ConMechAuto Consultants India Pvt Ltd.,**
**Head Office** : # 1-3-183/40/19, 2nd Floor, SBI Colony,
Gandhi Nagar, Hyderabad - 500 080, India.
Tel. No.: + 91- 40 - 2754 1464

**Factories :**
Phase 2, Phase 5, IDA Cherlapally,
Hyderabad - 500 051

For Further Details:
**CONTACT : 9393 111 464**
**Email : sales@cmac.co.in**
**www.cmac.co.in**

*If Undedelivered please return to:*
DARSHANAM Devotional Magazine,Srirama Siddhanthi Bhavanam, H.No.29-105/4/1
Rythu Bazar Road, New Vidyanagar Colony, Neredmet, Secunderabad, 500056
Mobile 7013093123, 9441015469 *e mail: darshanameditordesk@gmail.com*